గురువారం । 3 । ఏప్రిల్ । 2025
హైదరాబాద్ । www.sakshi.com

# రేపు వీసీల సమావేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల వైస్‌చాన్స్‌లర్‌లతో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి శుక్రవారం సమావేశం కానున్నారు. ఇందులో పలు అంశాలపై చర్చిస్తారు. కామన్ అకడమిక్ కేలండర్, అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల సిలబస్‌లో మార్పులు, అనుబంధ కాలేజీల గుర్తింపు, యూజీ, పీజీ కోర్సుల మార్పిడి, కామన్ పోస్టు-గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ టెస్ట్‌తో పాటు పలు అంశాలపై చర్చిస్తారు.

ఈనాడు గురువారం ఏప్రిల్ 3, 2025

# మళ్లీ తెరపైకి డిగ్రీ ఉమ్మడి విద్యా ప్రణాళిక

## రేపు వీసీలతో ఉన్నత విద్యామండలి సమావేశం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో డిగ్రీ కోర్సులకు ఉమ్మడి విద్యా ప్రణాళికను అమలు చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి భావిస్తోంది. అన్ని యూనివర్సిటీల పరిధిలో ఒకేసారి తరగతుల ప్రారంభం, పరీక్షల నిర్వహణ, ఫలితాల విడుదల ఉండాలని భావించి 2022లో కామన్ అకడమిక్ క్యాలెండర్‌ను ప్రకటించారు. అది ఏడాదికే పరిమితమై.. తర్వాత గాడి తప్పింది. తాజాగా మరోసారి ఈ అంశం తెరపైకి వచ్చింది. ఒక్కో వర్సిటీలో ఒక్కోవిధంగా సెమిస్టర్లు నడుస్తుండగా.. దానివల్ల గందరగోళం నెలకొంటోంది. ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహిద్దామంటే కొన్ని వర్సిటీలు పరీక్షలు కాలేదని.. మరికొన్ని ఫలితాలు రాలేదని చెబుతున్నాయి. అందుకే ఈసారి మళ్లీ ఉమ్మడి విద్యా ప్రణాళికను పట్టాలెక్కించి.. గాడినపెట్టాలని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి భావిస్తున్నారు. దాంతో డిగ్రీ సిలబస్ మార్పు, యూజీ, పీజీ కోర్సుల కన్వర్షన్, ఉమ్మడి పీజీ ప్రవేశాల పరీక్ష (సీపీగెట్) నిర్వహణ, కళాశాలల అనుబంధ గుర్తింపు తదితర అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకునేందుకు ఆయన ఈ నెల 4వ తేదీన ఉపకులపతుల(వీసీల)తో సమావేశం నిర్వహించనున్నారు. సీపీగెట్‌ను గత కొన్నేళ్లుగా ఓయూ నిర్వహిస్తున్నందున.. ఈసారి కాకతీయ వర్సిటీకి అప్పగిస్తారా? అన్న చర్చ కూడా సాగుతోంది. లేనిపక్షంలో సీపీగెట్ దరఖాస్తులు, ప్రవేశాల కౌన్సెలింగ్ ద్వారా వచ్చే ఆదాయాన్ని అన్ని వర్సిటీలకు పంచే అవకాశాన్ని పరిశీలిస్తున్నారు.

వార్త, హైదరాబాద్, ఆదివారం 6, ఏప్రిల్ 2025

## ముగిసిన ఎప్‌సెట్ దరఖాస్తు గడువు

### 2.91 లక్షలు దాటిన దరఖాస్తులు

### 29, 30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు

### మే 2న ఇంజనీరింగ్ పరీక్షలు

**హైదరాబాద్, ఏప్రిల్ 5,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఇంజనీరింగ్‌తోపాటు,ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించనున్న ఇంజనీరింగ్ అగ్రికల్చర్, ఫార్మసీ కామన్‌నఎంట్రన్స్ టెస్ట్(ఈఏపీ సెట్)-2025దరఖాస్తుల ప్రక్రియ ముగిసింది. అపరాధ రుసుంతో ఈ నెల 24 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది. శుక్రవారం సాయంత్రం వరకు 2,91,965 దరఖాస్తులు వచ్చాయి. మార్చి 1 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. శుక్రవారం సాయంత్రం వరకు 2,91,965 దరఖాస్తులు వచ్చినట్టు ఎప్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ డీన్ కుమార్, కో కన్వీనర్ డాక్టర్ విజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఇంజనీరింగ్‌కి 2,10,567 దరఖాస్తులు రాగా.. అగ్రికల్చర్, ఫార్మసీకి 81,172 దరఖాస్తులు వచ్చాయి. >>2

## ముగిసిన ఎప్‌సెట్ దరఖాస్తు గడువు

>> రెండింటికి కలిపి 226 దరఖాస్తులు వచ్చాయి. ఎప్ సెట్-2025 నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 20న జారీ చేయగా.. దరఖాస్తులను మార్చి 1 నుంచి స్వీకరిస్తున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను శుక్రవారం(ఏప్రిల్ 4) వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా స్వీకరించారు. అపరాధ రుసుం లేకుండా దరఖాస్తుల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో నేటి(ఏప్రిల్6) నుంచి 8 వరకు దరఖాస్తుల్లో దొర్లిన తప్పులను సరిచేసుకోడానికి అవకాశం కల్పించారు. అపరాధ రుసుం రూ.250తో ఈ నెల 9 వరకు, రూ.500తో ఈ నెల 14 వరకు, రూ. 2500తో ఈ నెల 18 వరకు.. అపరాధ రుసుం రూ. 5000లతో ఈ నెల 24 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలను ఈ నెల 29, 30 తేదిల్లో నిర్వహించనుండగా.. ఇంజనీరింగ్ పరీక్షలను మే 2 నుంచి 5 వరకు నిర్వహించనున్నారు. పరీక్షలను రెండు సెషన్‌లలో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన జెఎన్‌టియుహెచ్ ఉపకులపతి కిషన్ కుమార్ రెడ్డి జవాహార్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ (జెఎన్టీయూహెచ్) ఉపకులపతి(విసి)గా విధులు నిర్వర్తిస్తున్న ప్రొఫెసర్ టి కిషన్ కుమార్‌రెడ్డి శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉపకులపతి ముఖ్యమంత్రికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్య, పరిశోధన, సాంకేతిక అభివృద్ధి రంగాలలో చేపట్టిన ప్రగతిశీల కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు. ముఖ్యమంత్రి గారి దూరదృష్టి నాయకత్వం రాష్ట్రంలోని విద్యా రంగాన్ని మరింతగా బలోపేతం చేస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు.

సాక్షి
ఆదివారం। 6।
ఏప్రిల్। 2025

# సెట్స్–2025 అడ్మిషన్స్ కన్వీనర్‌గా పాండురంగారెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ: టీజీ సెట్స్–2025(లాసెట్, ఎడ్‌సెట్, పీజీసెట్, ఐసెట్ తదితర) అడ్మిషన్స్ రాష్ట్ర కన్వీనర్‌గా ఓయూ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. సైన్స్ కాలేజీ భూ విజ్ఞాన శాస్త్రం(జియాలజీ) విభాగానికి చెందిన ప్రొ.పాండురంగారెడ్డి గతంలో పాలమూరు వర్సిటీ రిజిస్ట్రార్‌గా, సైఫాబాద్ పీజీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్, ప్రిన్సిపాల్‌గా, ఓయూ పరీక్షల విభాగం కాన్ఫిడెన్షియల్ అడిషనల కంట్రోలర్‌గా, టీజీ సీపీజీఈటీ రాష్ట్ర కన్వీనర్‌గా పనిచేశారు. ప్రస్తుతం పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్‌గా కొనసాగుతున్న పాండురంగా రెడ్డిని సెట్స్–2025 అడ్మిషన్స్ కన్వీనర్‌గా రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.బాలకిష్టారెడ్డి నియమించినట్లు పేర్కొన్నారు.

# విదేశీ డిగ్రీకి దేశీయ పట్టా

## ▸▸ యూజీసీ కొత్త మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యావిధానంలో భాగంగా విదేశాలతో భారత్ అకడమిక్ రంగంలో భాగస్వామ్యం కుదుర్చుకున్న రీత్యా విదేశీ డిగ్రీలను గుర్తించేందుకు యూజీసీ తాజా మార్గదర్శకాలను విడుదల చేసింది. అంతర్జాతీయ విద్యార్హతలతో తిరిగి వచ్చే విద్యార్థులను భారతీయ ఉన్నత విద్యావ్యవస్థలో భాగం చేసేందుకు వీలుగా ఎలాంటి జాప్యం లేకుండా వారి డిగ్రీలను సమీక్షించేందుకు యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి, నిబంధనలను రూపొందించినట్లు యూజీసీ ఛైర్మన్ జగదీశ్ శనివారం వెల్లడించారు. తాజా నిబంధనల ప్రకారం విదేశీ విద్యాసంస్థల నుంచి పొందిన డిగ్రీలకు సమానంగా ఈక్వివాలెన్స్ సర్టిఫికెట్ పొందేందుకు యూజీసీ ఏర్పాటు చేసిన పోర్టల్‌లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కమిషన్ నియమించిన స్టాండింగ్ కమిటీ పదిరోజుల్లో ఈ దరఖాస్తులను పరిశీలించి సర్టిఫికెట్ జారీ చేస్తుంది. ఈ సర్టిఫికెట్ పోర్టల్‌లోనే లభ్యమవుతుంది. దరఖాస్తులో పేర్కొన్న వివరాల పట్ల కమిటీ సంతృప్తి చెందకపోతే 15 రోజుల్లోపు అదనపు సమాచారాన్ని సమర్పించాల్సిందిగా కోరుతుంది. దరఖాస్తు తిరస్కరణకు గురైన పక్షంలో 30 పనిదినాల్లో నిర్దిష్ట ఫీజు చెల్లించి పునఃపరిశీలన కోరవచ్చు. దానిని ప్రత్యేక రివ్యూ కమిటీ తిరిగి పునఃపరిశీలించి పది రోజుల్లో తన నిర్ణయాన్ని తెలుపుతుంది. మెడిసిన్, ఫార్మసీ, నర్సింగ్, లా, ఆర్కిటెక్చర్ రంగాల్లో విదేశీ విద్యాసంస్థలు ప్రదానం చేసే డిగ్రీలకు ఇది వర్తించదని, వాటిని గుర్తించేందుకు ఇప్పటికే చట్టబద్ధమైన కౌన్సిళ్లు ఉన్నాయని ఆయన చెప్పారు

**నమస్తే తెలంగాణ**
హైదరాబాద్
ఆదివారం 6 ఏప్రిల్ 2025
www.ntnews.com

# రెండు విడతల్లోనే డిగ్రీ అడ్మిషన్లు

- ఆ తర్వాత ప్రవేశాలకు నో చాన్స్.. కొత్త నిర్ణయంతో అడ్మిషన్లు తగ్గే అవకాశం
- మరీ బీటెక్, బీ ఫార్మసీలో సీట్లు రాని వారి పరిస్థితేంటన్న ప్రశ్నలు ఉత్పన్నం

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) : 'సీట్లు ఎక్కువ.. చేరే వారు తక్కువ. ఏటా 50శాతంలోపే అడ్మిషన్లు. 50కిపైగా కాలేజీల్లో సున్నా అడ్మిషన్లు' వాస్తవ పరిస్థితులిలా ఉంటే డిగ్రీ ఫస్టియర్ అడ్మిషన్ల విషయంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి మరో వివాదాస్పద నిర్ణయం తీసుకున్నది. ఇది వరకు నాలుగైదు విడతల్లో ప్రవేశాలకు అవకాశం కల్పించగా, ఇక నుంచి రెండు విడతలకే పరిమితం చేయాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. ఆ తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ డిగ్రీలో ప్రవేశాలకు అవకాశం కల్పించొద్దని పేర్కొంది. శుక్రవారం జరిగిన వైస్‌చాన్స్‌లర్ల సమావేశంలో డిగ్రీ అకాడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేయగా, జూన్ 16 నుంచే ఫస్టియర్ క్లాసులు ప్రారంభించాలని నిర్ణయించారు. 2024-25లో ఫస్టియర్‌లో 4,57,704 సీట్లుండగా, 1,96,442 మంది విద్యార్థులు మాత్రమే ప్రవేశాలు పొందారు. 2.61లక్షల సీట్లు మిగిలాయి. చాలా కాలేజీల్లో 10-15 మంది మాత్రమే చేరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రైవేట్ కాలేజీలు అడ్మిషన్లు లేక కునారిల్లుతున్నాయి. నాలుగైదు విడతల్లో అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తేనే ఇలా ఉంటే.. మరీ రెండు విడతల్లోనే పూర్తిచేస్తే అడ్మిషన్లు మరింత తగ్గిపోయే ప్రమాదమున్నది. ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు జూలైలో విడుదలవుతాయి. ఎప్‌సెట్ కౌన్సెలింగ్ పూర్తికావాలంటే జూలై గడిచిపోతుంది. జేఈఈ కౌన్సెలింగ్ తర్వాత మరో విడత ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. బీ ఫార్మసీ కౌన్సెలింగ్ ఆగస్టు, సెప్టెంబర్‌లో పూర్తవుతుంది. మరీ జూన్‌లోనే డిగ్రీ ఫస్టియర్ అడ్మిషన్లు పూర్తిచేస్తే బీటెక్, బీ ఫార్మసీ, లా కోర్సులు, ఐఐటీలు, ఎన్ఐటీల్లో సీట్లు రాని, సప్లిమెంటరీ విద్యార్థులు చదువులకు దూరం కావాల్సిందేనా..? అని ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు ప్రశ్నిస్తున్నాయి.

# విదేశీ డిగ్రీల గుర్తింపుపై కొత్త నిబంధనలు

## దరఖాస్తుల కోసం త్వరలో యూజీసీ కొత్త పోర్టల్

ముంబై: విదేశీ విద్యార్థులకు సంబంధించిన డిగ్రీలను ఆమోదించే విధానాన్ని క్రమబద్ధీకరిస్తూ యూజీసీ కొత్త నిబంధనలను తీసుకువచ్చింది. విదేశాలలో పొందిన డిగ్రీలు, స్కూల్ సర్టిఫికెట్లను తనిఖీ చేసి గుర్తింపు ఇచ్చేందుకు ఆన్‌లైన్ పోర్టల్‌ను యూజీసీ ప్రవేశపెట్టనున్నది. ప్రపంచవ్యాప్తంగా భారత్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చే దృక్పథంతో జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ)లో భాగంగా విదేశీ డిగ్రీల గుర్తింపు ప్రక్రియను సులభతరం చేయడమే ఈ కొత్త నిబంధన ఉద్దేశమని యూజీసీ చైర్మన్ జగదీశ్ కుమార్ చెప్పారు. అంతర్జాతీయ డిగ్రీలు లేదా స్కూలు విద్యార్హతలతో చాలా మంది విద్యార్థులు భారత్‌కు తిరిగివస్తారని, అయితే వాటికి గుర్తింపు పొందడంలో తీవ్ర జాప్యాలు, అవరోధాలు ఎదుర్కొంటారని ఆయన చెప్పారు. ఈ కొత్త నిబంధన స్పష్టతను, కచ్చితమైన అంచనాను, నిష్పాక్షికతను అందచేయగలదని ఆయన వివరించారు. విదేశీ విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఓ ఆన్‌లైన్ పోర్టల్‌ను యూజీసీ ప్రారంభించనున్నది. విద్యా సంబంధ నిపుణులతో కూడిన స్టాండింగ్ కమిటీ ఈ దరఖాస్తులను సమీక్షించి 15 పని దినాలలో తన నిర్ణయాన్ని తెలియచేస్తుంది. గుర్తింపు ఇచ్చేందుకు ప్రోగ్రామ్ కాల నిడివి, క్రెడిట్ హవర్స్, వాల్యుయేషన్ ప్రాసెస్, అకడమిక్ రికార్డులను కమిటీ పరిగణనలోకి తీసుకుంటుంది.

ఆంధ్రప్రభ సోమవారం 7-4-2025

# వర్సిటీల్లో జాబ్‌మేళా

**అధ్యాపక ఖాళీల భర్తీకి మార్గదర్శకాలు జారీ**



**● మూడు దశల్లో నియామక ప్రక్రియ ● 12 వర్సిటీల్లో రెండున్నర వేల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఖాళీలు**

హైదరాబాద్, ఆంధ్రప్రభ బ్యూరో: తెలంగాణ వర్సిటీల్లో అధ్యాపక ఉద్యోగాల కోసం పదిహేనేళ్లుగా కళ్లలో వత్తులు వేసుకొని ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీపి కబురు అందించింది. తెలంగాణ రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న రెండున్నర వేలకు పైగా సహాయ ఆచార్యుల (అసిస్టెంట్ ప్రొఫెసర్) ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఉత్తర్వులు జారీ చేశారు. మూడు రోజుల క్రితం రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల ఉపకులపతులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివిధ అంశాలపై చర్చించారు. విశ్వ విద్యాలయాల్లో అధ్యాపకుల

➪ 5వ పేజీలో...

సోమవారం 7- 4 - 2025

ఆంధ్రప్రభ



# వర్శిటీల్లో జాబ్‌మేళా




(మొదటిపేజీ తరువాయి)

ఖాళీలు పదిహేనేళ్లుగా భర్తీ చేయడం లేదని, దీంతో విద్యా ప్రమాణాలు అడుగంటిపోతున్నాయని ఉపకుల పతులు ఏకరువు పెట్టారు. ఖాళీల భర్తీకి ఎటువంటి చర్యలు తీసుకుంటారని సీఎం రేవంత్ రెడ్డి అడగ్గా యూజీసీ నిబంధనల ప్రకారం నేరుగా నియామకాలు చేపడతామని సమావేశంలో పాల్గొన్న ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి చెప్పడంతో పూర్తి పారదర్శకంగా ఆరోపణలకు తావు లేకుండా నియామకాలను జరపాలని, ఎక్కడా ఎటువంటి పొరపాటు జరిగినా అది ప్రభుత్వంపై మరకపడుతుందని రేవంత్ హెచ్చరించినట్టు సమాచారం. సహాయ ఆచార్యుల ఖాళీల భర్తీకి సీఎం రేవంత్ అనుమతి ఇవ్వడంతో ప్రభుత్వం నియామకాలను చేపట్టేందుకు ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలుస్తోంది. ఖాళీలను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ విధానం ద్వారా భర్తీ చేయాలని ఆదేశించిన ప్రభుత్వం అందుకు మార్గదర్శకాలను ప్రభుత్వ ఉత్తర్వు 21 ద్వారా తెలిపింది. ఈ కొత్త ఉత్తర్వుల ప్రకారం గతంలో అమలు చేసిన నియామక ఉత్తర్వులు రద్దయ్యాయి. కొత్తగా మూడు దశల్లో నియామక ప్రక్రియ చేపట్టే విధానం అమల్లోకి వచ్చింది.

అధ్యాపక ఖాళీల భర్తీకి తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి నేతృత్వంలో ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ చేసిన సిఫారసుల ఆధారంగా ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను రూపొందించింది. తెలంగాణలోని 12 విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, వర్సిటీల రిజిస్ట్రార్లు ఆయా విశ్వవిద్యాలయాల పాలకమండలి సమావేశం ముందుంచి ఆమోదించుకోవాల్సి ఉంటుంది. ఈ నూతన మార్గదర్శకాలు అన్ని సాంప్రదాయ విభాగాలకు ఇంజ నీరింగ్, టెక్నాలజీ, లైబ్రరీ సైన్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభా గాలకు కూడా వర్తిస్తాయని ప్రభుత్వం జారీ చేసిన తాజా ఉత్త ర్వులో పేర్కొంది. నియామకాల విషయంలో తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న రిజర్వేషన్ల విధానం, రోస్టర్ విధా నాన్ని ఖచ్చితంగా పాటించాలని ఉత్తర్వులో స్పష్టం చేసింది.

## నియామక ప్రక్రియ ఇలా..

మొత్తం మూడు దశల్లో అధ్యాపక ఖాళీలను భర్తీ చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం అవి ఎలా ఉండాలన్న అంశంపై విధివిధానాలను ఖరారు చేసింది.

**1) అకడమిక్, పరిశోధన**

అధ్యాపక ఖాళీల భర్తీకి తొలిదశలో అకడమిక్ పరిశోధనలకు పెద్దపీట వేయాలని ప్రతిపాదించింది. పరిశోధన, అకడమిక్, విద్యార్హతలు, అనుభవం, సిద్ధాంత పత్రాలకు 50 మార్కులు కేటాయించనున్నారు. ఖాళీల భర్తీకి వచ్చిన దరఖాస్తులను తొలుత పరిశీలిస్తారు. సంబధిత విషవిద్యాలయ ఉపకులపతి, ఉన్నత విద్యామండలి ఎంపిక చేసే సబ్జెక్ట్ నిపుణుడు, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్, హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ కన్వీనర్‌గా స్క్రూటినీ కమిటీని నియమించి వచ్చిన దరఖాస్తులను వడ పోస్తారు. ఇందులో అండర్ గ్రాడ్యుయేట్‌లో దరఖాస్తు దారుడు 70 శాతం పైగా మార్కులు సాధిస్తే 8 పాయింట్లు (మార్కులు), 60 నుంచి 70 శాతానికి 6 మార్కులు, 50 నుంచి 60 శాతం మార్కులకు 4, 50 శాతం కన్నా తక్కువ ఉంటే 2 మార్కులు కేటాయించనున్నారు. పీజీలో 70 శాతం పైగా మార్కులు ఉంటే 12 మార్కులు, 60 నుంచి 70 శాతం ఉంటే 10 మార్కులు, 50 నుంచి 60 శాతం సాధిస్తే 8 మార్కులు కేటాయిస్తారు. అర్హత పరీక్షలకు జేఆర్ఎఫ్‌కు 10 మార్కులు, నెట్, స్లేట్, సెట్‌కు 5 మార్కులు, పీహెచ్‌డీకి 10 మార్కులు, ఎంఫిల్‌కు 5 మార్కులు ఇవ్వనున్నారు. రీసెర్చ్ పబ్లికేషన్స్, కాన్ఫరెన్స్‌కు 5 మార్కులు ఇవ్వనున్నారు.

**వర్సిటీల వారీగా ఖాళీల వివరాలు ఇవే...**

| యూనివర్సిటీ | ప్రొఫెసర్లు | అసోసియేట్ | అసిస్టెంట్ | వర్కింగ్ | ఖాళీలు |
|---|---|---|---|---|---|
| ఉస్మానియా | 147 | 53 | 131 | 331 | 936 |
| కాకతీయ | 0 | 2 | 77 | 79 | 330 |
| తెలంగాణ | 3 | 10 | 48 | 61 | 91 |
| మహాత్మాగాంధీ | 0 | 6 | 29 | 35 | 35 |
| శాతావాహన | 0 | 0 | 16 | 16 | 47 |
| పాలమూరు | 0 | 2 | 16 | 18 | 77 |
| సురవరం | 0 | 0 | 8 | 8 | 47 |
| బీఆర్. అంబేద్కర్ | 0 | 1 | 23 | 24 | 62 |
| జేఎన్‌టీయూ | 22 | 44 | 86 | 152 | 258 |
| జేఎన్ఎఫ్ఏయూ | 2 | 2 | 10 | 14 | 47 |
| ఆర్‌జీయూకేటీ | 0 | 0 | 19 | 19 | 129 |
| **మొత్తం ఖాళీలు** | | | | **757** | **2060** |

ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన వీరనారీ చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీ ఖాళీలను ప్రకటించాల్సి ఉంది. ఇవికాక మరో 400 ఖాళీలు భర్తీ చేయాల్సి ఉంటుందని అధికారవర్గాలు పేర్కొన్నాయి.

**2) విషయ పరిజ్ఞానం, బోధనా నైపుణ్యానికి 30 మార్కులు**

ఈ అంశానికి సంబంధించి స్క్రీనింగ్ కమిటీని ఎంపిక చేస్తారు. ఇందులో డీన్, ఉన్నత విద్యామండలి నిపుణుడు, ఉపకులపతి ఎంపిక చేసే విద్యావేత్త ఉంటారు. బోధనా అనుభవానికి విద్యా సంవత్సరానికి ఒక మార్కు గరిష్టంగా 10 మార్కులు కేటాయించనున్నారు. పుస్తక రచన చేపడితే స్వీయ రచనకు 5 మార్కులు, సంయుక్త రచనకు 3 మార్కులు, ఎడిటర్‌గా వ్యవహరిస్తే 2 మార్కులు ఇవ్వనున్నారు.

ఫెలోషిప్స్: పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్, రీసెర్చ్ అసోసియేట్‌కు 2 మార్కులు గరిష్టంగా 5 మార్కులు కేటాయిస్తారు. డెమో లెక్చరర్‌కు 10 మార్కులు గరిష్టంగా కేటాయిస్తారు.

**3) మౌఖిక ఇంటర్వ్యూకు 20 మార్కులు**

ఉపకులపతి అధ్యక్షతన సెలెక్షన్ కమిటీ బోర్డు ఏర్పాటవుతుంది. అభ్యర్థి డొమైన్ నాలెడ్జ్, సబ్జెక్ట్ ప్రెజెంటేషన్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, వ్యక్తిత్వం అంచనా ఆధారంగా మార్కులు కేటాయిస్తారు. మూడు దశల్లో అభ్యర్థులు పొందిన మార్కులు, అభ్యర్థుల జాబితాను అధికారిక వెబ్‌సైట్‌లో ప్రచురిస్తారు. ఒక్కో పోస్టుకు 10 మందిని మౌఖిక ఇంటర్వ్యూకు పిలుస్తారు. రెండో దశలో ఒక్కో పోస్టుకు ఐదుగురిని ఇంటర్వ్యూ చేస్తారు. రెండు సందర్భాల్లోనూ రిజర్వేషన్లను పరిగణలోకి తీసుకుంటారు.

ప్రభాత
వెలుగు
సోమవారం | హైదరాబాద్
07.04.2025
www.v6velugu.com



# వర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి గ్రీన్ సిగ్నల్

- గైడ్ లైన్స్ రిలీజ్ చేసిన రాష్ట్ర సర్కార్
- అకడమిక్ రికార్డ్, రీసెర్చ్‌కు 50% మార్కులు
- టీచింగ్ స్కిల్స్, విషయ పరిజ్ఞానానికి 30 మార్కులు
- ఇంటర్వ్యూలకు 20 మార్కులు కేటాయించిన ప్రభుత్వం
- త్వరలో పోస్టులు భర్తీ చేయనున్న సర్కార్

02

# వర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి గ్రీన్ సిగ్నల్

- గైడ్ లైన్స్ రిలీజ్ చేసిన రాష్ట్ర సర్కార్

**హైదరాబాద్, వెలుగు:** రాష్ట్రంలోని సర్కారు యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టుల భర్తీకి లైన్ క్లియర్ అయింది. 12 యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గైడ్ లైన్స్ రిలీజ్ చేసింది. అన్ని వర్సిటీలకు ఒకే రకమైన మార్గదర్శకాలు అమలు చేయనున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఉత్తర్వులు జారీ చేశారు. వర్సిటీల్లోని ప్రొఫెసర్ల భర్తీకి ప్రభుత్వం ఆమోదం తెలపడంతో పాటు విధివిధానాలు తయారు చేయాలని అధికారులను గతంలోనే సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. దీంతో అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి నేతృత్వంలో హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ బాలకిష్టారెడ్డి కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ వర్సిటీల్లో ఖాళీ పోస్టుల భర్తీ కోసం గైడ్ లైన్స్ రూపొందించి, కౌన్సిల్‌కు అందించింది. వీటిని కౌన్సిల్ అధికారులు సర్కారుకు పంపించారు. కమిటీ సిఫార్సుల మేరకు మార్గదర్శకాలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోని రిజర్వేషన్ల అమలుతో పాటు రోస్టర్ విధానాన్ని ఈ పోస్టుల భర్తీలో అమలు చేయాలని సర్కారు ఆదేశించింది.

**వెయిటేజీ ఇలా..**

అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి సంబంధించి మూడు విధానాల్లో వెయిటేజీ మార్కులను కేటాయించనున్నట్టు సర్కారు తెలిపింది. ప్రధానంగా అకడమిక్ రికార్డ్, రీసెర్చ్ పర్ఫామెన్స్‌కు 50 శాతం మార్కులు అలాట్ చేశారు. ఇందులో డిగ్రీ మార్కులకు 8,



పీజీ మార్కులకు 12 మార్కులను గరిష్టంగా కేటాయించారు. జేఆర్ఎఫ్, నెట్/సెట్, పీహెచ్‌డీ, ఎంఫిల్‌కు, రీసెర్చ్ పబ్లికేషన్లు, కాన్ఫరెన్స్‌ల నిర్వహణకు మిగిలిన మార్కులకు అలాట్ చేశారు. వీటిని పరిశీలించేందుకు వర్సిటీ వీసీతో పాటు హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ నామిని (సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్), బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్, డిపార్ట్‌మెంట్ హెడ్ కన్వీనర్‌గా ఉంటారు.

- టీచింగ్ స్కిల్స్, విషయ పరిజ్ఞానానికి 30 మార్కులు కేటాయించారు. ఇందులో టీచింగ్ ఎక్స్‌పీరియెన్స్‌కు గరిష్టంగా పది మార్కులు ఉన్నాయి. అయితే, ఒక్కో ఏడాదికి ఒక్కో మార్కు చొప్పున ఇవ్వనున్నారు. ప్రధానంగా కాంట్రాక్టు ఫ్యాకల్టీని దృష్టిలో పెట్టుకొని ఈ రూల్ తీసుకొచ్చారు. సర్కారు కాలేజీలతో పాటు ప్రైవేటు కాలేజీల్లోని లెక్చరర్లకూ ఇది వర్తించనుంది. ఒక్కరే పుస్తకాన్ని రాస్తే ఐదు మార్కులు, జాయింట్‌గా రాస్తే మూడు మార్కులు, ఎడిటర్‌గా ఉంటే రెండు మార్కులు పొందొచ్చు. ఫెలోషిప్స్‌కు గరిష్టంగా ఐదు మార్కులు, డెమో లెక్చర్‌కు పది మార్కులు కేటాయించారు. వీటిని పరిశీలించేందుకుగాను ఫ్యాకల్టీ డీన్, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ (కౌన్సిల్ నామిని), సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ (వీసీ నామిని)తో స్క్రీనింగ్ కమిటీ ఉంటుంది.
- ఇంటర్వ్యూలకు 20 మార్కులు కేటాయించారు. సబ్జెక్ట్ ప్రజెంటేషన్, రీసెర్చ్ అప్టిట్యూడ్, ఓవరాల్ పర్సనాలిటీ, ఇంటర్వ్యూ పర్ఫామెన్స్ ఆధారంగా మార్కులు ఇవ్వనున్నారు. దీనికి వర్సిటీ వీసీ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ ఇంటర్వ్యూలను నిర్వహించనుంది. కాగా, మొదటి దశలో అందరి మార్కులను పరిగణనలోకి తీసుకొని, 1:10 రేషియోలో రెండో దశకు ఎంపిక చేశారు. ఇందులో నుంచి 1:5 రేషియాలో ఇంటర్వ్యూలకు సెలెక్ట్ చేస్తారు.

**ఎన్ని పోస్టులు..?**

**గత ప్రభుత్వ హయాంలో 1,060 పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అయితే, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 2,817 టీచింగ్ పోస్టులు సాంక్షన్ ఉండగా, 2,125 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం ఎన్ని పోస్టులను భర్తీ చేస్తుందనే దానిపై సస్పెన్స్ కొనసా గుతోంది. మరోపక్క జీవోలో కేవలం అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి మాత్రమే అనుమతి ఇచ్చింది. దీంతో ఈ లెక్కన 1,524 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులుంటే, దాంట్లో 1,061 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అత్యధికంగా ఓయూలో 470 పోస్టులు ఉన్నాయి.**

నమస్తే తెలంగాణ హైదరాబాద్, సోమవారం 7 ఏప్రిల్ 2025

# 'స్క్రీనింగ్ టెస్టుకు' మంగళం!

- అకడమిక్ రికార్డు, టీచింగ్ స్కిల్స్, ఇంటర్వ్యూ ఆధారంగా నియామకం
- అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి దొడ్డి దారిలో జీవో
- ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల భర్తీ ఊసేలేదు
- మండిపడుతున్న విద్యార్థి సంఘాలు

హైదరాబాద్, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ) : యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి 'స్క్రీనింగ్ టెస్టు' విధానం రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. ప్రతిభకు పాతర వేసి.. అనుభవం, ఇంటర్వ్యూ మార్కుల ఆధారంగా పోస్టులను భర్తీ చేయనున్నట్టు ప్రకటించింది. ఈ నెల 4న జీవో 21ని దొడ్డిదారిలో విడుదల చేసింది. అకడమిక్ రికార్డు, రీసెర్చ్ వెయిటేజీకి 50, డొమైన్ పరిజ్ఞానంతో పాటు టీచింగ్ నైపుణ్యాల వెయిటేజీకి 30, ఇంటర్వ్యూకు 20 మార్కులు కేటాయించారు. మొత్తం 100 మార్కుల్లో మెరిట్ మార్కుల ఆధారంగా ఈ పోస్టులు భర్తీ చేయనున్నట్టు ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పేర్కొన్నారు. ఇంటర్వ్యూలకు 1:5 నిష్పత్తి ప్రకారం పిలుస్తారు.

## రూల్ ఆఫ్ రిజర్వేషన్లపై నో క్లారిటీ..

జీవోలో రూల్ ఆఫ్ రిజర్వేషన్లపై క్లారిటీ ఇవ్వలేదు. అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి లైన్ క్లియర్ చేసింది కానీ.. రిజర్వేషన్ల అంశంపై మాత్రం జీవోలో ప్రస్తావించలేదు. యూనివర్సిటీలో మొత్తం పోస్టులకు కలిపి రిజర్వేషన్లు, రోస్టర్ పాయింట్లు అమలు చేస్తారా? లేక డిపార్టుమెంట్లవారీగా రిజర్వేషన్లు, రోస్టర్ పాయింట్లు అమలు చేస్తారా? అన్న అంశంపై స్పష్టత లేదు. దీనిపై రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్టారెడ్డిని 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా యూజీసీ మార్గదర్శకాల ప్రకారం ముందుకు వెళ్తామని తెలిపారు. ఖాళీగా ఉన్న ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ జోలికి ప్రభుత్వం వెళ్లలేదు. అన్ని యూనివర్సిటీల్లో 2,060 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి భర్తీకి ఎప్పుడూ మోక్షం లభిస్తుందోనని విద్యార్థి సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

సోమవారం । 7 । ఏప్రిల్ । 2025
హైదరాబాద్ । www.sakshi.com

# అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి గ్రీన్ సిగ్నల్

## కొత్త మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల డైరెక్ట్ నియామకానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఆదివారం విడుదల చేశారు. గతంలో తీసుకొచ్చిన గైడ్‌లైన్స్‌ను ప్రభుత్వం రద్దు చేసింది. 12 విశ్వవిద్యాలయాల్లో దాదాపు 2,500కు పైగా బోధన సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ నియామకాలను ఎలా చేపట్టాలనే దానిపై కొన్ని నెలల క్రితం ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సిఫార్సు చేసిన మార్గదర్శకాలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. యూజీ, పీజీతో పాటు సాంకేతిక, ఫిజికల్ ఎడ్యుకేషన్ బోధించే అధ్యాపకుల నియామకానికి రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధమైన నిబంధనలు వర్తిస్తాయని పేర్కొంది. నియామక ప్రక్రియలో మూడు దశలను అనుసరిస్తారు. ప్రతీ యూనివర్సిటీలోనూ కమిటీ ఏర్పాటు చేసి, రోస్టర్ విధానం, రిజర్వేషన్ విధానానికి సంబంధించిన ప్రక్రియలను పూర్తి చేస్తారు. దీనికి విశ్వవిద్యాలయం వీసీ నాయకత్వం వహించాల్సి ఉంటుంది.

### ప్రభుత్వం ఆమోదించిన మార్గదర్శకాలు ఇలా ఉన్నాయి..

అకడమిక్ రికార్డ్, పరిశోధనలకు సంబంధించి 50 మార్కులను కేటాయిస్తారు. యూనివర్సిటీ వీసీ, ఉన్నత విద్యా మండలి సబ్జెక్ట్ నిపుణుడు, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్, డిపార్ట్‌మెంట్ ముఖ్యుడు మార్కుల స్క్రూటినీ చేస్తారు. అభ్యర్థికి సంబంధించి యూజీ నుంచి రీసెర్చ్ వరకూ వివిధ విద్యా స్థాయిల్లో మార్కులను ఖరారు చేస్తారు. మొత్తం వంద మార్కుల్లో ఇంటర్వ్యూకు 20 మార్కులు, టీచింగ్ నైపుణ్యానికి 30 మార్కులు ఉంటాయి. మిగతా 50 మార్కులను యూజీ, పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ విభాగాల నుంచి అభ్యర్థి సాధించిన మార్కుల శాతం ఆధారంగా తీసుకుంటారు.

నాలెడ్జ్ అండ్ స్కిల్స్‌కు 30 మార్కులు ఇస్తారు. ఈ మార్కులను టీచింగ్, బుక్ ఆథర్‌షిప్, జాయింట్ ఆథర్ షిప్, ఎడిట్ ఆథర్‌షిప్, కో–ఎడిటర్ ఆథర్‌షిప్, పోస్టు–డాక్టోరల్ షిప్‌గా విడగొడతారు. ఈ మార్కులను ఆయా సబ్జెక్టు లెక్చరర్లు పరిశీలించి, నిర్ణయిస్తారు. ఇంటర్వ్యూకు 20 మార్కులు ఇస్తారు. ఇందులో సబ్జెక్టు ప్రజెంటేషన్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, ఓవరాల్ పర్సనాలిటీ, నైపుణ్యాన్ని బట్టి మార్కులు వేస్తారు.

### యూజీలో మార్కులు ఇలా..

యూజీలో సాధించిన మార్కుల శాతాన్ని బట్టి అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టు ఎంపికకు మార్కులు కేటాయిస్తారు. అవి ఈ విధంగా ఉంటాయి.

| మార్కుల శాతం | పొందే మార్కులు |
|---|---|
| 70కి పైగా | 8 |
| 60-70 | 6 |
| 50-60 | 4 |
| 50 కన్నా తక్కువ | 2 |
| **పీజీ మార్కులు ఇలా..** | |
| 70 | 12 |
| 60-70 | 10 |
| 50-60 | 8 |
| **అర్హత పరీక్షల మార్కులు ఇలా..** | |
| జేఆర్ఎఫ్ | 10 |
| ఎన్ఈటీ, ఎస్ఈటీ (వీటిల్లో ఏదైనా) | |
| స్లెట్ | 5 |
| పీహెచ్‌డీ | 10 |
| ఎంఫిల్ | 5 |
| రీసెర్చ్ పబ్లికేషన్స్ | 5 |

ఈనాడు సోమవారం ఏప్రిల్ 7, 2025

# ప్రతిష్ఠాత్మక వర్సిటీలకు భూములేవీ?

- 50 ఏళ్లుగా లీజు స్థలంలోనే జేఎన్‌టీయూహెచ్
- జేఎన్ఏఎఫ్ఏయూదీ ఇదే పరిస్థితి
- భూబదలాయింపుపై దృష్టిపెట్టని ప్రభుత్వాలు
- ఇతర వర్సిటీలను వేధిస్తున్న కబ్జాలు



ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మక జేఎన్‌టీయూ హెచ్‌కు ఇప్పటికీ సొంత స్థలం లేదు. 1972లో హైదరాబాద్ కూకట్‌పల్లిలో 88 ఎకరాల హౌసింగ్ బోర్డు (ప్రస్తుతం దాన్ని ఆర్ అండ్ బీ శాఖలో విలీనం చేశారు) స్థలంలో ప్రారంభమైన ఈ సంస్థ.. అప్పటినుంచి లీజు చెల్లిస్తూనే ఉంది. ఇప్పటివరకు రూ.80 కోట్ల వరకు లీజు పేరిట చెల్లించింది. ఆ స్థలాన్ని వర్సిటీకి ఇవ్వాలని దశాబ్దకాలంగా విశ్వవిద్యాలయ వర్గాలు ప్రభుత్వాన్ని కోరుతున్నా ముందడుగు పడలేదు. ఏడాది క్రితం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా బుర్రా వెంకటేశం ఉన్న సమయంలో భూమిని వర్సిటీ పేరిట బదలాయించేందుకు చొరవ తీసుకున్నా ఆ ప్రక్రియ పూర్తికాకుండానే ఆయన బదిలీ అయ్యారు. ప్రస్తుతం హెచ్‌సీయూ భూములపై వివాదం నేపథ్యంలో.. వర్సిటీలకు ప్రభుత్వం కేటాయించిన స్థలాలను వాటి పేరిట వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని విద్యావేత్తలు, నిపుణులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్రంలో మరికొన్ని విశ్వవిద్యాలయాలు సైతం ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి.

◆ హైదరాబాద్ మాసబ్‌ట్యాంకులోని ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ వర్సిటీ (జేఎన్ఏఎఫ్ఏయూ)కి సైతం సొంత స్థలం లేదు. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖకు చెందిన 5 ఎకరాల్లో ఈ వర్సిటీ కొనసాగుతోంది. స్థలం కొరత వల్ల ప్రాంగణంలో హాస్టల్ వసతి కల్పించలేదు. వర్సిటీ ప్రాంగణంలోని ఓ భవనంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి అద్దె ప్రాతిపదికన కొనసాగుతోంది. జేఎన్ఏఎఫ్ఏయూను అంబేడ్కర్ సార్వత్రిక వర్సిటీ ప్రాంగణంలోకి తరలించే లక్ష్యంతో స్థలం కేటాయిస్తూ విద్యాశాఖ కొద్ది నెలల క్రితం ఉత్తర్వులు ఇచ్చినా.. ఆ వర్సిటీ సిబ్బంది ఆందోళనలు చేయడంతో ఆ అంశం మూలనపడింది.

## పలు వర్సిటీలకు స్థల చిక్కులు...

◆ కాకతీయ వర్సిటీకి 672 ఎకరాల స్థలముంది. అందులో దాదాపు 40 ఎకరాలు అన్యాక్రాంతమైంది. కొందరు వర్సిటీ సిబ్బంది సైతం స్థలాన్ని కబ్జా చేశారన్న ఆరోపణలపై విజిలెన్స్ విచారణ జరిపారు. వర్సిటీకి ప్రహరీ నిర్మించాలని ఏడాదిన్నర క్రితం రూ.10 కోట్లు కేటాయించినా ఆక్రమణలు తదితర కారణాలతో పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం ఉన్న ప్రహరీ.. రోడ్డు ఎత్తుకు సమానంగా మారడంతో ప్రయోజనం లేకుండాపోయింది.

◆ ఉస్మానియా యూనివర్సిటీకి దాదాపు 2,600 ఎకరాలను నిజాం నవాబు కేటాయించారు. ఇందులో 56 ఎకరాల స్థలం కబ్జా అయింది. దీనిపై న్యాయ వివాదాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికీ వర్సిటీ భూముల చుట్టూ ప్రహరీ నిర్మించలేకపోయారు. రెండు నెలల క్రితం హబ్సిగూడ వైపు కొందరు ప్రహరీని కూల్చి స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించడం గమనార్హం.

◆ నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి వద్ద తెలంగాణ వర్సిటీకి ప్రభుత్వం సుమారు 600 ఎకరాలు కేటాయించింది. చుట్టూ ప్రహరీ నిర్మించినా ఇప్పటికీ కొందరు అందులో కొంత స్థలం తమదేనని వాదిస్తున్నారు. దీనిపై కేసులు నడుస్తున్నాయి.

◆ పాలమూరు వర్సిటీ పరిధిలోని కొల్లాపూర్ పీజీ సెంటర్ స్థలం కబ్జాకు గురైంది. ప్రహరీ నిర్మించకుండా కొందరు అడ్డుకుంటుండగా.. కోర్టులో కేసులు నడుస్తున్నాయని వర్సిటీ అధికార వర్గాలు తెలిపాయి.

# రాష్ట్రానికి మరో కొత్త విశ్వవిద్యాలయం

- కొత్తగూడెంలో ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ
- మైనింగ్ కళాశాలను ఉన్నతీకరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- ఉమ్మడి ఖమ్మం జిల్లాకు తొలి వర్సిటీ

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రానికి మరో కొత్త విశ్వవిద్యాలయం రానుంది. కొత్తగూడెంలోని మైనింగ్ కళాశాలను ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా ఉన్నతీకరిస్తూ ప్రభుత్వం తాజాగా జీఓ నం.20ను జారీ చేసింది. కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్న ఈ కళాశాలను వర్సిటీగా మార్చాలని ఎన్నో ఏళ్ల నుంచి డిమాండ్ ఉంది. 2016లో న్యాక్ మాజీ డైరెక్టర్ ఆచార్య వీఎస్ఎస్ ప్రసాద్ ఛైర్మన్‌గా నియమితులైన కమిటీ సైతం.. కొత్తగూడెం కళాశాలను సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సులు ఉండేలా వర్సిటీగా మార్చాలని సిఫారసు చేసింది. ఇటీవల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా వర్సిటీ కోసం సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించడంతో ప్రభుత్వం.. రాష్ట్ర ఉన్నత విద్యామండలిని నివేదిక కోరింది. ఈ నేపథ్యంలో కొత్తగూడెంలోని మైనింగ్ కళాశాలను ఎర్త్ సైన్స్, మైనింగ్‌పై దృష్టి సారించేలా ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంగా ఉన్నతీకరించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అందుకు అనుగుణంగా నూతనంగా ఏర్పాటుకానున్న వర్సిటీలో కొత్త కోర్సులు, కొత్త విభాగాలను ప్రవేశపెట్టనున్నారు. ప్రస్తుతం ఈ కళాశాలకు 312 ఎకరాల స్థలం ఉంది. రాష్ట్ర మంత్రివర్గ ఆమోదం తీసుకొని బోధన, బోధనేతర పోస్టులను మంజూరు చేయనున్నారు. ఈ వర్సిటీ రాకతో రాష్ట్రంలో ఉన్నత విద్యాశాఖ పరిధిలోని విశ్వవిద్యాలయాల సంఖ్య 13కు పెరగనుంది. ఇప్పటివరకు తెలంగాణలో విశ్వవిద్యాలయం లేనిది ఉమ్మడి ఖమ్మం జిల్లా మాత్రమే. ఇప్పుడు అక్కడ తొలి విశ్వవిద్యాలయం రాబోతోంది.

ఈనాడు సోమవారం ఏప్రిల్ 7, 2025

# వర్సిటీల్లో సహాయ ఆచార్య పోస్టుల భర్తీకి పచ్చజెండా



- 3 దశల్లో నియామక ప్రక్రియ
- కొత్త మార్గదర్శకాలు జారీ
- 12 విశ్వవిద్యాలయాలకు ఊరట.. నిరుద్యోగులకు శుభవార్త
- ఖాళీల్లో సగమే భర్తీ!

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఉన్నత విద్యాశాఖ పరిధిలోని 12 విశ్వవిద్యాలయాల్లో సహాయ ఆచార్యుల ఖాళీల భర్తీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌కు కొత్త మార్గదర్శకాలను రూపొందిస్తూ జీఓ21 జారీచేసింది. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నియమించిన ఉన్నతస్థాయి కమిటీ సిఫార్సులను ఆమోదిస్తూ మార్గదర్శకాలను నిర్దేశించింది. గతంలో ఉన్న నిబంధనల స్థానంలో కొత్తగా మూడు దశల్లో నియామక ప్రక్రియను పూర్తిచేస్తారు. వర్సిటీలు ఈ మార్గదర్శకాలను పాలకమండళ్ల సమావేశంలో ఆమోదించాల్సి ఉంటుంది. నియామకాల సమయంలో తెలంగాణ రాష్ట్ర రిజర్వేషన్, రోస్టర్ విధానాలను కచ్చితంగా పాటించాలి. ప్రతి దశ తర్వాత అభ్యర్థుల జాబితా, మార్కులు అధికారిక వెబ్‌సైట్లలో పొందుపరుస్తారు. 1:10 నిష్పత్తిలో (ఒక్కోపోస్టుకు 10 మంది చొప్పున) రెండోదశకు పంపిస్తారు. అక్కడి నుంచి 1:5 నిష్పత్తిలో ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ...మిగతా 2లో

## నియామకంలో మూడు దశలు ఇవీ..

### 1 అకడమిక్ రికార్డ్, పరిశోధన ప్రదర్శన

దీనికి 50 మార్కులు. వీసీ, ఉన్నత విద్యామండలి సభ్యుడు, బోర్డు ఆఫ్ స్టడీస్ ఛైర్మన్, విభాగాధిపతి కన్వీనర్‌గా ఉండే స్క్రూటినీ కమిటీ ఆయా కొలమానాల ఆధారంగా మార్కులు ఇస్తుంది.

**వెయిటేజి ఇలా..**

| మార్కుల శాతం | యూజీలో | పీజీలో |
|---|---|---|
| 70 పైన | 8 మార్కులు | 12 మార్కులు |
| 60-70 | 6 | 10 |
| 50-60 | 4 | 8 |
| 50 లోపు | 2 | 0 |

**అర్హత పరీక్షల మార్కులు**

| | |
|---|---|
| జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్): | 10 |
| నెట్/సెట్/స్లెట్: | 5 |
| పీహెచ్‌డీ: | 10 |
| ఎంఫిల్: | 5 |
| పరిశోధన పత్రాలు, సదస్సులు: గరిష్ఠంగా | 5 |

### 2 విషయ పరిజ్ఞానం, బోధన నైపుణ్యం

30 మార్కులు. డీన్, ఉన్నత విద్యామండలి నిపుణుడు, వీసీ నామినేట్ చేసిన నిపుణుడు ఆధ్వర్యంలోని కమిటీ వీటిని కేటాయిస్తుంది.

వివరాలివి.. **బోధనానుభవం:** సంవత్సరానికి ఒక మార్కు, గరిష్ఠంగా 10, **పుస్తక రచన:** స్వీయ రచన- 5, సంయుక్త రచన- 3, **ఎడిటర్‌గా ఉంటే:** 2, **ఫెలోషిప్స్:** పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్/ రీసెర్చ్ అసోసియేట్- గరిష్ఠంగా 5, **డెమో లెక్చర్:** గరిష్ఠంగా 10.

### 3 ఇంటర్వ్యూ

20 మార్కులుంటాయి. వీసీ అధ్యక్షతన ఎంపిక కమిటీ నిర్వహిస్తుంది. అభ్యర్థి పరిజ్ఞానం, సబ్జెక్టు ప్రజెంటేషన్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, వ్యక్తిత్వం అంచనా ఆధారంగా మార్కులిస్తారు.

# వర్సిటీల్లో సహాయ ఆచార్య పోస్టుల భర్తీకి పచ్చజెండా

(మొదటి పేజీ తరువాయి)

నియామక ప్రక్రియకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో వర్సిటీలకు 12 సంవత్సరాలుగా ఉన్న సమస్య తీరనుంది. నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్న వేలమంది నిరుద్యోగులకు ఇది శుభవార్త.

రాష్ట్రంలోని ఉన్నత విద్యాశాఖ పరిధిలో మహిళా వర్సిటీ సహా 12 విశ్వవిద్యాలయాలున్నాయి. ఇప్పటికి ఆచార్యులు, సహ ఆచార్యులు, సహాయ ఆచార్యులు కలిపి మొత్తం 2,817 మంజూరు పోస్టులున్నాయి. వాటిలో సహాయ ఆచార్యుల పోస్టులు 1,524. ప్రస్తుతం 463 మంది పనిచేస్తున్నారు. మిగిలిన 1,061 పోస్టులు ఖాళీ. ఇప్పుడు ప్రభుత్వం సహాయ ఆచార్యుల పోస్టులను మాత్రమే భర్తీ చేసేందుకు ఆమోదం తెలిపింది. వాటన్నింటినీ ఒకేసారి భర్తీ చేయరని.. అందులో సగం పోస్టులే తొలుత భర్తీ చేస్తారని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్ల పోస్టులు ఎందుకు భర్తీ చేయడం లేదన్న ప్రశ్న వస్తోంది. వాటిలో కూడా ప్రత్యక్ష నియామకాల ద్వారా భర్తీచేసే పోస్టులుంటాయి.

**వర్సిటీలవారీగా ఖాళీలు..**

| వర్సిటీ | మంజూరు పోస్టులు | పనిచేస్తున్న వారు | ఖాళీలు |
|---|---|---|---|
| ఓయూ | 601 | 131 | 470 |
| కాకతీయ | 258 | 77 | 181 |
| తెలంగాణ | 89 | 48 | 41 |
| మహాత్మాగాంధీ | 39 | 29 | 10 |
| శాతవాహన | 37 | 16 | 21 |
| పాలమూరు | 58 | 16 | 42 |
| తెలుగు | 30 | 8 | 22 |
| అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ | 68 | 23 | 45 |
| జేఎన్‌టీయూ | 224 | 86 | 138 |
| ఆర్కిటెక్చర్ | 38 | 10 | 28 |
| ఆర్‌జీయూకేటీ | 82 | 19 | 63 |
| మొత్తం | 1,524 | 463 | 1,061 |

(గమనిక: మహిళా వర్సిటీ పోస్టులు ప్రస్తుతం ఓయూ కిందే ఉన్నాయి. విభజించాల్సి ఉంది)

మన తెలంగాణ
సోమవారం 7, ఏప్రిల్ 2025

# మూడు దశల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక ప్రక్రియ

- అకాడమిక్ రికార్డ్, రీసెర్చ్ పర్ఫార్మెన్స్‌కు 50 మార్కులు
- విషయ పరిజ్ఞానం, బోధనా నైపుణ్యానికి 30 మార్కులు, ఇంటర్వ్యూకు 20 మార్కులు
- వర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకాలకు కొత్త మార్గదర్శకాలు

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మేరకు ప్రొఫెసర్ల నియామకాలపై ప్రభుత్వం నిపుణుల కమిటీ సమర్పించిన సిఫార్సులను ప్రభుత్వం ఆమోదించింది. కొత్తగా మూడు దశల్లో నియామక ప్రక్రియ చేపట్టే విధానం ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చింది. అకడమిక్ రికార్డ్ అండ్ రీసెర్చ్ పర్ఫార్మెన్స్‌కు 50 మార్కులు, విషయ పరిజ్ఞానం, బోధనా నైపుణ్యంకు 30 మార్కులు, ఇంటర్వ్యూకు 20 మార్కులు ఉంటాయి. అకడమిక్ రికార్డ్ అండ్ పరిశోధన ప్రదర్శనలో వైస్ ఛాన్సలర్, ఒకరు ఉన్నత విద్యా మండలి నామినేట్ చేసిన సబ్జెక్ట్ నిపుణులు, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్, విభాగాధిపతి కన్వీనర్‌గా ఉండే స్క్రూటినీ కమిటీ మార్కులు కేటాయిస్తుంది. అండర్ గ్రాడ్యుయేషన్(యుజి)లో 70 శాతానికి పైగా మార్కులు ఉంటే 8 మార్కులు, 60 నుంచి 70 శాతం మార్కులు ఉంటే 6 మార్కులు, 50 నుంచి 60 శాతం ఉంటే 4 మార్కులు, 50 శాతం కంటే తక్కువ మార్కులు ఉంటే 2 మార్కులు కేటాయిస్తారు. పోస్టు గ్రాడ్యుయేషన్(పిజి)లో 70 శాతం పైగా మార్కుల ఉంటే 12 మార్కులు, 60 నుంచి 70 శాతం మార్కులు ఉంటే 10 మార్కులు, 50 నుంచి 60 శాతం మార్కులు ఉంటే 8 మార్కులు ఇస్తారు. దాంతో పాటు అదనంగా జెఆర్‌ఎఫ్ ఉంటే 10 మార్కులు లేదా నెట్, సెట్, స్లెట్ ఉంటే 5 మార్కులు కేటాయిస్తారు. పిహెచ్‌డి కలిగి ఉంటే 10 మార్కులు లేదా ఎం.ఫిల్ ఉంటే 5 మార్కులు ఇస్తారు. యుజిసి గుర్తించిన రీసెర్చ్ పబ్లికేషన్లు, జర్నల్స్ ప్రచురితమై ఉంటే వారికి గరిష్ఠంగా 5 మార్కులు కేటాయిస్తారు. అలాగే సెమినార్లు, కాన్ఫరెన్స్, సింపోసియాకు 5 మార్కులు కేటాయిస్తారు. విషయ పరిజ్ఞానం, బోధనా నైపుణ్యంలో స్క్రీనింగ్ కమిటీలో డీన్, ఉన్నత విద్యామండలి నామినేట్ చేసిన సబ్జెక్ట్ నిపుణులు, విసి నామినేట్ చేసిన నిపుణులు ఉంటారు. ఇందులో బోధనా అనుభవానికి సంవత్సరానికి 1 మార్కు చొప్పున గరిష్ఠంగా 10 మార్కులు కేటాయిస్తారు. సొంతంగా పుస్తకం రచిస్తే 5 మార్కులు లేదా సంయుక్తంగా పుస్తకం రచిస్తే 3 మార్కులు, ఎడిటెడ్ ఆథర్‌షిప్‌కు 2 మార్కులు, కో ఎడిటర్ ఆథర్‌షిప్‌కు 2 మార్కులు ఇస్తారు. పిహెచ్‌డి తర్వాత పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్ లేదా రిసెర్చ్ అసోసియేట్‌షిప్‌కు 2 మార్కులు ఇవ్వనుండగా, గరిష్ఠంగా 5 మార్కులు కేటాయిస్తారు. డెమో ద్వారా బోధనా నైపుణ్యంకు 10 మార్కులు ఇస్తారు.

## 1:5 నిష్పత్తిలో ఇంటర్వ్యూకు అభ్యర్థుల ఎంపిక

విషయ పరిజ్ఞానం, బోధనా నైపుణ్యంలో పరిజ్ఞానాన్ని పొందిన మార్కుల ఆధారంగా ఒక్క పోస్టుకు ఐదుగురు చొప్పున అంటే 1:5 నిష్పత్తిలో అభ్యర్థులను ఇంటర్వ్యూకు పిలుపుస్తారు. ఇంటర్వ్యూకు 20 మార్కులు ఉంటాయి. వైస్ ఛాన్సలర్ అధ్యక్షతన సెలక్షన్ కమిటీ ఇంటర్వ్యూ నిర్వహిస్తుంది. సబ్జెక్ట్ ప్రెజెంటేషన్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, వ్యక్తిత్వం అంచనా ఆధారంగా మార్కులు ఉంటాయి. రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకుని యూనివర్సిటీల్లో ఖాళీల భర్తీ చేస్తారు.

## త్వరలో నియామకాలకు నోటిఫికేషన్?

రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకాలకు త్వరలో నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉన్నది. ఈ పోస్టుల భర్తీని ప్రాధాన్యత అంశంగా తీసుకుని నియామకాలు చేపట్టేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగానే అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసినట్లు తెలిసింది. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో 2,878 అధ్యాపక పోస్టులు ఉండగా.. వాటిలో 2,125 పోస్టులు(73.86 శాతం) ఖాళీగా ఉన్నాయి. ప్రొఫెసర్లు ఉద్యోగ విరమణ చేస్తున్నా కొన్నేళ్లుగా కొత్త నియామకాలు చేపట్టడం లేదు.వ ర్సిటీలకు ప్రొఫెసర్ల నియామకాలు జరిగి 12 సంవత్సరాలు దాటింది. ఇతర ప్రత్యామ్నాయాలు లేకపోవడంతో కాంట్రాక్ట్ అధ్యాపకులతోనే నెట్టుకువస్తున్నారు.

# నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

7

## ఎల్బీనగర్ - మహేశ్వరం

సోమవారం | ఏప్రిల్ 07, 2025 | www.navatelangana.com


# శ్రేయాస్‌లో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

**నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్**

పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ, తట్టి అన్నారంలోని శ్రేయాస్ ఇన్స్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో 13వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉన్నత విద్యా మండలి చైర్మెన్ డాక్టర్ వి. బాలకిష్టారెడ్డి హాజరై ఉపన్యాసించారు. విద్యార్థులు ఉన్నతమైన ఆశయాలతో సాంకేతిక విద్యను అందిపుచ్చుకొని ప్రస్తుత గ్లోబలైజేషన్ లో లక్ష్య సాధన కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. 2047 వరకు వికాసిత్ భారత్ అవుతుందని, అందులో శ్రేయాస్ ఇంజనీరింగ్ విద్యార్థులు భాగస్వామ్యం కావాలని అన్నారు. మంచి నేర్పరికల్గిన యాజమాన్యం శ్రేయాస్ సొంతమైందని, అందుకే విద్యార్థులు యాజమాన్యం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంజనీరింగ్ విద్యా కోర్సును పూర్తి చేసుకున్న 484 మంది విద్యార్థులకు ప్లేస్మెంట్ ద్వారా ఉపాధి అవకాశాలు లభించాలని, అత్యధిక 10 లక్షలు వార్షిక పారితోషికం(జీతం) రావడం హర్షణీయమని కళాశాల వైస్ చైర్మెన్ హృదయ్ రెడ్డి అభిప్రాయపడ్డారు. 2023-24 అకాడమిక్ టాపర్ గా నిలిచి గోల్డ్ మెడల్ (8.66 సీజీపీఏ) సాధించిన వేముల నిఖితను కళాశాల ప్రిన్సిపాల్ డా. సి. ఉదయ్ కిరణ్ అభినందించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ ఆనంతుల వినయ్ కుమార్ రెడ్డి, సెక్రటరీ చింతల రవీంద్రానాథ్ యాదవ్, సీఈ ఓ నేర్వట్ల శరత్ రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, ఏ.ఓ రాజు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





వార్త, హైదరాబాద్, మంగళవారం 8, ఏప్రిల్ 2025

# ప్రవేశ పరీక్షలకు 3.65 లక్షల మంది దరఖాస్తు

## కొనసాగుతున్న దరఖాస్తుల ప్రక్రియ

### 29, 30 తేదీల్లో ఎప్ సెట్, అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు

**హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో వివిధ ఉన్నత విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులన ప్రక్రియ కొనసాగుతోంది. సోమవారం సాయంత్రం వరకు వివిధ కామన్ ఎంట్రన్స్ పరీక్షల కోసం 3,65,325 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 29న ఎప్ సెట్-2025లో భాగంగా అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు జరగనున్నాయి.

రాష్ట్రంలో జరగనున్న మొదటి కామన్ ఎంట్రన్స్ పరీక్ష కావడం గమనార్హం. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు ముగిసిన తరువాత మే 2 ఉంచి 5 వరకు ఇంజనీరింగ్ పరీక్షలు జరగనున్నాయి. ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్-2025కి ఇప్పటి వరకు 2,99,594 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో ఇంజనీరింగ్‌కి 2,15,436 దరఖాస్తులు రాగా అగ్రికల్చర్, ఫార్మసీకి 83,916 దరఖాస్తులు వచ్చాయి. అపరాధ రుసుంతో ఈ నెల 24 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఈ సెట్-2025కి 15,516 దరఖాస్తులు రాగా ఈ నెల 19 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఐ సెట్-2025కి సోమవారం సాయంత్రం నాటికి 15,582 దరఖాస్తులు వచ్చాయి. ఐ సెట్‌కి దరఖాస్తు చేసుకోవడానికి మే 17 వరకు అవకాశం ఉంది. పిజి ఈసెట్-2025కి 3979 దరఖాస్తులు వచ్చాయి. మే 19 వరకు దరఖాస్తు గడువు ఉంది. ఎడ్ సెట్-2025కి ఇప్పటి వరకు 10,486 దరఖాస్తులు రాగా.. మే 13 వరకు దరకాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు.

లాసెట్, పిజి లాసెట్‌కి ఇప్పటి వరకు 19,533 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో లాసెట్‌కి17,989 దరఖాస్తులు రాగా.. పిజి లాసెట్‌కి 1544 దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 15 వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఉంది. ఫిజికల్ ఎడ్యుకేషన్(పిఈ) సెట్-2025కి 635 దరఖాస్తులు రాగా.. మే 24 వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఉంది. ఈ ఏడాది నుంచి ఆంధ్రప్రదేశ్ వారికి స్థానిక కోటా లేకపోవడంతో.. దరఖాస్తుల్లో గతంలో కంటే కొంత మేరకు దరఖాస్తులు తగ్గినట్టు తెలుస్తోంది.

# ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటు

## కొత్తగూడెంలోని ఇంజినీరింగ్ కాలేజీని అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు

**హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొత్తగా యూనివర్సిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు కొత్తగూడెం ఇంజినీరింగ్ కాలేజీగా కొనసాగి కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైనింగ్‌ను ఎర్త్ సైన్స్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కొత్తగూడెంలోని ఇంజనీరింగ్ కాలేజీని ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబర్ 20ని జారీ చేసింది. ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ తెలంగాణగా కొనసాగనుంది. భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం జిల్లాలతోపాటు తెలంగాణ రాష్ట్రం మొత్తానికి చెందిన యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్టు ఉత్తర్వులో పేర్కొన్నారు. యూనివర్సిటీ హెడ్‌క్వార్టర్స్ కొత్తగూడెంలో కొనసాగుతుందని ఉత్తర్వులో స్పష్టం చేసింది.

ఈనాడు మంగళవారం ఏప్రిల్ 8, 2025

# ఇంజినీరింగ్ సహాయ ఆచార్యుల భర్తీకి రాత పరీక్ష

- జీవోలో స్పష్టం చేసిన సర్కారు
- పొందిన మార్కుల ఆధారంగా వెయిటేజీ నిర్ధారణ

ఈనాడు, హైదరాబాద్: విశ్వవిద్యాలయాల పరిధిలో ఇంజినీరింగ్, ఇతర సాంకేతిక విభాగాల్లో సహాయ ఆచార్యుల పోస్టులకు ఎంపిక కావాలంటే అభ్యర్థులు ప్రత్యేక రాత పరీక్ష రాయడం తప్పనిసరి. కాకపోతే ఆ పరీక్షకు 10 నుంచి 20 మార్కుల వెయిటేజీ మాత్రమే ఉంటుంది. మిగిలిన 80 మార్కులు నాన్ ఇంజినీరింగ్ తరహాలోనే విద్యార్హతలు, పరిశోధన పత్రాలు, బోధన నైపుణ్యం లాంటి వాటికి కేటాయిస్తారు. వాస్తవానికి పెద్ద మొత్తంలో అభ్యర్థుల నుంచి వచ్చే దరఖాస్తుల వడపోతకు రాత పరీక్ష(స్క్రీనింగ్ టెస్ట్) నిర్వహించాలనే ఏకాభిప్రాయాన్నే వీసీలందరూ వ్యక్తపరుస్తూ వచ్చారు. ఉన్నత స్థాయి కమిటీ మాత్రం.. కొన్ని రాష్ట్రాల్లో రాత పరీక్ష నిర్వహిస్తే న్యాయపరమైన సమస్యలు వచ్చాయనే అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తూ.. నాన్ ఇంజినీరింగ్ విభాగాల్లో ఖాళీల భర్తీకి రాత పరీక్ష జరపరాదని సిఫారసు చేసింది. ఇంజినీరింగ్‌కు మాత్రం రాత పరీక్ష తప్పనిసరని సూచించింది. కమిటీ సిఫారసులకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించి తాజాగా జీఓ జారీ చేసింది.

## ఆ విభాగాలకు రాత పరీక్ష ఎందుకంటే?

ఆర్ట్స్, సైన్స్ విభాగాలకు సంబంధించి జాతీయ స్థాయిలో జాతీయ అర్హత పరీక్ష(నెట్), రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర అర్హత పరీక్ష(సెట్) నిర్వహిస్తున్నారు. ఇంజినీరింగ్ సబ్జెక్టులకు ఆ పరీక్షలు లేవు. దానికితోడు ఆర్ట్స్, సైన్స్ సబ్జెక్టులకు సంబంధించి సహాయ ఆచార్యుల పోస్టుల భర్తీకి పీహెచ్‌డీ తప్పనిసరి. ఇంజినీరింగ్‌కు ఆ నిబంధనా లేదు.. ఎంటెక్ ఉంటే చాలు. అందుకే ఇంజినీరింగ్‌కు రాత పరీక్ష జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారం.. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్(గేట్) తరహాలోనే 100 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. అభ్యర్థి పొందిన మార్కుల ఆధారంగా పీహెచ్‌డీ పూర్తిచేసిన వారికి 10 మార్కుల వెయిటేజీ, పీహెచ్‌డీ లేకుంటే 20 మార్కుల వెయిటేజీని నిర్ధారిస్తారు. పరీక్షను విశ్వవిద్యాలయాలు లేదా రాష్ట్ర ఉన్నత విద్యామండలి నిర్వహిస్తుంది.

## జేఎన్‌టీయూ, ఆర్కిటెక్చర్, ఆర్‌జీయూకేటీలలో పూర్తిగా..

జేఎన్‌టీయూహెచ్, ఆర్కిటెక్చర్ వర్సిటీ(జేఎన్ఏఎఫ్ఏయూ)తోపాటు బాసరలోని ఆర్‌జీయూకేటీ పూర్తిగా ఇంజినీరింగ్, సాంకేతిక కోర్సులైనందున అక్కడ సహాయ ఆచార్యుల భర్తీకి రాత పరీక్ష నిర్వహించడం తప్పనిసరి. దానికితోడు ఇప్పటికే ఓయూ, మహాత్మాగాంధీ వర్సిటీ, కాకతీయలో కూడా ఇంజినీరింగ్ కళాశాలలున్నందున వాటిల్లోని ఖాళీల భర్తీకి కూడా రాత పరీక్ష నిర్వహించాల్సిందే. వచ్చే విద్యా సంవత్సరానికి(2025-26) పాలమూరు వర్సిటీలో ఇంజినీరింగ్ కళాశాల మంజూరైంది. అందుకు అవసరమైన పోస్టులను ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేసింది. శాతవాహన వర్సిటీ పరిధిలో కూడా హుస్నాబాద్‌లో ఇంజినీరింగ్ కళాశాలను ఇటీవలే మంజూరు చేశారు. మంత్రివర్గం ఆమోదం తర్వాత అక్కడా పోస్టులు కేటాయించే అవకాశం ఉంది. ఇక గత మూడేళ్ల కాలంలో సిరిసిల్ల, వనపర్తి, పాలేరు, మహబూబాబాద్‌లో ఇంజినీరింగ్ కళాశాలలను నెలకొల్పారు. వాటికి కూడా పోస్టులు మంజూరు చేయాల్సి ఉంటుంది. తాజాగా 11 వర్సిటీలలో మొత్తం మంజూరు పోస్టులు 2,878గా ఉన్నట్లు విద్యాశాఖ స్పష్టంచేసింది. అందులో సహాయ ఆచార్యుల పోస్టులు 1,572 కాగా, వాటిల్లో 1,114 ఖాళీగా ఉన్నాయి. వాటిల్లో కనీసం 50 శాతం భర్తీ చేయనున్నారు.

## తర్వాత ప్రక్రియ ఏమిటి?

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నియామక ప్రక్రియ విధానాన్ని ఖరారు చేసి మార్గదర్శకాలను జారీ చేసింది. వాటికి ఆయా వర్సిటీల పాలకమండళ్లు ఆమోదం తెలిపాలి. వర్సిటీల వారీగా ఖాళీలను గుర్తించి వాటిల్లో ఎన్ని భర్తీ చేయాలో ప్రభుత్వం నిర్ణయించి జీవో ఇవ్వాలి. ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం బిల్లు ఆమోదించి గవర్నర్ ఆమోదానికి పంపింది. ఆయన ఆమోదిస్తే చట్టం అమల్లోకి వస్తుంది. ఆ ప్రకారమే రోస్టర్ పాయింట్లను నిర్ణయించాల్సి ఉంటుందని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఆ తర్వాత వర్సిటీల వారీగా నోటిఫికేషన్లు జారీ చేయాల్సి ఉంటుంది.

మంగళవారం | హైదరాబాద్
08.04.2025
www.v6velugu.com
ప్రభాత వెలుగు

# ఎంట్రెన్స్ టెస్టులకు 3.65 లక్షల అప్లికేషన్లు

- ఒక్క ఎప్‌సెట్‌కే 2.99 లక్షలకు పైగా దరఖాస్తులు

**హైదరాబాద్, వెలుగు:** రాష్ట్రంలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్టులకు భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. సోమవారం సాయంత్రం నాటికి ఎనిమిది సెట్లకు (ఎప్‌సెట్, ఈసెట్, ఐసెట్, పీజీఈసెట్, ఎడ్ సెట్, లాసెట్, పీజీఎల్  సెట్, పీఈసెట్) కలిపి 3,65,325 అప్లికేషన్లు వచ్చాయి. దీంట్లో అత్యధికంగా ఎప్‌సెట్‌కు 2,99,594 దరఖాస్తులు రాగా.. దీంట్లో ఇంజినీరింగ్ స్ట్రీమ్ కు 2,15,436, అగ్రికల్చర్ స్ట్రీమ్‌కు 83,916, రెండింటికి కలిపి 242 అప్లికేషన్లు వచ్చాయి. అయితే, ఇప్పటికే ఎప్‌సెట్ కు ఫైన్ లేకుండా దరఖాస్తు చేసుకునే గడువు ఈ నెల 4తో ముగియడంతో ప్రస్తుతం ఈ నెల 24వరకూ ఫైన్‌తో అప్లై చేసుకునే చాన్స్ ఉంది. మరోపక్క టీజీ ఈసెట్‌కు ఇప్పటి వరకూ 15,516 , ఐసెట్ కు 15,582, పీజీఈసెట్ కు 3,979, ఎడ్ సెట్ కు 10,486,. పీఈసెట్ కు 635 దరఖాస్తులు వచ్చాయి. మూడేండ్ల లాసెట్ కు 13,870, ఐదేండ్ల కోర్సుకు 4,125, ఎల్‌ఎల్‌ఎంకు 1,544 అప్లికేషన్లు అందాయి. కాగా, ఈసెట్‌కు ఈనెల 19 వరకూ దరఖాస్తుకు అవకాశం ఉండగా, ఐసెట్ కు మే 17 వరకూ, పీజీఈసెట్ కు మే 19, ఎడ్ సెట్ కు మే 18 వరకూ ఎలాంటి ఫైన్ లేకుండా అప్లై చేసుకునే అవకాశం ఇచ్చారు. పీజీఈసెట్ కు ఈనెల 15తో దరఖాస్తు గడువు ముగియనుండగా, పీఈసెట్ కు మే 24 వరకూ అప్లై చేసుకునే అవకాశం ఉంది.

ఆంధ్రజ్యోతి | హైదరాబాద్ ● మంగళవారం 8 ఏప్రిల్ 2025

## జేఎన్‌టీయూ కాలేజీలో మెరిట్ జాబితా

- 10% మంది మెరిట్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు
- బ్యాక్‌లాగ్స్ పూర్తికోసం జేఎన్‌టీయు 'వన్‌టైం చాన్స్'..!

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ యూనివర్సిటీ ఇంజినీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ కాలేజీలో ఈ ఏడాది నుంచి మెరిట్ విద్యార్థుల జాబితా ప్రవేశపెడుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీ నర్సింహారెడ్డి తెలిపారు. తమ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల్లో ప్రతి విభాగం నుంచి 10 శాతం మంది మెరిట్ విద్యార్థులను ఈ జాబితాకు ఎంపిక చేస్తామని సోమవారం పేర్కొన్నారు. అలా ఎంపికైన విద్యార్థులకు ప్రశంసా పత్రాల ప్రదానం చేయడంతోపాటు కళాశాల ప్రిన్సిపాల్, రిజిస్ట్రార్, రెక్టార్, వైస్ చాన్సలర్ సంతకాలు చేసిన సర్టిఫికెట్లు పంపిణీ చేస్తామని నర్సింహారెడ్డి చెప్పారు. ఈ ఏడాది నుంచి కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహణకు వైస్ చాన్సలర్ అనుమతించారన్నారు. కాగా, తన అనుబంధ కళాశాలల్లో విద్యాభ్యాసం గడువు ముగిసినా సబ్జెక్టులు పాస్ కాలేకపోయిన విద్యార్థులకు జేఎన్‌టీయూ 'వన్‌టైమ్ చాన్స్' కల్పిస్తోంది. బ్యాక్‌లాగ్స్ ఉన్న విద్యార్థుల కోసం మే/జూన్ నెలల్లో ప్రత్యేక సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నది.

# వర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీ!

- మొత్తం ఖాళీలు 1,061
- రిక్రూట్‌మెంట్‌కు సర్కారు మార్గదర్శకాలు
- 15 ఏళ్ల తర్వాత నియామకాలపై స్పష్టత
- మూడుదశల్లో ఎంపిక ప్రక్రియ

హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ కొలువుల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు శుభవార్త..! 15 ఏళ్ల నిరీక్షణ ఫలించేలా ప్రభుత్వం నియామకాలకు కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. రాష్ట్రంలోని 12 వర్సిటీల్లో అన్ని సంప్రదాయ కోర్సుల్లో సహాయక అధ్యాపకుల నియామకానికి ఆమోదం తెలిపింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా ఆదివారం మార్గదర్శకాలను విడుదల చేశారు. ఈ వర్సిటీల్లో 2,817 బోధన పోస్టులుండగా.. వాటిల్లో 1,524 పోస్టులు అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీకి సంబంధించినవి. అయితే.. ప్రస్తుతం 463 మంది రెగ్యులర్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు పనిచేస్తుండగా.. 1,061 ఖాళీలున్నాయి. ఈ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి నేతృత్వంలో ఓ కమిటీని నియమించిన విషయం తెలిసిందే..! ఈ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా ఒకే రకమైన నిబంధనలు అమలయ్యేలా మార్గదర్శకాల్లో సవరణలు చేశారు. కనీసం 50% ఖాళీలను భర్తీ చేయాలని, వందల మందిని ఇంటర్వ్యూలకు పిలవకుండా.. పరీక్షలతో వడబోత ద్వారా ఒక్కో పోస్టుకు ఇద్దరిని పిలవాలని కమిటీ సూచించింది. యూజీ, పీజీ, సాంకేతిక, ఫిజికల్ విద్యాబోధనకు సంబంధించిన వారికి ఒకేరకమైన నిబంధనలను అమలు చేయాలని కోరింది. త్వరలోనే ఈ నియామకాల ప్రక్రియపై సీఎం రేవంత్‌రెడ్డికి ఉన్నత విద్యామండలి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనుంది.

### తాజా మార్గదర్శకాల్లో కీలకాంశాలు

- విశ్వవిద్యాలయంలో నియామకాలకు సంబంధించి కమిటీని ఏర్పాటు చేసి, రోస్టర్ పద్ధతి, రిజర్వేషన్ ప్రక్రియలను పూర్తిచేస్తారు
- అకాడమిక్ రికార్డు, పరిశోధనలకు, అర్హత పరీక్షకు సంబంధించి 50 మార్కులు.. విషయ పరిజ్ఞానం, బోధనలో నైపుణ్యానికి 30 మార్కులు, ఇంటర్వ్యూకి 20 మార్కులు ఉంటాయి
- అకాడమిక్ మార్కుల్లో.. యూజీ, పీజీల్లో 70శాతానికి పైన మార్కులు సాధించిన వారికి 8+12 మార్కులు ఇస్తారు. 60-70% మధ్య మార్కులుంటే 6+10, 50-60 మధ్యన ఉంటే 4+8 మార్కులు కేటాయిస్తారు. 50%లోపు మార్కులుంటే యూజీకి 2, పీజీకి సున్నా మార్కులిస్తారు
- అర్హత పరీక్షలకు సంబంధించి.. జేఆర్‌ఎఫ్‌కు ఎంపికైన వారికి 10, నెట్/సెట్/స్లేట్ ఉత్తీర్ణులైన వారికి 5, పీహెచ్‌డీ చేసిన వారికి 10, ఎంఫిల్ చేసిన వారికి 5, పరిశోధన పత్రాలు ప్రచురితమైన వారికి/హాజరైన సదస్సులకు గరిష్ఠంగా 5 మార్కులు ఇస్తారు. సంబంధిత సబ్జెక్టుపై పుస్తక రచనకు 5, సంయుక్త రచనకు 3, ఎడిటర్‌కు 2 చొప్పున మార్కులను కేటాయిస్తారు. పోస్ట్ డాక్టర్ ఫెలోషిప్, రిసెర్చ్ అసోసియేట్‌లకు ఒక్కో సంవత్సరానికి 2 చొప్పున గరిష్ఠంగా 5 మార్కులను ఇస్తారు
- ప్రతి దశలోనూ ఎంపిక ప్రక్రియపై అపోహలకు తావులేకుండా మార్కులతోపాటు.. అభ్యర్థుల జాబితాను అధికారిక వెబ్‌సైట్‌లో పెడతారు
- 1:10 నిష్పత్తిలో టాప్ 10 మందిని రెండో దశకు ఎంపిక చేస్తారు. 1:5 నిష్పత్తిలో టాప్ 5 గురిని ఇంటర్వ్యూకి ఎంపిక చేస్తారు
- ఉపకులపతి అధ్యక్షతన సెలెక్షన్ కమిటీ ఉంటుంది. ఎంచుకున్న సబ్జెక్టుపై అభ్యర్థికి ఉండే అవగాహన, రిసెర్చ్ ఆప్టిట్యూడ్, వ్యక్తిత్వం అంచనా ఆధారంగా మార్కులను కేటాయిస్తారు.

ఈనాడు మంగళవారం ఏప్రిల్ 8, 2025

# వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య వర్సిటీల్లోనూ ఖాళీల భర్తీ

- వివరాలు కోరిన ప్రభుత్వం
- ఆ మూడింట్లో 718 పోస్టులు ఖాళీ

ఈనాడు, హైదరాబాద్: ఉన్నత విద్యాశాఖ పరిధిలోని 12 విశ్వవిద్యాలయాలతోపాటు వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య వర్సిటీల్లోని ఆచార్యులు, సహ ఆచార్యులు, సహాయ ఆచార్యుల పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు ఆయా విశ్వవిద్యాలయాల నుంచి ఖాళీలు, ప్రస్తుతం అనుసరిస్తున్న నియామక విధానం, ఇతరత్రా అంశాలపై సమాచారం కోరింది. మూడు వర్సిటీల్లో మొత్తం 718 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల పరిధిలో ఎనిమిదేళ్ల క్రితం చివరి దఫా నియామకాలు జరిగాయి. పశువైద్య వర్సిటీలో 2022లో నియామకాల ప్రక్రియ చేపట్టి రెండు నెలల క్రితం భర్తీ చేశారు. ఈలోపు మళ్లీ ఖాళీల సంఖ్య భారీగా పెరిగింది. మరోవైపు వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలో ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి నల్గొండలతోపాటు కొడంగల్‌లో మూడు కొత్త కళాశాలలు, పశువైద్య వర్సిటీ పరిధిలో కొడంగల్‌లో ఓ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో ఖాళీల భర్తీ, కొత్త నియామకాలు అవసరమని ఆయా వర్సిటీల పాలకవర్గాలు గుర్తించాయి. ఖాళీల వల్ల కలుగుతున్న ఇబ్బందులను ఉపకులపతులు ఇటీవల ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తొలుత ఉన్నత విద్యాశాఖ పరిధిలోని పోస్టుల భర్తీకి పచ్చజెండా ఊపడంతోపాటు ఈ మూడు వర్సిటీల్లోని ఖాళీల వివరాలు అడిగింది.

## నియామకాలకు ఏ విధానం?

ఉన్నత విద్యాశాఖ పరిధిలో సహాయ ఆచార్యుల పోస్టులను ప్రత్యక్ష నియామక విధానం ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించి మార్గదర్శకాలు జారీ చేసింది. వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య విశ్వవిద్యాలయాల్లో పోస్టుల భర్తీకి ఇప్పటి వరకు ఇవే మార్గదర్శకాలు అమలవుతున్నాయి. తాజా ఉత్తర్వుల్లో వీటి ప్రస్తావన లేదు. దీంతో పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టిన తర్వాత అవే మార్గదర్శకాలను పాటించాలని ప్రభుత్వం ఆదేశిస్తే పాలకమండళ్లు అమలు చేయాలి. ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వని పక్షంలో మూడు వర్సిటీలు అవే మార్గదర్శకాలను తాము అమలు(అడాప్ట్) చేస్తామని తీర్మానం చేయాలి. ప్రత్యేక విధానం తేవాలనుకుంటే ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. మూడు విశ్వవిద్యాలయాల పరిధిలో ప్రస్తుతం వేయి మందికి పైగా పీహెచ్‌డీ అభ్యర్థులు పోస్టుల కోసం ఎదురుచూస్తున్నారు. ఖాళీల భర్తీ చేపడితే తమకు ఉద్యోగాలు లభిస్తాయనే ఆశతో ఉన్నారు.

**మూడు విశ్వవిద్యాలయాల్లో ఖాళీల వివరాలివి**

| వర్సిటీ | ఆచార్యులు | సహ ఆచార్యులు | సహాయ ఆచార్యులు | మొత్తం |
|---|---|---|---|---|
| వ్యవసాయ | 20 | 50 | 380 | 450 |
| ఉద్యాన | 17 | 42 | 66 | 125 |
| పశువైద్య | 21 | 62 | 60 | 143 |

# ఎంబీఏకు గరిష్ఠ ఫీజు రూ.1.40 లక్షలు

- ఖరారు చేసిన టీఏఎఫ్‌ఆర్‌సీ

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని ఎంబీఏ కళాశాలలకు తెలంగాణ ప్రవేశాలు, రుసుముల నియంత్రణ మండలి(టీఏఎఫ్‌ఆర్‌సీ) కొత్త రుసుములను ఖరారు చేసింది. వచ్చే మూడేళ్ల కాల వ్యవధికి(2025-28 వరకు) ఫీజులను నిర్ణయించాలంటూ రాష్ట్రంలోని 249 ఎంబీఏ కళాశాలలు దరఖాస్తు చేసుకున్నాయి. కళాశాలల ప్రతినిధులతో చర్చించిన మీదట ఖరారు చేసిన మొత్తాలను కమిటీ తెలియజేసింది. ఆ ప్రకారం ఇప్పటివరకు గరిష్ఠ రుసుము రూ.1.10 లక్షలుగా ఉండగా.. ఇప్పుడది రూ.1.40 లక్షలకు పెరిగింది. కనిష్ఠం రూ.35 వేలుగా ఉంది. సీబీఐటీకి గరిష్ఠ ఫీజు ఖరారు చేసినట్లు విశ్వసనీయ సమాచారంకాగా.. ఈసారి పలు కళాశాలలకు రూ.లక్ష దాటడం గమనార్హం. కొత్త ఫీజులను ప్రభుత్వం ఆమోదించి జీవో జారీ చేయాల్సి ఉంటుంది. మార్పులు చేర్పులు చేయాలని సూచించే అధికారం ప్రభుత్వానికి ఉన్నందున స్వల్ప మార్పులకు అవకాశం ఉంటుందని తెలుస్తోంది. అన్ని రకాల కోర్సులకు సంబంధించి ఖరారు చేసిన ఫీజులపై చర్చించాలని టీఏఎఫ్‌ఆర్‌సీ వచ్చే వారం ప్రభుత్వాన్ని కోరనుంది. విద్యాశాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో సమావేశం అనంతరం జీవోలు జారీ చేస్తారు. ఓసీ, బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.27 వేలు మంజూరు చేస్తారు.

**కొన్ని కళాశాలలకు పాత, కొత్త ఫీజులు ఇలా...**

| కళాశాల పేరు | పాత ఫీజు (రూ.లలో) | కొత్త ఫీజు (రూ.లలో) |
|---|---|---|
| సీబీఐటీ | 90,000 | 1,40,000 |
| విశ్వ విశ్వాని | 90,000 | 1,35,000 |
| భవన్స్ వివేకానంద | 1,10,000 | 1,23,000 |
| భద్రుక | 85,000 | 1,05,000 |
| పెండేకంటి | 1,00,000 | 1,05,000 |

నవతెలంగాణ బుధవారం 9 ఏప్రిల్ 2025

# వర్సిటీల్లో పోస్టుల భర్తీకి పాత పద్ధతినే అనుసరించాలి

## లెక్చరర్‌గా అనుభవం అనే అంశాన్ని ఎత్తేయాలి

- నేరుగా నియామకాలు చేపట్టాలి : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రం లోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయమని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ తెలిపింది. పాత పద్ధతిని అనుసరించి పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చాలా కాలం నుంచి రాష్ట్రంలోని వర్సిటీల్లో అధ్యాపకుల నియామకాలు జరగలేదని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో 2013లో చివరిసారిగా నియామాలు జరిగాయని వివరించారు. అయితే ఈ సారి నిర్వహించే నియామకాల్లో మూడు దశల్లో ఉంటుందని ఉన్నత విద్యామండలి ప్రకటించిందని పేర్కొన్నారు. మొదటి దశలో విద్యార్హతల స్కోర్ ఆధారంగా 50 మార్కులు, రెండో దశలో అనుభవం తదితర అంశాలకు 30 మార్కులు, మూడో దశలో ఇంటర్వ్యూ కోసం 20 మార్కులుంటాయని ప్రకటించిందని వివరించారు. రెండో దశలో కేటాయించిన 30 మార్కుల్లో ఏదైనా డిగ్రీ కళాశాలల్లో కాంట్రాక్టు అధ్యాపకుని గా లేదా ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ కళాశాలలు, ప్రయివేట్ డిగ్రీ కళాశాలల్లో బోధించిన అనుభవం 10 ఏండ్లు ఉంటే 10 మార్కులు, ఏడాదికి ఒక మార్కు ఆధారంగా 10 మార్కులు, పీడీఎఫ్ ఉంటే ఐదు మార్కులు, నెట్, సెట్ లేదా ఎంఫిల్ ఉంటే ఐదు మార్కులు అని ప్రకటించారని తెలిపారు. దీనిలో ప్రధానంగా ప్రభుత్వం అనుభవం అనే అంశాన్ని చేర్చడంపై పునరాలోచన చేయాలని కోరారు. బోధన, పరిశోధనలపై మక్కువతో పీహెచ్‌డీ పూర్తి చేసుకున్న నూతన అభ్యర్థులకు ఈ నిబంధన అడ్డంకిగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేటాయించిన 30 మార్కుల్లో 15 కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. అంటే 15 మార్కులకు మాత్రమే పోటీ పడాల్సి ఉంటుందని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ అధ్యాపక వృత్తికి డోర్ స్టెప్ అయిన అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టు కోసం బోధన అనుభవానికి అధిక మార్కులు కేటాయించడం సహజ న్యాయ సూత్రానికి వ్యతిరేకమని విమర్శించారు. స్క్రుటినీ అనేది మెరిట్ ఆధారంగా జరగాలనీ, కానీ, అనుభవం పేరుతో స్క్రుటినీ మొత్తం 80 మార్కులకు కాకుండా 30 మార్కులకు కుదించడం సరైంది కాదని తెలిపారు. జేఆర్ఎఫ్, ఇతర ఫెలోషిప్‌లు తీసుకుంటున్న వారికి బోధించే అనుభవం సాధారణంగా ఉండబోదని వివరించారు. ఫెలోషిప్‌లు పొందుతూ బోధన చేయడం కుదరదని పేర్కొన్నారు. కావున ఉన్నత విద్యామండలి ఈ నిర్ణయం తీసుకోవడం అంటేనే న్యాయ పరమైన చిక్కులు నోటిఫికేషన్‌లోనే సృష్టించినట్టు అవుతుందని తెలిపారు. యూజీసీ నిబంధనల ప్రకారం పీజీలో 55 శాతం మార్కులుంటే సరిపోతుందని పేర్కొన్నారు. కానీ డిగ్రీ మార్కులు కూడా పరిగణనలోకి తీసుకోవడం వల్ల నష్టం జరుగుతుందని తెలిపారు. యూజీసీ నిబంధనలను తుంగలో తొక్కి ఈ నిబంధనలను జారీ చేశారని విమర్శించారు. పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి జేఆర్ఎఫ్ వారికి ఒకే మార్కులు కేటాయించారని తెలిపారు. ఈ నిర్ణయం కూడా సరైంది కాదని పేర్కొన్నారు. గతంలో కేవలం అకడమిక్ రికార్డ్ అండ్ రీసెర్చ్ పర్ఫార్మెన్స్ స్కోర్, ఇంటర్వ్యూ ఆధారంగా మార్కులుండేవని గుర్తు చేశారు. కానీ కొత్తగా అనుభవం ఉండాలని చేర్చడం మూలంగా నిజమైన అభ్యర్థులు నష్ట పోతారని తెలిపారు. ప్రభుత్వం కావాలనే న్యాయ పరమైన చిక్కులు సృష్టించేలా ఉత్తర్వులు ఇచ్చిందని పేర్కొన్నారు. అనుభవం అనే అంశాన్ని తొలగించి నిజమైన అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉన్నత విద్యామండలి ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నమస్తే తెలంగాణ హైదరాబాద్, బుధవారం 9 ఏప్రిల్ 2025

# వర్సిటీల్లో పోస్టుల భర్తీకి ఒకే అప్లికేషన్

- అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీపై ఉన్నత విద్యామండలి సమాలోచనలు
- కామన్ అప్లికేషన్ విధానాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు

హైదరాబాద్, ఏప్రిల్ 8(నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని వర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి ఒకే అప్లికేషన్ విధానాన్ని తీసుకొచ్చేందుకు ఉన్నత విద్యామండలి ప్రయత్నిస్తున్నది. ఆన్‌లైన్ కామన్ అప్లికేషన్ విధానాన్ని తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తున్నది. వర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి ఇటీవలే సర్కారు జీవో విడుదల చేసింది. పోస్టుల భర్తీని ఉమ్మడిగా కాకుండా ఏ యూనివర్సిటీ పోస్టులను ఆ యూనివర్సిటీయే భర్తీచేసుకునే అవకాశం ఇచ్చారు. దరఖాస్తుల స్వీకరణకు మాత్రం కామన్ అప్లికేషన్ విధానాన్ని అమలుచేయాలని యోచిస్తున్నారు. ఇందుకు ఉన్నత విద్యామండలి ఆన్‌లైన్ పోర్టల్‌ను తీసుకురానున్నది. అభ్యర్థులు ఈ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు సమయంలో తమకు కావాల్సిన యూనివర్సిటీలను ఎంపికచేసుకోవాల్సి ఉంటుంది. ఈ విధానంతో ఒకే అభ్యర్థి అన్ని వర్సిటీలకు దరఖాస్తు చేసే భారం తప్పుతుందని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి తెలిపారు.

# జేఎన్‌టీయూ డాటాబేస్‌లో తప్పులు!

## విచారణ జరిపించాలని వర్సిటీ విద్యార్థుల డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ) : జేఎన్‌టీయూ డాటాబేస్‌లో తప్పులు జరుగుతున్నాయని, ఈ విషయంలో కొందరి అధికారుల పాత్ర ఉందని ఆ యూనివర్సిటీకి చెందిన విద్యార్థి సంఘాల నాయకులు దిలీప్, రాహుల్ ఆరోపించారు. విద్యార్థులకు చెందిన డాటాబేస్‌లో సవరణలు జరుగుతున్నట్టు అనుమానం వ్యక్తంచేశారు. ఆ యూనివర్సిటీకి చెందిన ఇద్దరు విద్యార్థులు తమ ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్లు పొందే క్రమంలో.. ఇలాంటి పొరపాట్లు జరుగుతున్నాయని, అక్రమ పద్ధతుల్లో వారికి మార్కులు జోడిస్తున్నారని ఆరోపించారు.

ఈనాడు బుధవారం ఏప్రిల్ 9, 2025

# అన్ని వర్సిటీలకు ఒకటే దరఖాస్తు

- స్వీకరణకు ప్రత్యేక పోర్టల్
- సహాయ ఆచార్యుల పోస్టుల భర్తీపై ఉన్నత విద్యామండలి కసరత్తు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో సహాయ ఆచార్యుల ఖాళీలను భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో అందుకు అవసరమైన చర్యలపై విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణాతో ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, కళాశాల/సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన చర్చించారు. అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. ఈ బాధ్యతను రాష్ట్ర ఉన్నత విద్యామండలికి అప్పగించారు. ఈ క్రమంలో విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి, కార్యదర్శి ఆచార్య శ్రీరాం వెంకటేశ్, ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య మంగళవారం ఉన్నత విద్యామండలి కార్యాలయంలో సమావేశమై చర్చించారు. ఒక్కో అభ్యర్థి పలు వర్సిటీలకు దరఖాస్తు చేసుకోకుండా.. ఒకటే దరఖాస్తు చేసుకునేలా ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించనున్నారు. అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న వర్సిటీలను ఎంచుకోవచ్చు. ఈ పోర్టల్ నిర్వహణ బాధ్యతను ఏదైనా సాఫ్ట్‌వేర్ సంస్థకు అప్పగించాలని భావిస్తున్నారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి నియామకాలపై చర్చించే అవకాశం ఉందని సమాచారం.

## కాంట్రాక్టు ఆచార్యుల డిమాండ్లపై దృష్టి

ఎన్నో ఏళ్లుగా తాము కాంట్రాక్టు విధానంలో సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్నామని, తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని 12 వర్సిటీల్లో పనిచేస్తున్న 1,170 మంది కాంట్రాక్టు ఆచార్యులు డిమాండ్ చేస్తున్నారు. తమను క్రమబద్ధీకరించిన తర్వాతే నియామకాలు చేపట్టాలని కోరుతున్నారు. బుధవారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని ప్రకటించారు. ఈ క్రమంలో ప్రభుత్వ సలహాదారు కేశవరావు ఒకటీ రెండు రోజుల్లో ఈ సమస్యపై చర్చించనున్నారని సమాచారం. యూజీసీ నిబంధనల ప్రకారం వీరిని క్రమబద్ధీకరించడం సాధ్యమవుతుందా? లేదా? అనే అంశంపై అధికారులతో చర్చించే అవకాశముంది.

బుధవారం । 9 । ఏప్రిల్ । 2025
హైదరాబాద్ । www.sakshi.com



# గత ఏడాది కంటే కటాఫ్ తగ్గే చాన్స్

ఈసారి 92 పర్సంటైల్ ఉండొచ్చని అంచనా

జేఈఈ-మెయిన్ పరీక్షలు రెండు సెషన్లూ క్లిష్టంగానే..

జనవరితో పోలిస్తే ఏప్రిల్ సెషన్‌లో ఉపశమనం

ముగిసిన రెండో సెషన్ పరీక్షలు

సాక్షి, ఎడ్యుకేషన్: జాతీయస్థాయిలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించిన జేఈఈ మెయిన్-2025లో గత ఏడాదితో పోలిస్తే కటాఫ్ కొంత తగ్గే అవకాశం ఉంది. 2024లో జేఈఈ మెయిన్స్‌లో పర్సంటైల్ 94 ఉండగా, ఈసారి అది 92 ఉండొచ్చని సబ్జెక్ట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది జనవరి, ఏప్రిల్‌లో నిర్వహించిన రెండు సెషన్లలోనూ ప్రశ్నలు కాసింత క్లిష్టంగా ఉండటమే కారణమని చెబుతున్నారు. దేశవ్యాప్తంగా రెండు సెషన్లలో.. 19 షిఫ్టులలో నిర్వహించిన జేఈఈ మెయిన్ ప్రవేశ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. దాదాపు 12 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా 90 శాతం మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు లక్షన్నర మంది అభ్యర్థులు ఉంటారని అంచనా.

**పర్సంటైల్ అంచనా..:** ఈసారి మ్యాథమెటిక్స్‌లో 20 మార్కులతో; ఫిజిక్స్‌లో 50 మార్కులతో; కెమిస్ట్రీలో 35 మార్కులతో 92 పర్సంటైల్ ఉండొచ్చని చెబుతున్నారు. అదేవిధంగా మ్యాథమెటి క్స్‌లో 35 మార్కులు; ఫిజిక్స్‌లో 45 మార్కులు; కెమిస్ట్రీలో 65 మార్కులతో 99 పర్సంటైల్‌ను ఆశించొచ్చని అంటున్నారు.

**చివరి రోజు కాస్త కఠినం:** జేఈఈ-మెయిన్ చివరి రోజు ప్రశ్నపత్రం ఓ మోస్తరు క్లిష్టంగా ఉందని సబ్జెక్ట్ నిపుణులు చెప్పారు. మ్యాథమెటిక్స్ ప్రశ్నలు సులభంగా ఉన్నాయని, కెమిస్ట్రీ ప్రశ్నలు సుదీర్ఘ కసరత్తు చేసేలా ఉన్నాయన్నారు. ఫిజిక్స్‌లో కూడా ఓ మాదిరి కఠినంగానే ప్రశ్నలు అడిగారని తెలిపారు. కెమిస్ట్రీలో ఆర్గానిక్, ఫిజికల్ కెమిస్ట్రీలకు ఎక్కువ వెయిటేజీ కల్పించారని, అదేవిధంగా ప్రశ్నలు మెమొరీ బేస్డ్‌గా ఉన్నాయని విద్యార్థులు చెప్పారు. ఫిజిక్స్‌లో కాన్సెప్ట్స్, కాలిక్యులేషన్స్ అవసరమైన ప్రశ్నలు అడగడంతో కొంత సమయాభావం ఎదురైంది. మ్యాథమెటిక్స్‌లో కాలిక్యులస్, కోఆర్డినేట్ జామెట్రీ, ఆల్జీబ్రాలకు వెయిటేజీ కల్పించారు.

**నేడు పేపర్-2ఎ, 2బి పరీక్షలు:** ఎన్ఐటీల్లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్, ప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశానికి అర్హతగా నిలిచే పేపర్-2ఎ(బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్), పేపర్-2బి (బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్) పేపర్ల పరీక్షలను బుధవారం నిర్వహించనున్నారు.

## ఈఏపీసెట్, అడ్వాన్స్‌డ్ రెండింటికీ ఇలా..

జేఈఈ మెయిన్ పరీక్షలు ముగిసిన నేపథ్యంలో విద్యార్థుల దృష్టి ఈఏపీసెట్, జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రిపరేషన్‌పై ఉంటుంది. ఈ రెండింటికీ ఉమ్మడిగా ప్రిపరేషన్ సాగించాలని భావిస్తారు. కానీ, జేఈఈ-మెయిన్‌లో కటాఫ్ అంచనా కంటే కనీసం పది మార్కులు ఎక్కువ సాధిస్తామనే నమ్మకం ఉంటేనే ఉమ్మడి ప్రిపరేషన్ దిశగా కదలాలి. లేదంటే ముందుగా ఈఏపీసెట్ ప్రిపరేషన్‌కు పదును పెట్టుకోవాలి. ఎందుకంటే ఈఏపీసెట్‌లో వేగం, కచ్చితత్వం అత్యంత ఆవశ్యకం. మూడు గంటల్లో 160 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుందని గుర్తుపెట్టుకోవాలి. ఈ ఏడాది జేఈఈ మెయిన్‌ను విశ్లేషిస్తే సాగదీత ప్రశ్నలు, న్యూమరికల్ ప్రశ్నలు ఎక్కువగా ఉండటంతో అభ్యర్థులకు సమయం సమస్యగా మారింది.

**-ఎంఎస్ రావు, జేఈఈ శిక్షణ నిపుణుడు**

గురువారం ఏప్రిల్ 10, 2025



ఉన్నత విద్యామండలి కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు

## ఉన్నత విద్యామండలి కార్యాలయం ముట్టడితో ఉద్రిక్తత

### కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఆందోళన.. అడ్డుకున్న పోలీసులు

ఈనాడు-హైదరాబాద్, మెహిదీపట్నం, రాంనగర్-న్యూస్‌టుడే: తమకు ఉద్యోగ భద్రత కల్పించిన తర్వాతే కొత్త ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు బుధవారం చేపట్టిన ఉన్నత విద్యామండలి కార్యాలయం ముట్టడి ఉద్రిక్తంగా మారింది. ఉదయం 11 గంటల ప్రాంతంలో వందల మంది కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఒక్కసారిగా హైదరాబాద్ మాసాబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయానికి చేరుకున్నారు. వారిని అడ్డుకునేందుకు పోలీసులు యత్నించగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కొందరు రోడ్డుపైకి చేరుకోవడంతో లక్డీకాపుల్-మాసాబ్‌ట్యాంక్ రహదారిపై వాహనాల రాకపోకలు స్తంభించాయి. పోలీసులు, ఆందోళనకారుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. అనంతరం వారిని పోలీసులు వాహనాల్లోకి ఎక్కించి నగరంలోని వేర్వేరు పోలీస్ ఠాణాలకు తరలించారు. సాయంత్రం వదిలిపెట్టారు. అరెస్టయ్యే ముందు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమన్వయ కమిటీ సభ్యులు ధర్మతేజ, పరశురాం, ఉపేందర్ విలేకరులతో మాట్లాడారు. వర్సిటీల్లో సహాయ ఆచార్యుల భర్తీ నోటిఫికేషన్‌తో సంబంధం లేకుండా తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బేసిక్, డీఏ, హెచ్‌ఆర్‌ఏలతో కూడిన వేతనం చెల్లించాలన్నారు. జీవో 21ని రద్దు చేయాలన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చేవరకు ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు. కాగా, ఉన్నత విద్యామండలి కార్యాలయం ముట్టడి నేపథ్యంలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఐకాస నాయకుల్లో కొందరిని జిల్లాల్లోనే గృహనిర్బంధం చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రతినిధుల్లో కొందరిని ఇళ్ల నుంచి బయటకురాకుండా కట్టడి చేశారు. అక్రమ అరెస్టులకు నిరసనగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీల బంద్ నిర్వహిస్తున్నట్లు ధర్మతేజ, పరశురాం, ఉపేందర్ ప్రకటించారు.

## ఎప్‌సెట్ ఇంజినీరింగ్‌కు 2.16 లక్షల దరఖాస్తులు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ నేపథ్యంలో ఎప్‌సెట్ అధికారులు ఈసారి కేవలం 'ఎస్సీ' అని కాకుండా అన్ని కులాల వారీగా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. రూ.250 ఆలస్య రుసుంతో దరఖాస్తు గడువు బుధవారంతో ముగిసింది. ఇప్పటివరకు మొత్తంగా ఇంజినీరింగ్‌కు 2.16 లక్షలు, అగ్రికల్చర్-ఫార్మసీ విభాగానికి 84 వేల మంది దరఖాస్తు చేశారు. వివిధ అపరాధ రుసుములతో ఇంకా 24వ తేదీ వరకు గడువుంది. ఇంజినీరింగ్‌కు ఎస్సీ కులాలన్నింటి నుంచి 25,300, అగ్రికల్చర్‌కు 21,200 దరఖాస్తు వచ్చాయి. ప్రత్యేకించి మాదిగ విభాగంలో ఇంజినీరింగ్‌కు 13,287(52%), అగ్రికల్చర్‌కు 12,763(60%) మంది దరఖాస్తుచేశారు. మాలల్లో ఇంజినీరింగ్‌కు 30.31, అగ్రికల్చర్‌లో 25.10 శాతం మంది దరఖాస్తులు సమర్పించారు. మిగిలినవి రెండు సామాజికవర్గాల్లోని ఉపకులాల నుంచి వచ్చినవి.

### సహాయ ఆచార్యుల పోస్టులు

## ఈసీగా భర్తీ



ఈనాడు, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్‌లో ఆరు ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో సహాయ ఆచార్యుల పోస్టులను భర్తీ చేసేందుకు విశ్వవిద్యాలయ అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. పోస్టులను భర్తీ చేసేందుకు న్యాయపరంగా, సాంకేతికంగా కార్యనిర్వాహక కమిటీలు (ఈసీ)లు ఉండాలి. నగరంలోని 6 వర్సిటీల్లో ఒక్క విశ్వవిద్యాలయంలోనూ పూర్తి స్థాయిలో ఈసీలు లేకపోవడంతో తొలుత వీటిని నియమించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుత, భవిష్యత్ అవసరాల దృష్ట్యా పూర్తిస్థాయి కార్యనిర్వాహక కమిటీని ఏర్పాటు చేయాలని ఉన్నత విద్యామండలి వీసీలను ఆదేశించింది. దీంతో

**వర్సిటీల్లో నియామకాలకు సన్నాహాలు**



వర్సిటీల్లో పరిపాలనా విభాగంలో విధులు నిర్వహించిన ఆచార్యులు, విద్యానిపుణులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల పేర్లను అధికారులు పరిశీలిస్తున్నారు. ఉస్మానియా, సురవరం ప్రతాపరెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహిళా విశ్వవిద్యాలయం వీసీలు, రిజిస్ట్రార్లు వేర్వేరుగా ఈసీలో సభ్యుల నియామకాలపై సీనియర్ ప్రొఫెసర్లతో చర్చించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి సభ్యుల ఎంపికను వీలైనంత వేగంగా పూర్తి చేయాలని, విద్యానిపుణులు, అనుభవజ్ఞులకు ప్రాధాన్యం కల్పించాలని నిర్ణయించారు. సభ్యుల ఎంపిక పూర్తయ్యాక జాబితాను ఉన్నత విద్యామండలికి పంపి ఆమోదం పొందనున్నారు.

సాక్షి
శుక్రవారం । 11 ।
ఏప్రిల్ । 2025

# ఉన్నత విద్యామండలి చైర్మన్‌తో కె.కేశవరావు భేటీ

## కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లపై చర్చ

సాక్షి, హైదరాబాద్: వర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలన్న ఆందోళనల నేపథ్యంలో గురువారం ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డితో ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు సమావేశమయ్యారు. వర్సిటీల అధ్యాపకుల నియామకాల్లో వారికి వెయిటేజ్ ఇవ్వడమా? కాంట్రాక్టు పద్ధతిలో కొనసాగే వారి పోస్టులను అలాగే వదిలేసి మిగతావి భర్తీ చేయడమా? ఏది సరైన నిర్ణయమో నివేదిక రూపంలో తెలియజేయాలని కోరారు. ఇదే క్రమంలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లతోనూ కేశవరావు సంప్రదింపులు జరిపేందుకు సిద్ధమయ్యారు. కొత్త నియామకాలకు తాము వ్యతిరేకం కాదని, కానీ ఇన్నేళ్లు ఈ ఉద్యోగాలనే నమ్ముకున్న తమను రోడ్డుపాలు చేయొద్దని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ నేతలు ఉపేందర్, ధర్మతేజ, పరుశురాం అంటున్నారు. అలా చేస్తే ఉద్యమించడమే శరణ్యమన్నారు.

నమస్తే తెలంగాణ హైదరాబాద్, శుక్రవారం 11 ఏప్రిల్ 2025

# యూనివర్సిటీల్లో అధ్యాపకులేరి?

- నిలిచిపోయిన పరిశోధనలు, కుంటుపడుతున్న విద్యా బోధన
- అందుబాటులోలేని గైడ్లు, 20 శాతానికి పడిపోయిన రీసెర్చ్
- ఆందోళన వ్యక్తంచేస్తున్న ప్రొఫెసర్లు, విద్యావేత్తలు
- సర్కారు ఆదేశాల కోసం నిరీక్షిస్తున్న ఉన్నత విద్యామండలి



హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ప్రభుత్వ యూనివర్సిటీలు.. కాంగ్రెస్ పాలనలో తీవ్రమైన దుస్థితిని ఎదుర్కొంటున్నాయి. ప్రతిష్ఠాత్మక ఉస్మానియా, కాకతీయ, పాలమూరు, మహాత్మాగాంధీ, తెలంగాణ, శాతవాహన, జేఎన్‌టీయూ వంటి స్టేట్ యూనివర్సిటీలలో ప్రమాణాలు పడిపోయాయి. పట్టించుకునేనాథులు లేకపోవడం వల్ల ఆయా వర్సిటీలు విలవిల్లాడుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడం లేదు.

## పరిశోధనలను పట్టించుకునేదెవరు?

సరిపడా అధ్యాపకులు ఉన్నకాలంలో ఆయా యూనివర్సిటీలలో గరిష్టంగా 70 శాతం వరకు పరిశోధనలు జరిగేవి. పరిశోధనాపత్రాలు కూడా సకాలంలో దాఖలు చేసేవారు. ఇప్పుడు పరిశోధనలు 20 శాతానికి పడిపోయినట్టు సీనియర్ ప్రొఫెసర్లు చెప్తున్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన సీనియర్ ప్రొఫెసర్ ఆందోళన వ్యక్తంచేశారు. వర్సిటీలో బోధన కుంటుపడిందని సీనియర్ ప్రొఫెసర్లు, విద్యార్థి సంఘాల నేతలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో కలిపి 2,816 పోస్టులు ఉండగా.. వాటిలో ప్రస్తుతం 2,059 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో ప్రొఫెసర్ పోస్టులతో పాటు అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి.

### సాంకేతిక సమస్యల్లేవు.. సర్కారే చెప్పాలి!

యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి సాంకేతిక పరంగా ఎలాంటి సమ్యలు లేవు. వాటిని తక్షణమే భర్తీ చేసుకోవడానికి నోటిఫికేషన్ యూనివర్సిటీ వారీగా విడుదల చేసుకోవచ్చు. కానీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఈ పోస్టుల భర్తీ కోసం అనుమతి రావాల్సి ఉంది. అందుకోసం ఎదురుచూస్తున్నాం.

- ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి,
రాష్ట్రఉన్నత విద్యా మండలి ఛైర్మన్

నవతెలంగాణ శనివారం 12 ఏప్రిల్ 2025

# ప్రతిభ ఉంటే ఉద్యోగాలకు కొదవలేదు..

- ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొ. బాలకిష్టారెడ్డి

నవతెలంగాణ-ఓయూ

నేటి సమాజంలో ప్రతిభ విషయ పరిజ్ఞానం, సబ్జెక్టు ఉంటే ఉద్యోగాలకు కొదవ లేదని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొ.బాలకిష్టారెడ్డి అన్నారు. శుక్రవారం ఓయూ డిపార్టుమెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్ విభాగం విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల బ్లీచ్ క్రిగ్ ( బిజినెస్ యుద్ధ యంత్రం)లో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రసంగిం చారు. టెక్నాలజీ ప్రపంచంలో ఉన్నదానిని ఉపయోగించు కొని ముందుకు సాగాలన్నారు. ఓయూ ఎంబీఏ విభాగంలో 60కి 50 మంది ఉద్యోగాలు సాధించడం హర్షణీయమన్నారు. ఈ విభాగలో ఉపాధి కల్పించే కోర్సులు నిర్వహించడాన్ని ప్రశంసించారు. ఇదే విభాగంలో పలువురు విద్యార్థులు సంవత్సరానికి రూ.16 లక్షల ప్యాకేజీ పొం దటం ఇక్కడి ఎంబీఏ విద్యా విధానంకి నిదర్శనమన్నారు. విద్యార్థులు జాబ్స్ ఇచ్చే లీడర్స్ గా, బిజినెస్ ఐకాన్స్ గా, కృషి చేయాలని అంతటి స్థాయికి ఎదగలన్నారు. ఓయూ వీసీ ప్రొ. యం.కుమార్ మాట్లాడుతూ ఎం బీఏ విద్యార్థులు రూ.16 లక్షలు కాకుండా రానున్న రోజుల్లో రూ.20 లక్షల ప్యాకేజీ తీసుకునే స్థాయికి ఎద గాలని కోరారు.



ఈకార్యక్రమంలో విభాగం హెడ్ ప్రొ. వై. జహంగీర్ మాట్లాడుతూ విభాగం ఉన్నతిని ,ఇక్కడి అంది స్తున్న విద్యా విధానం, వివరించారు. ఈ కార్యక్రమంలో 700 మంది వివిధ ఎంబీఏ కళాశాలాల విద్యార్థులు పాల్గొన్నరాని చెప్పారు. కార్యక్రమంలో బిజినెస్ క్విజ్, బెస్ట్ మేనేజర్, ఎంటర్ ట్రైనర్, లాంటి పోటీలతో పాటుగా సాం స్కృతిక కార్యక్ర మాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ వీసీ ప్రొ. సత్యనారాయణ, పూర్వ విద్యార్థి డా.నాగయ్య, ప్రిన్సిపాల్ ప్రొ. శేఖర్, జ్యోత్స్న, హెడ్ ప్రొ. జహంగీర్, డా.వి. సమున్నత, డా.శ్రీరాములు, ప్రో.స్మిత సాంబ్రాణి, డా.విద్యా సాగర్, ఆచార్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

మన తెలంగాణ
మంగళవారం 15, ఏప్రిల్ 2025

# 30 వేలు దాటిన లాసెట్ దరఖాస్తులు

మనతెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో న్యాయ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే లాసెట్, పిజిఎల్‌సెట్‌కు మొత్తం 30,365 దరఖాస్తులు వచ్చినట్లు లాసెట్ కన్వీనర్ తెలిపారు. అందులో మూడేళ్ల ఎల్‌ఎల్‌బికి 21,483 దరఖాస్తులు, ఐదేళ్ల ఎల్‌ఎల్‌బికి 6,326, పిజిఎల్‌సెట్‌కు 2,556 మంది దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి ఆలస్య రుసుం లేకుండా దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 15తో గడువు ముగియనున్నది. రూ.500 ఆలస్య రుసుంతో ఈ నెల 25 వరకు, రూ.వెయ్యి ఆలస్య రుసుంతో మే 5 వరకు, రూ.2 వేల ఆలస్య రుసుంతో మే 15 వరకు, రూ.4 వేల ఆలస్య రుసుంతో మే 25 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. జూన్ 6న ఉదయం 9.30 నుంచి 11 వరకు, మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 4 వరకు మూడేళ్ల ఎల్‌ఎల్‌బికి, సాయంత్రం 4 నుంచి 5.30 వరకు ఐదేళ్ల ఎల్‌ఎల్‌బితో పాటు పిజిఎల్‌సెట్‌కు పరీక్ష నిర్వహించనున్నారు.

ఆంధ్రజ్యోతి
హైదరాబాద్ • మంగళవారం 15 ఏప్రిల్ 2025

# ఎప్‌సెట్‌కు గ్రేటర్ నుంచి 2.24 లక్షల దరఖాస్తులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్- 2025కు గ్రేటర్ హైదరాబాద్ నుంచి దరఖాస్తులు పోటెత్తాయి. సోమవారంతో రూ.500 ఆలస్య రుసుంతో దరఖాస్తుల గడువు ముగిసింది. సోమవారం వరకు మొత్తం 3,04,920 మంది అభ్యర్థులు ఎప్‌సెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 2,24,108(73.49 శాతం) మంది అభ్యర్థులు గ్రేటర్ పరిధిలోని వారే కావడం గమనార్హం. ఎప్‌సెట్‌లో ఇంజనీరింగ్ అభ్యర్థులు 76 శాతం మంది, అగ్రికల్చర్ ఫార్మసీ అభ్యర్థులు 44.63 శాతం మంది నగరంలోని పరీక్షా కేంద్రాలనే ఎంచుకున్నారు. ఏప్రిల్ 29, 30 తేదీల్లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ ప్రవేశ పరీక్షలు, మే 2నుంచి 5వరకు ఇంజనీరింగ్ పరీక్షలు నిర్వహించేందుకు ఎప్‌సెట్ అధికారులు సన్నద్ధమయ్యారు. దరఖాస్తులు సమర్పించిన అభ్యర్థులు ఈ నెల 19నుంచి తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. కాగా, రూ.2,500 ఆలస్య రుసుంతో ఈ నెల 18వరకు, రూ.5 వేల ఆలస్య రుసుంతో 24వ తేదీవరకు ఎప్‌సెట్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

ఆంధ్రప్రభ మంగళవారం 15 - 4 - 2025

# యూనివర్శిటీలు విద్యా విలువలు పెంపొందించాలి

## రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేకే

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** విద్యా విలువలను పెంపొందిస్తూ.. ప్రతి ఒక్కరికి అత్యున్నత ప్రమాణాలతో కూడిన ఉన్నత విద్యను అందించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, రాజ్యసభ మాజీ సభ్యులు, కె. కేశవ రావు అన్నారు. డాక్టర్ బీఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో మహనీయుల జన్మదినోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన సామాజిక సాధికారత వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విశ్వవిద్యాలయాలను రానున్న రోజుల్లో మరింత విస్తరించి సాంకేతిక విద్యా కోర్సులతో ముందుకు వెళ్లాలని సూచించారు. నైపుణ్యతలేని కార్మికులకు నైపుణ్యత ఇచ్చే ప్రాథమిక లక్ష్యంతో సార్వత్రిక విద్య వ్యవస్థ విశ్వవిద్యాలయానికి ఆ నాటి మంత్రి హోదాలో రూపకల్పన చేశామని గుర్తుచేసారు. 43 ఏళ్ళ క్రితం సార్వత్రిక విద్యను అంకురార్పణ చేసే క్రమంలో భాగస్వామ్యమైన తాను.. ఈ రోజు అంబేద్కర్ వర్సిటీ ఎదిగిన క్రమం చూసి గర్వంగా ఉందన్నారు.

అంబెడ్కర్ ఓపన్ వర్సిటీ ఉప కులపతి ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఈ వర్సిటీకి మరో మూడు దశాబ్దాలకు సరిపడే విధంగా మౌళిక వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందించామని, వాటికి ప్రభుత్వం ఆమోదం వేయడం సంతోషంగా ఉందన్నారు.

సమ సమాజ స్థాపనకు అంబేద్కర్ చూపిన మార్గాన్ని అందరూ ఆచరించాల్సిందేనని కవి, సామాజిక ఉద్యమకారులు, డా. కత్తి పద్మారావు పేర్కొన్నారు. అంబేద్కర్ స్మారకోపన్యాసంలో కత్తి పద్మారావు అంబేద్కర్ సమకాలిన దర్శనం అంశంపై గుంటూర్ జిల్లా పొన్నూర్ నుంచి ఆన్లైన్ ద్వారా ఉపన్యాసం చేశారు. అంబేద్కర్ కులవ్యవస్థను చాలా దగ్గర నుంచి చూశారు. అంబేద్కర్ భావజాలంలో విద్య చాలా కీలకం. విద్య లేకపోతే మనిషి తన హక్కులు, బాధ్యతలు తెలుసుకోలేడని వివరించారు.

వార్త, హైదరాబాద్, బుధవారం 16, ఏప్రిల్ 2025

# అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఖాళీల వివరాలు ఇవ్వండి

## సేకరిస్తున్న ఉన్నత విద్యా మండలి

**హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని యూని వర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీ ప్రక్రియ వేగం పుంజుకుంది. ఎస్సీ వర్గీకరణతోపాటు ఉపకులాలకు రోస్టర్ పాయింట్లను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ ప్రక్రియ వేగం పెరిగింది. రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల వివరాలను ఇవ్వాలని పేర్కొంటూ తెలంగాణ ఉన్నత విద్యా మండలి విశ్వవిద్యాలయాలకు లేఖలు రాసింది. గతంలోనూ ఇలానే యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల వివరాలను సేకరించారు. అయితే ఈ వివరాలు గత రెండు సంవత్సరాల క్రితం సేకరించిన నేపథ్యంలో.. ఈ సమయంలో పదవి విరమణ పొందిన వారు ఉంటారు కాబట్టి.. ప్రస్తుతం యూనివర్సిటీల్లో మంజూరైన అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఎన్ని? ప్రస్తుతం పనిచేస్తున్న వారు ఎంత మంది? ఎన్ని పోస్టులు ప్రస్తుతానికి ఖాళీగా ఉన్నాయనే వివరాలను స్పష్టంగా ఇవ్వాలని కోరుతూ తెలంగాణ ఉన్నత విద్యా మండలి వర్సిటీలకు లేఖలు రాసింది. ఒక్క ఉస్మానియా యూనివర్సిటీలోనే 1572 పోస్టులు మంజూరు కాగా వాటిలో 458 మంది పనిచేస్తుండగా.. 1114 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గతంలో వివరాలు సేకరించినప్పుడు మొత్తం ఖాళీలు 20260 ఉన్నట్టుగా చెప్పగా.. ప్రస్తుతం 2125 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు తెలుస్తోంది. అందుకే పూర్తి వివరాలను స్పష్టంగా ఇవ్వాలని కోరుతూ ఉన్నత విద్యా మండలి యూనివర్సిటీలకు లేఖలు రాసింది.

ఇప్పటికే ఒకటి, రెండు యూనివర్సిటీలు తమ విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల వివరాలను పంపించినట్టు తెలిసింది. రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల వివరాలను ప్రభుత్వానికి ఉన్నత విద్యా మండలి సమర్పించనుంది.

ఆంధ్రజ్యోతి
హైదరాబాద్ • బుధవారం 16 ఏప్రిల్ 2025

# లా, పీజీఎల్ సెట్‌లకు గడువు పెంపు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): లాసెట్, పీజీఎల్ సెట్-2025 దరఖాస్తులకు గడువు పెంచుతున్నట్లు కన్వీనర్ విజయలక్ష్మి తెలిపారు. ఆలస్య రుసుం లేకుండా ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థుల వినతి మేరకు గడువును పెంచుతున్నామని వివరించారు.

ప్రభాత
వెలుగు
గురువారం | హైదరాబాద్
17.04.2025
www.v6velugu.com

# టీజీపీఎస్సీ సిలబస్ కమిటీ చైర్మన్‌గా బాలకిష్టారెడ్డి

- పదేండ్లు అయిన నేపథ్యంలో సిలబస్‌లో మార్పులకు కసరత్తు



**హైదరాబాద్, వెలుగు:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహించే పలు పోటీ పరీక్షల కోసం కొత్త సిలబస్ తయారు చేయనున్నారు. దీనికోసం సిలబస్ కమిటీ చైర్మన్‌గా హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డిని నియమించారు. బుధవారం ఎంసీహెచ్ఆర్డీలో టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో పలు అంశాలపై చర్చించేందుకు వర్సిటీ వీసీలతో సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన వెంటనే 2014-15లో టీఎస్‌పీఎస్సీ కోసం అప్పట్లో ప్రొఫెసర్ కోదండరామ్ నేతృత్వంలో సిలబస్ కమిటీని నియమించారు. కమిటీలో సీనియర్ విద్యావేత్తలు చుక్కా రామయ్య, హరగోపాల్ తదితరులు ఉన్నారు. సిలబస్ వచ్చి పదేండ్లు అవుతున్న నేపథ్యంలో ప్రస్తుతం వచ్చిన మార్పులకు అనుగుణంగా సిలబస్ లో మార్పులు తీసుకురావాలని కమిషన్ డిసైడ్ అయింది. దీనికోసం బాలకిష్టారెడ్డి నేతృత్వంలో ఆరుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ప్రస్తుతమున్న గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3, గ్రూప్ 4తో పాటు ఇతర పరీక్షల సిలబస్‌ను రూపొందించనున్నారు. సమకాలీన అవసరాలు, రాష్ట్ర విధానాలు, జాతీయ పోటీ పరీక్షల ప్రమాణాలను పరిగణనలోకి తీసుకొని కొత్త సిలబస్ తయారు చేయనున్నారు. ఉద్యోగ అవసరాలు, అభ్యర్థుల సామర్థ్యాలను అంచనా వేసేలా దీన్ని రూపొందించనున్నారు. దీంతో పాటు పటిష్టమైన క్వశ్చన్ బ్యాంక్ రూపకల్పన, ఇంటర్వ్యూలపై అధ్యయనం, టెక్నికల్ అంశాలపై మరో మూడు కమిటీలనూ టీజీపీఎస్సీ వేసింది. వీటికి జేఎన్టీయూ వీసీ, పాలమూరు వర్సిటీ వీసీ బాధ్యులుగా ఉన్నారు.

## వర్సిటీల్లో రిక్రూట్‌మెంట్ జీవోకు సవరణలు?

- అభ్యంతరాలపై హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ రిసర్చ్

**హైదరాబాద్, వెలుగు:** యూనివర్సిటీల్లో చేపట్టే అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 21లో మార్పులు వచ్చే అవకాశం కన్పిస్తోంది. రిక్రూట్‌మెంట్‌లో యూజీసీ నిబంధనలు అమలు చేయాలని ఇప్పటికే పలువురు హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ అధికారులకు విజ్ఞప్తులు చేశారు. వర్సిటీల్లో పనిచేస్తున్న పార్ట్ టైమ్ లెక్చరర్లు తమకూ వెయిటేజీ వర్తింపజేయాలని కోరుతున్నారు. మరోపక్క కాంట్రాక్టు లెక్చరర్లు తమకు ప్రత్యేకంగా వెయిటేజీ ఇవ్వాలని కోరుతున్నారు. దీనికి తోడు యూజీసీ నిబంధనల ప్రకారం పీహెచ్‌డీ ఉంటే 30 మార్కులు ఇవ్వాల్సి ఉందని.. కానీ, ప్రస్తుత జీవోలో 10 మార్కులే ఇచ్చారని కొందరు ఫిర్యాదు చేస్తున్నారు. దీనికితోడు రిక్రూట్‌మెంట్ లో నెట్ లేదా పీహెచ్‌డీ తప్పనిసరిగా ఉండాలనే నిబంధన కూడా అమలు చేయాలని మరికొందరు అభ్యర్థులు కౌన్సిల్ అధికారులను కోరారు. బీటెక్ కోర్సులో వచ్చే మార్కులకు వెయిటేజీ పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అభ్యర్థుల నుంచి వచ్చే అభ్యంతరాలను తీసుకొని.. వాటిపై హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ అధికారులు స్టడీ చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ హైదరాబాద్, శుక్రవారం 18 ఏప్రిల్ 2025

# జీవో 21పై సర్కార్ పునఃసమీక్ష !

- **యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీ జీవో**
- **తరువాత దిద్దుబాటు చర్యలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం**
- **నిపుణులతో ఉన్నత విద్యామండలి కసరత్తు ప్రారంభం**

హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ) : యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ కోసం విడుదల చేసిన జీవో 21లో పేర్కొన్న మార్గదర్శకాలు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్నాయని పీహెచ్‌డీ అభ్యర్థులు, సీనియర్ ప్రొఫెసర్లు ఆరోపిస్తున్నారు. మరో పక్క కాంట్రాక్టు, పార్టుటైమ్ అధ్యాపకులు తొలుత తమ పోస్టులను క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రత కల్పించాలంటూ కొన్ని రోజులుగా ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టినట్టు సమాచారం. జీవో 21ను పునఃసమీక్షించాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు తెలిసింది. పలువురు సీనియర్ ప్రొఫెసర్లతో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి సంప్రదింపులు జరుపుతున్నారు. జీవోపై అభ్యంతరాలు, వినతులు సేకరిస్తున్నారు. నివేదిక రూపొందించి, రాష్ట్ర ప్రభుత్వానికి పరిశీలన కోసం పంపే ప్రయత్నం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనలో ఉన్నారని, ఆయన వచ్చిన తర్వాత ఈ అంశంపై మరికొంత స్పష్టత వచ్చే అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు.

**రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వని సర్కార్..**

అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల్లో రిజర్వేషన్ల విధానంలో ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. ఈ పోస్టుల భర్తీ కోసం యూనివర్సిటీని యూనిట్‌గా తీసుకుంటారా? డిపార్టుమెంట్, సబ్జెక్టులను యూనిట్‌గా తీసుకుంటారా? అన్న అంశంపై స్పష్టత కోసం నిపుణులతో సంప్రదింపులు జరుపుతున్నారు.

Telangana Today

Saturday
April 19, 2025
HYDERABAD

# EAPCET hall-tickets with QR code now

## The code will enable students view route map to their centres

YUVRAJ AKULA
HYDERABAD

Navigating to the Telangana Engineering, Agriculture and Pharmacy Common Entrance Test (TG EAPCET) 2025 exam centres has been made easy as the hall tickets will now feature QR codes that aid candidates in reaching their respective centres.

All that students need to do is scan the QR code printed on the hall tickets with a smartphone. Once scanned, a link opens in the Google Maps application that enables students to view the route map to their centres. In addition, they can ascertain how far the centre is and even the estimated time to reach the venue, considering the traffic.

Hall tickets for AM and engineering stream tests will be available for download on the website https://eapcet.tgche.ac.in from April 19 and 22, respectively. The entrance test for the AM stream is scheduled for April 29 and 30, while the engineering test will be held from May 2 to 4.

Both tests will be conducted in two sessions — 9 am to 12 noon, and 3 pm to 6 pm. The centres' gates will be opened at 7.30 am for the morning session test and 1.30 pm for the afternoon session exam. No student will be allowed even if they are late by a minute.

JNTU-Hyderabad Rector and TG EAPCET 2025 co-convener Dr K Vijaya Kumar Reddy said the pre-examination process, including frisking, capturing the candidate's biometric details, registration and allotment of the system, would take about 20 minutes. "If students reach the centre exactly at 9 am or 3 pm, they will be losing crucial 20 minutes," he said.

Telangana Council of Higher Education Chairman Prof V Balakista Reddy said elaborate arrangements were made for the smooth conduct of the entrance tests. "The new SC categorisation reservation will be implemented in admissions for all programmes offered by higher education institutions in the State," he said.

**TG EAPCET-2025**
Telangana Engineering, Agriculture & Pharmacy Common Entrance Test
Conducted by JNTU Hyderabad on behalf of TGCHE

**HALL TICKET**

| Test Date & Time | Stream | Hall Ticket Number |
|---|---|---|
| 02-05-2025 (Friday) 09:00 AM - 12:00 NOON | Engineering (E) | 2522D01085 |

| Test Centre | Scan QR Code for Centre Location |
|---|---|
| 9577 - ION DIGITAL ZONE IDZ LB NAGAR<br>ION DIGITAL ZONE IDZ LB NAGAR,TECHSPINE SOLUTIONS, OPPOSITE SRIKARA HOSPITAL, AISHWARYA BUILDING, MAIN ROAD LB NAGAR CIRCLE, TOWARDS SAGAR RING ROAD, SAROORNAGAR MANDAL, RANGA REDDY DISTRICT, HYDERABAD, TELANGANA, 500074 | |

## Registrations see dip of 13,000 applications

**Hyderabad:** The TG EAPCET 2025 saw a dip of around 13,000 applications from the State. As many as 2,80,343 applications, including 1,96,993 for engineering, 83,143 for AM stream, were received from Telangana region till the last count on Friday, as against total registrations of 2,93,383 (2,05,472 for engineering and 87,911 for AM stream) during the last year.

Overall, the JNTU-Hyderabad recorded 3,05,774 applications with 2,19,420 for engineering and 86,101 for the AM stream as against a total applications of 3,54,803 last year.

**Last date is April 24**

The last date to apply with a late fee of Rs 5,000 is April 24. Interestingly, despite the State government scrapping the open quota system, which enabled common admissions between AP and Telangana as per the AP Reorganisation Act 2014, a staggering 25,431 students registered for the entrance test under unreserved category.

According to officials, students appearing for unreserved category will not be eligible to participate in the admission counselling for convener quota seats. "Such students cracking the exam must look for a seat under management quota," officials added.

శనివారం । 19 । ఏప్రిల్ । 2025
హైదరాబాద్ । www.sakshi.com

# నేటి నుంచి ఈఏపీ సెట్ హాల్‌టికెట్లు

## అగ్రి, ఫార్మా హాల్ టికెట్ల డౌన్‌లోడ్‌కు అవకాశం

- 22 నుంచి ఇంజనీరింగ్ సెట్ హాల్ టికెట్లు
- ఈనెల 29 నుంచి మే 4 వరకు ఆన్‌లైన్ పరీక్ష
- కీపై అభ్యంతరం లేవనెత్తాలంటే ఒక్కో ప్రశ్నకు రూ.500
- సెట్ కన్వీనర్, కో కన్వీనర్ దీన్‌కుమార్, విజయకుమార్‌రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బాలకిష్టారెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీజీఈఏపీ సెట్)కు అన్ని ఏర్పాట్లు చేసినట్టు సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దీన్‌కుమార్, కో–కన్వీనర్ డాక్టర్ కె విజయకుమార్‌రెడ్డి తెలిపారు. అగ్రి, ఫార్మా సెట్ హాల్ టికెట్లను శనివారం (19వ తేదీ) నుంచి, ఇంజనీరింగ్ సెట్ హాల్ టికెట్లను ఈ నెల 22 నుంచి డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించామని చెప్పారు. ఈ నెల 29 నుంచి మే 4వ తేదీ వరకు ఈఏపీ సెట్ పరీక్షలు జరుగనున్నాయి. ఈ పరీక్షల ఏర్పాట్లను జేఎన్‌టీయూహెచ్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో దీన్‌కుమార్ వివరించారు.

### ఒక్క నిమిషం నిబంధన అమలు

హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్ ఉంటుందని, దీని ద్వారా పరీక్ష కేంద్రాన్ని తేలికగా తెలుసుకోవచ్చని దీన్‌కుమార్, విజయకుమార్‌రెడ్డి తెలిపారు. పరీక్షకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని స్పష్టం చేశారు. మొత్తం 16 జోన్లలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) జరుగుతుందని, ఇందులో నాలుగు జోన్లు హైదరాబాద్ పరిధిలో ఉన్నాయని తెలిపారు. అగ్రి, ఫార్మాకు 112, ఇంజనీరింగ్‌కు 124 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్ష కేంద్రం లోపలికి 90 నిమిషాల ముందే అనుమతిస్తామని తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి 2,19,420.. అగ్రి, ఫార్మాకు 86,101, రెండు విభాగాలకు కలిపి 253 దరఖాస్తులు వచ్చాయని విజయకుమార్ రెడ్డి వెల్లడించారు. మీడియా సమావేశంలో జెఎన్‌టీయూహెచ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టి కిషన్‌కుమార్‌రెడ్డి, ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వీటిని మరిచిపోవద్దు

- పరీక్ష కేంద్రం లొకేషన్‌ను హాల్ టికెట్‌పై ముద్రించిన క్యూఆర్ కోడ్ ద్వారా ముందే గుర్తించవచ్చు. ఉదయం సెషన్‌కు 7.30 గంటలకు, సాయంత్రం సెషన్‌కు మధ్యాహ్నం 1.30 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. బయోమెట్రిక్ హాజరు తీసుకుంటారు కాబట్టి విద్యార్థులు చేతులకు మెహందీ, టాటూలు, ఇంకు వేసుకోకూడదు.
- పరీక్ష కేంద్రంలోకి బాల్ పాయింట్ పెన్, పెన్సిల్, హాల్ టిక్కెట్, ఐడీ ప్రూఫ్ మాత్రమే అనుమతిస్తారు. క్యాలిక్యులేటర్, సెల్‌ఫోన్, రిస్ట్‌వాచ్, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరు. ద్విభాషలో ఉండే ప్రశ్నలు ట్రాన్స్‌లేషన్‌లో తేడా వస్తే, ఇంగ్లిష్‌లోని ప్రశ్ననే ప్రామాణికంగా తీసుకుంటారు.
- పరీక్ష తర్వాత విడుదల చేసే ప్రాథమిక కీపై అభ్యంతరాలు లేవనెత్తాలంటే ప్రతి ప్రశ్నకు రూ.500 చెల్లించాలి. ఆ ప్రశ్నలో తప్పులుంటే ఈ మొత్తాన్ని ఏడు రోజుల్లో తిరిగి ఇచ్చేస్తారు. లేని పక్షంలో ఆ డబ్బు తిరిగి రాదు. నిరాధార అభ్యంతరాలను అదుపు చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నారు.

### సెట్ పరీక్ష తేదీలు, సమయం ఇలా..

(పరీక్ష రెండు సెషన్లుగా జరుగుతుంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు.. సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకు)

| పరీక్ష | పరీక్ష తేదీలు | హాల్ టిక్కెట్ల డౌన్‌లోడ్ |
|---|---|---|
| అగ్రి, ఫార్మా | ఏప్రిల్ 29 - 30 | 19-4-25 (సాయంత్రం 3 నుంచి) |
| ఇంజనీరింగ్ | మే 2 - 4 | 22-4-25 (సాయంత్రం 3 నుంచి) |

పరీక్ష జోన్లు - పరీక్ష రాసే విద్యార్థుల సంఖ్య
సాక్షి ప్లస్ ఈ-పేపర్‌లో..

ఈనాడు శనివారం ఏప్రిల్ 19, 2025

## ఉన్నత విద్యలో సంస్కరణలపై అధ్యయనం: బాలకిష్టారెడ్డి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఉన్నత విద్యలో తీసుకురావాల్సిన సంస్కరణలపై అధ్యయనం చేస్తున్నామని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ వి.బాలకిష్టారెడ్డి చెప్పారు. జేఎన్‌టీయూహెచ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలు.. చేయాల్సిన సంస్కరణలపై ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లానని, ఆయన అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలన్నారన్నారు. అవసరమైతే అసెంబ్లీలో చర్చించి ఉన్న చట్టాలకు సవరణలు చేయడమో.. లేకుంటే కొత్త చట్టాలు చేసేలా చర్యలు తీసుకుందామని చెప్పారని వివరించారు. ఉదాహరణకు జాతీయ విద్యా విధానం తరహాలో తెలంగాణ విద్యా విధానం రూపొందించుకోవచ్చని, డీమ్డ్, ప్రైవేట్ వర్సిటీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వాల నియంత్రణ వంటి పలు అంశాలపై అధ్యయనం చేస్తున్నామని చెప్పారు.

## డీమ్డ్ టు బి వర్సిటీలకు అనుమతి ఇవ్వొద్దు

### యూజీసీకి లేఖ రాసిన కాళోజీ వర్సిటీ!

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు వైద్య కళాశాలలు 'డీమ్డ్ టు బి వర్సిటీ'లుగా అనుమతించాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)ని తాజాగా కోరిన నేపథ్యంలో ఆ వర్సిటీలకు అనుమతి ఇవ్వొద్దని కాళోజీ వర్సిటీ అభ్యంతరం వ్యక్తం చేస్తూ యూజీసీకి లేఖ రాసినట్లు తెలిసింది. 'డీమ్డ్ బాటలో మరికొన్ని వైద్య కళాశాలలు' అనే శీర్షికన శుక్రవారం 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కాళోజీ ఆరోగ్య వర్సిటీ యూజీసీకి లేఖ రాసినట్లు విశ్వసనీయ సమాచారం. డీమ్డ్ టు బి వర్సిటీలుగా మారేందుకు ఇటీవల పలు కళాశాలలు తమ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) ఇవ్వాలని కోరాయని, దాంతో పేద విద్యార్థులకు సీట్లు తగ్గిపోతాయన్న కోణంలో వర్సిటీ ఆలోచిస్తోందని కాళోజీ వీసీ యూజీసీకి రాసిన లేఖలో పేర్కొన్నట్లు తెలిసింది. గతంలో డీమ్డ్ వర్సిటీలుగా మారిన కళాశాలల దస్త్రాలను పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

## ఎప్‌సెట్ హాల్‌టికెట్లపైనా క్యూఆర్ కోడ్

- పరీక్ష కేంద్రం చిరునామా, దూరం ఇట్టే తెలుసుకోవచ్చు
- ఉన్నత విద్యామండలి అధికారుల వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: ఇంటి నుంచి పరీక్ష కేంద్రం ఎంత దూరం ఉందో? అక్కడికి చేరుకునేందుకు ఎంత సమయం పడుతుందో? అనే ఆందోళన ఎప్‌సెట్ రాయబోయే విద్యార్థులకు అవసరం లేదు. ఈ ప్రశ్నలకు సమాధానంగా తొలిసారిగా ఎప్‌సెట్ నిర్వాహకులు హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్ ముద్రిస్తున్నారు. దాన్ని మొబైల్ ఫోన్‌తో స్కాన్ చేస్తే చాలు.. పరీక్ష కేంద్రం ఏ ప్రాంతంలో ఉంది

...మిగతా 5లో.

## ఎప్‌సెట్ హాల్‌టికెట్లపైనా క్యూఆర్ కోడ్

(మొదటి పేజీ తరువాయి)

మీ ఇంటి నుంచి ఎంత దూరం ఉంది, అక్కడికి చేరుకునేందుకు ఎంత సమయం పడుతుంది.. తదితర వివరాలన్నీ తెలుస్తాయని ఉన్నత విద్యామండలి అధికారులు వెల్లడించారు. ఈ నెల 29వ తేదీ నుంచి ఎప్‌సెట్ అగ్రికల్చర్, వచ్చే నెల 2 నుంచి ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు ప్రారంభమ



మాట్లాడుతున్న బాలకిష్టారెడ్డి. చిత్రంలో పురుషోత్తం, మహమూద్, కిషన్‌కుమార్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, వెంకటేష్, వెంకటేశ్వర్‌రావు, డీన్‌కుమార్

### ఎప్‌సెట్ గణాంకాలు ఇవీ...

అమ్మాయిలు, అబ్బాయిల వారీగా దరఖాస్తులు

| జెండర్ | ఇంజినీరింగ్ | అగ్రికల్చర్ |
|---|---|---|
| అమ్మాయిలు | 93,711 | 65,016 |
| అబ్బాయిలు | 1,25,660 | 21,074 |

లోకల్, అన్‌రిజర్వుడ్ వారీగా దరఖాస్తులు

| ఏరియా | ఇంజినీరింగ్ | అగ్రికల్చర్ |
|---|---|---|
| లోకల | 1,96,993 | 83,143 |
| అన్ రిజర్వుడ్ | 22,427 | 2,958 |

(గమనిక: అన్‌రిజర్వుడ్ విద్యార్థులు 15 శాతం కోటా కింద సీట్లు పొందాల్సి ఉంటుంది. తెలంగాణ మూలాలు ఉండి ఇతర రాష్ట్రాల్లో ఉన్నవారు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారి పిల్లలు ఈ విభాగం కిందికి వస్తారు)

వుతున్న నేపథ్యంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, జేఎన్‌టీయూహెచ్ ఉపకులపతి ఆచార్య టి.కిషన్‌కుమార్‌రెడ్డి, కన్వీనర్ ఆచార్య బి.డీన్‌కుమార్, కోకన్వీనర్ ఆచార్య కె.విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్‌రావు తదితరులు శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఏర్పాట్లు సహా పలు అంశాలను వెల్లడించారు. కోకన్వీనర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, "ప్రవేశ పరీక్షల్లో తొలిసారిగా హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్ విధానానికి ఎప్‌సెట్‌తో శ్రీకారం చుట్టాం. దానివల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం ఉంటుంది. గతంలో మాదిరిగానే ఈసారి కూడా ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతి ఉండదు. అందరూ చివరి నిమిషంలో వస్తే బయోమెట్రిక్ హాజరు తీసుకోవడానికి సమయం పడుతుంది కాబట్టి పరీక్ష సమయం నష్టపోయే ప్రమాదం ఉంటుంది. ముందుగా రావడమే శ్రేయస్కరం. అగ్రికల్చర్, ఇంజినీరింగ్ రెండు విభాగాలకు దరఖాస్తుచేసిన వారికి వేర్వేరు హాల్ టికెట్లు ఇస్తాం. ఎక్కడైనా సాంకేతిక కారణాలతో కంప్యూటర్లు పనిచేయకపోయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆ మేరకు సమయాన్ని తర్వాత ఇస్తాం. ఈ నెల 24వ తేదీ వరకు రూ. 5 వేల ఆలస్య రుసుంతో దరఖాస్తు చేసుకోవచ్చు' అని ఆయన స్పష్టంచేశారు. బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ ప్రవేశాల్లో ఈసారి ఎస్సీ వర్గీకరణ అమలవుతోందని, అందుకే దరఖాస్తులను ఉపకులాల వారీగా స్వీకరించామని తెలిపారు. ఈసారి ముందుగానే ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

### వచ్చే నెల 15 నాటికే అనుబంధ గుర్తింపు

ఎప్‌సెట్ ఛైర్మన్, జేఎన్‌టీయూహెచ్ వీసీ కిషన్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ, ఇంజినీరింగ్ కళాశాలల తనిఖీ ప్రారంభమైందని, మే 15వ తేదీ నాటికి అనుబంధ గుర్తింపు ఇవ్వాలని భావిస్తున్నామన్నారు. తనిఖీల్లో గుర్తించిన లోపాల నివేదికను వెబ్‌సైట్‌లో పెడతారా అని విలేకరులు ప్రశ్నించగా, పాలక మండలి సమావేశంలో దానిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. స్వయంప్రతిపత్తి హోదా ఉన్న కొన్ని కళాశాలలు నిర్వహించే పరీక్షల ఫలితాల్లో లోపాలు గుర్తించామని, సరిచేసుకోవాల్సిందిగా ఆదేశించామని చెప్పారు. సమావేశంలో ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షులు ఇటిక్యాల పురుషోత్తం, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేష్ పాల్గొన్నారు.

### ఎప్‌సెట్‌కు తగ్గిన దరఖాస్తులు

- ఈసారి ఏపీ విద్యార్థులకు దరఖాస్తుచేసుకునే అవకాశం లేకపోవడంతో ఎప్‌సెట్‌కు దరఖాస్తులు తగ్గాయి. ఇంజినీరింగ్‌కు గత ఏడాది 2.54 లక్షల దరఖాస్తులు అందగా.. ఈసారి 2.19 లక్షలే వచ్చాయి. అగ్రికల్చర్ విభాగానికి గతేడు లక్ష రాగా, ఈసారి 86 వేలు మాత్రమే వచ్చాయి.
- ఈడబ్ల్యూఎస్ కింద ఇంజినీరింగ్‌కు 28,199 మంది, అగ్రికల్చర్‌కు 3,243 మంది దరఖాస్తు చేశారు. రెండు విభాగాల్లో ఓసీ నుంచి 65,697 మంది దరఖాస్తు చేసుకోగా, దాదాపు సగం మంది ఈడబ్ల్యూఎస్ విభాగం కిందే ఉండటం గమనార్హం.

ధ్రజ్యోతి హైదరాబాద్ • శనివారం 19 ఏప్రిల్ 2025

# నేటి నుంచి ఎప్‌సెట్ హాల్‌టికెట్లు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎప్‌సెట్-2025 అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్ అభ్యర్థులు శనివారం(19వ తేదీ) నుంచి హాల్‌టికెట్లను జేఎన్టీయూ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సంబంధిత అధికారులు వెల్లడించారు. ఇంజనీరింగ్ స్ట్రీమ్ అభ్యర్థులు ఈ నెల 22 నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. పరీక్షలు రాసే అభ్యర్థులు నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్షాకేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ నెల 29, 30వ తేదీల్లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్, మే 2 నుంచి 4వ తేదీ వరకు ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం జేఎన్టీయూలో యూనివర్సిటీ రెక్టార్, ఎప్‌సెట్ కో కన్వీనర్ డాక్టర్ విజయ కుమార్ రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. పరీక్షలు రెండు సెషన్లలో జరుగుతాయని ఉదయం సెషన్ 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తామని. ప్రతి సెషన్‌కు 90 నిమిషాల ముందే అభ్యర్థులను పరీక్షాకేంద్రాల్లోకి అనుమతిస్తామని చెప్పారు. అభ్యర్థులు ఎంచుకున్న జోన్ పరిధిలోనే పరీక్షాకేంద్రాలను కేటాయించామని, పరీక్షాకేంద్రాల లొకేషన్‌ను తెలుసుకునేందుకు వీలుగా అభ్యర్థుల హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్‌ను ముద్రించామని చెప్పారు. ఇంకా దరఖాస్తు చేయని అభ్యర్థులు ఈ నెల 24 వరకు ఆలస్య రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. హాల్‌టికెట్లలో వివరాలు ఏవైనా తప్పుగా నమోదైతే అభ్యర్థులు వీలైనంత త్వరగా ఎప్‌సెట్ ఆఫీసుకు మెయిల్ ద్వారా సమాచారం పంపి అప్‌డేట్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభాత
వెలుగు
శనివారం | హైదరాబాద్
19.04.2025
www.v6velugu.com



# ఎప్ సెట్ హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్

- దీనిద్వారా పరీక్షా కేంద్రానికి చేరుకునేలా రూట్ మ్యాప్
- నేటి నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్.. 29 నుంచి ఎగ్జామ్స్
- అటెండ్ కానున్న 3.05 లక్షలకుపైగా విద్యార్థులు.. వెల్లడించిన అధికారులు

**హైదరాబాద్, వెలుగు:** రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్ సెట్ పరీక్షలు ఈనెల 29 నుంచి ప్రారంభం కానున్నాయి. మే 4వ తేదీ వరకు జరిగే పరీక్షలకు 3.05 లక్షలకు పైగా విద్యార్థులు హాజరు కానున్నారు. అయితే, తొలిసారిగా ఈఏపీ సెట్ హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్ ను ముద్రించారు. దీనిద్వారా పరీక్షా కేంద్రాలను ఈజీగా తెలుసుకునే అవకాశం ఉంది. ఈసారి కూడా ఎగ్జామ్ కు నిమిషం నిబంధన అమలు చేయనున్నారు. ఎప్ సెట్ ఎగ్జామ్ ఏర్పాట్లపై శుక్రవారం జేఎన్టీయూహెచ్ లో హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ బాలకిష్టారెడ్డి, వర్సిటీ వీసీ కిషన్ కుమార్ రెడ్డి, ఎప్ సెట్ కన్వీనర్ దీన్ కుమార్, కోకన్వీనర్ విజయ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎప్ సెట్ కు మొత్తం 3,05,774 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారిలో ఇంజినీరింగ్ స్ట్రీమ్ కోసం 2,19,420 మంది, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కోసం 86,101 మంది, రెండింటికీ 253 మంది అప్లై చేశారని చెప్పారు. ఈ నెల 29,30 తేదీల్లో జరిగే అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కోసం 112 పరీక్షా కేంద్రాలు, మే 2 నుంచి 4 వరకు జరిగే ఇంజినీరింగ్ స్ట్రీమ్ కోసం 124 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. కాగా, శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి అగ్రికల్చర్, ఫార్మసీ అభ్యర్థులకు, 22 నుంచి ఇంజినీరింగ్ అభ్యర్థులకు వెబ్ సైట్ లో హాల్ టికెట్లు అందుబాటులో ఉంటాయి. రోజూ రెండు సెషన్లలో ఎగ్జామ్స్ ఉంటాయని, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ కంటిన్యూ అవుతాయని అధికారులు పేర్కొన్నారు.

**తగ్గిన అప్లికేషన్లు..**

గతేడాదితో పోలిస్తే ఈసారి ఎప్ సెట్ అప్లికేషన్లు తగ్గాయి. 2024లో 3,54,803 దరఖాస్తులు రాగా, ఈసారి 3,05,774 వచ్చాయి. ఉమ్మడి ఏపీ విభజన కోటా ఈ ఏడాదితో ముగియడంతో ఏపీ విద్యార్థులకు ప్రత్యేక కోటా లేదు. ఈ క్రమంలోనే దరఖాస్తులు సుమారు 50 వేల వరకు తగ్గాయని అధికారులు చెప్తున్నారు. అయితే, ఎప్ సెట్ దరఖాస్తుల్లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన విద్యార్థులు 2,80,343 మంది ఉండగా, ఇతర రాష్ట్రాలకు చెందినవారు 25, 431 మంది ఉన్నారు. ఎప్ సెట్ అడ్మిషన్ల ప్రక్రియలో తొలిసారిగా ఎస్సీ వర్గీకరణ అమలు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

www.manatelangana.news
మన తెలంగాణ
శనివారం 19, ఏప్రిల్ 2025

# ఎప్‌సెట్ హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్

- 29, 30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మా ప్రవేశ పరీక్ష
- నేటి నుంచి అందుబాటులోకి హాల్ టికెట్లు
- రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి



**మన తెలంగాణ/హైదరాబాద్:** రాష్ట్రంలో ఈ నెల 29 నుంచి ఇఎపిసెట్ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉన్నత విద్యామండలి చైర్మన్ వి.బాలకిష్టారెడ్డి వెల్లడించారు. ఈ నెల 29, 30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మా ప్రవేశ పరీక్ష, మే 2 నుంచి 4 వరకు ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష జరుగనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 వరకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 16 ప్రాంతాల్లోని 124 కేంద్రాల్లో ఇఎపిసెట్ పరీక్షల కోసం ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. అగ్రికల్చర్, ఫార్మా ప్రవేశ పరీక్షకు 86,101 మంది, ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షకు 2,19,420 మంది, రెండింటికీ 253 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్షకు అనుమతించబోమని స్పష్టం చేశారు. టిజిఇఎపిసెట్‌కు సంబంధించిన ఏర్పాట్లపై శుక్రవారం జెఎన్‌టియుహెచ్‌లో వైస్ ఛాన్స్‌లర్ టి.కిషన్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు, కన్వీనర్ డీన్‌కుమార్, కో కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్లు మహమూద్, పురుషోత్తంలతో కలిసి చైర్మన్ బాలకిష్టారెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఎపిసెట్ వివరాలు, విద్యార్థులు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఇఎపిసెట్ పరీక్షలకు ఈసారి క్యూఆర్ కోడ్‌తో హాల్ టికెట్లు జారీ చేస్తున్నట్లు కో కన్వీనర్ విజయకుమార్ రెడ్డి వెల్లడించారు. హాల్ టికెట్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పరీక్షా కేంద్రం వివరాలు వస్తాయని తెలిపారు. విద్యార్థులు నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిందేనని పేర్కొన్నారు. పరీక్షా సమయానికి 90 నిమిషాల ముందు నుంచే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని, కనీసం 20 నిమిషాల ముందే కేంద్రానికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల వివరాల పరిశీలనకు 20 నిమిషాల సమయం పడుతుందని, కాబట్టి విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలని చెప్పారు. పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు ఉదయం సెషన్‌కు 9 గంటల వరకు రిపోర్టింగ్ చేయాలని, ఆ తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించమని స్పష్టం చేశారు. విద్యార్థులు తమ వెంట ఒక గుర్తింపు కార్డు, ఇటీవల తీసుకున్న ఫొటో తీసుకురావాలని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

## ప్రవేశాలలో ఎస్‌సి వర్గీకరణ అమలు

రాష్ట్రంలో ఉన్నత విద్యా ప్రవేశాలలో ఎస్‌సి వర్గీకరణ అమలు చేయనున్నట్లు ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి వెల్లడించారు. ఉత్తర్వులకు అనుగుణంగా ప్రవేశాలు ప్రక్రియ చేపడతామని స్పష్టం చేశారు.

## నేటి నుంచి హాల్ టికెట్లు

టిజిఇఎపిసెట్‌లో ఫార్మా, అగ్రికల్చర్ పరీక్షల హాల్‌టికెట్లు శనివారం (ఏప్రిల్ 19) నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని చైర్మన్ బాలకిష్టారెడ్డి వెల్లడించారు. ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులు ఈ నెల 22 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇంజినీరింగ్ విభాగానికి హైదరాబాద్ జోన్ 3లో అధికంగా 50,149 మంది, నిజామాబాద్ జోన్‌లో అత్యల్పంగా 1,650 మంది పరీక్ష రాసేందుకు నమోదు చేసుకున్నట్లు చెప్పారు.

# ఎప్‌సెట్ హాల్‌టికెట్లలో క్యూఆర్ కోడ్

## నేటినుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌కు అవకాశం

## నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులకు అనుమతి నిరాకరణ

- పరీక్షా కేంద్రానికి దూరం, చేరుకునే సమయం తెలుసుకోవచ్చు
- 3.05 లక్షల దరఖాస్తులు
- 29, 30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు
- మే 2,3,4 తేదీల్లో ఇంజినీరింగ్ విభాగం ఎగ్జామ్స్ : బాలకిష్టారెడ్డి, టీకేకే రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి వెల్లడి




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్‌కు 3,05,774 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి జేఎన్టీయూలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి, జేఎన్టీయూ హైదరాబాద్ వీసీ టి కిషన్‌కుమార్ రెడ్డి, ఎప్‌సెట్ కోకన్వీనర్ విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎప్‌సెట్ ఇంజినీరింగ్ విభాగానికి 2,19,420 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 86,101 మంది, రెండింటికీ 253 మంది కలిపి మొత్తం 3,05,774 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. ఆలస్య రుసుంతో ఈనెల 24 వరకు దరఖాస్తులను సమర్పించొచ్చని సూచించారు. మరో 500 మంది దరఖాస్తు చేసే అవకాశముందని చెప్పారు. ఈ నెల 29, 30 తేదీల్లో ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలు 112 పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తామని అన్నారు. వచ్చేనెల 2, 3,4 తేదీల్లో ఇంజినీరింగ్ విభాగం పరీక్షలను 124 పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తామని వివరించారు. ప్రతిరోజూ రెండు విడతల్లో ఈ పరీక్షలను నిర్వహిస్తామని అన్నారు. ఉదయం తొమ్మిది నుంచి 12 గంటల వరకు మొదటి విడత, మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు రెండో విడత పరీక్షలను చేపడతామని చెప్పారు. బయోమెట్రిక్ హాజరు విధానం ఉన్నందున అభ్యర్థులను పరీక్ష ప్రారంభానికి గంటన్నర ముందునుంచే అనుమతిస్తామని అన్నారు. మొదటి విడత పరీక్షకు ఉదయం 7.30 గంటల నుంచే అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామని వివరించారు. రెండో విడత పరీక్షకు మధ్యాహ్నం 1.30 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఉంటుందని అన్నారు. మొదటి విడతకు ఉదయం తొమ్మిది గంటలకు, రెండో విడతకు మధ్యాహ్నం మూడు గంటలకు నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఒకరోజు ముందే పరీక్షా కేంద్రాన్ని సందర్శించాలని సూచించారు. మొదటిసారిగా హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్‌ను ముద్రించామని చెప్పారు. అభ్యర్థులు స్కాన్ చేసి ఇంటినుంచి పరీక్షా కేంద్రానికి దూరంతోపాటు ఎంత సమయంలో చేరుకోవచ్చో తెలుసుకోవచ్చని సూచించారు. శనివారం నుంచి అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం అభ్యర్థులు, ఈనెల 22 నుంచి ఇంజినీరింగ్ విభాగం అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశముందని చెప్పారు. అభ్యర్థులు హాల్‌టికెట్లను ముందే డౌన్‌లోడ్ చేసుకోవాలనీ, ఏమైనా తప్పులుంటే సరిదిద్దుకోవాలని సూచించారు. అభ్యర్థులు బ్లాక్/బ్లూ బాల్‌పాయింట్ పెన్ను, హాల్‌టికెట్‌తోపాటు ఫొటో గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలని కోరారు. పరీక్షా కేంద్రాల్లోకి క్యాలిక్యులేటర్లు, మ్యాథమెటికల్/లాగ్ టేబుల్స్, పేజర్లు, సెల్‌ఫోన్లు, చేతిగడియారాలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావడాన్ని నిషేధించామని అన్నారు. ఇతర వివరాల కోసం https://eapcet.tgche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్లు ఇటిక్యాల పురుషోత్తం, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, జేఎన్టీయూ హైదరాబాద్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఎప్‌సెట్ దరఖాస్తుల వివరాలు

| కేటగిరీ | ఇంజినీరింగ్ | అగ్రికల్చర్, ఫార్మసీ | రెండింటికీ | మొత్తం |
|---|---|---|---|---|
| 1. ఓసీ | 56,290 | 9,311 | 96 | 65,697 |
| 2. బీసీ-ఏ | 16,903 | 6,073 | 10 | 22,986 |
| 3. బీసీ-బీ | 46,692 | 11,702 | 34 | 58,428 |
| 4. బీసీ-సీ | 1,063 | 582 | 2 | 1,647 |
| 5. బీసీ-డీ | 44,993 | 13,894 | 26 | 58,913 |
| 6. బీసీ-ఈ | 12,501 | 10,857 | 29 | 23,387 |
| 7. ఎస్సీ | 25,801 | 21,633 | 39 | 47,473 |
| 8. ఎస్టీ | 15,177 | 12,049 | 17 | 27,243 |
| మొత్తం | 2,19,420 | 86,101 | 253 | 3,05,774 |

### ప్రవేశాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తాం : బాలకిష్టారెడ్డి

ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తామని ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి చెప్పారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం విడుదల చేసిందని అన్నారు. అన్ని ప్రవేశాల్లోనూ వర్గీకరణ అమలవుతుందని వివరించారు.

వార్త, హైదరాబాద్, శనివారం 19, ఏప్రిల్ 2025

# నేటి నుంచి అందుబాటులో ఎప్‌సెట్ హాల్ టికెట్లు

## ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** రాష్ట్రం లోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో వివిధ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్ సెట్ కంటే ముందే ప్రైవేటు యూనివర్సిటీలు అడ్మిషన్లను చేపడుతున్నాయని.. తద్వారా మెరిట్ విద్యార్థులు కొందరు అక్కడికి వెళ్తున్న పరిస్థితి నెలకొందని తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, జేఎన్‌టియూ విసి ప్రొఫెసర్ కిషన్ కుమార్‌రెడ్డి అన్నారు. దీనిపై ప్రభుత్వంతగిన విధాన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. నేటి(శనివారం ఏప్రిల్ 19) నుంచి అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు రాసే అభ్యర్థుల హాల్ టికెట్లను అందుబాటులోకి తెచ్చామని.. ఈ నెల 29, 30 తేదీల్లో పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఎప్ సెట్-2025కి 3,05,774 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఎప్‌సెట్-2025 నిర్వహణకి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను వారు శుక్రవారం జేఎన్‌టియూ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రకటించారు. విలేకరుల సమావేశంలో జేఎన్‌టియూ రెక్టార్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు, ఎప్‌సెట్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ డీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 29,30 తేదిల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలను.. మే 2 నుంచి 4 వరకు ఇంజనీరింగ్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఇంజనీరింగ్‌కి 2,19,420 దరఖాస్తులు, అగ్రికల్చర్, ఫార్మసీకి 86,101 దరకాస్తులు రాగా.. రెండింటికి కలిపి 253 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలకు 112 కేంద్రాలను ఏర్పాటు చేయగా.. ఇంజనీరింగ్ పరీక్షలకు 124 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలను రెండు సెషన్‌లలో నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు .. తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈసారి మొదటిసారిగా విద్యార్థులకు జారీ చేసిన హాల్ టికెట్లపై క్విక్ >>2

# ఎప్‌సెట్ హాల్‌టికెట్లు

>> రెస్పాన్స్(క్యూఆర్) కోడ్‌ను ముద్రిస్తున్నట్లు తెలిపారు. క్యూఆర్ కోడ్ మూలంగా విద్యార్థులు తమ పరీక్షా కేంద్రాలను తెలుసుకోవడం సులభతరం అవుతుందని తెలిపారు. విద్యార్థులు చేయాల్సిందల్లా హాల్ టిక్కెట్లపై ముద్రించిన క్యూఆర్ కోడ్‌ను స్మార్ట్‌ఫోన్‌తో స్కాన్ చేయడం. స్కాన్ చేసిన తర్వాత గూగుల్ మ్యాప్స్ అప్లికేషన్‌లో ఒక లింక్ తెరుచుకుంటుంది, ఇది విద్యార్థులు తమ పరీక్షా కేంద్రాలకు వారి రూట్ మ్యాప్‌ను వీక్షించడానికి వీలు కల్పిస్తుంది. దాంతోపాటు ట్రాఫిక్‌ను పరిగణనలోకి తీసుకుని వారి కేంద్రం ఎంత దూరంలో ఉంది.. అక్కడికి చేరుకోవడానికి ఎంతసమయం పడుతుందోకూడా విద్యార్థులు నిర్ధారించుకోవ డానికి అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. పరీక్షల సందర్భంగా నిమిషం నిబంధనను అమలు చేయనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రంలోనికి గంటన్నర ముందుగానే అనుమతిస్తామని.. కాబట్టి విద్యార్థులు ఆలస్యం చేయకుండా త్వరగా పరీక్షా కేంద్రాలకు చేరుకొని ఒత్తిడి లేకుండా పరీక్షలను రాయాలని సూచించారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి జేఎన్‌టియూ పరిధిలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో తనిఖీలను ప్రారంభించినట్లు తెలిపారు. మే 15 లోపుగా తనిఖీలను పూర్తి చేయనున్నట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

నమస్తే తెలంగాణ హైదరాబాద్, శనివారం 19 ఏప్రిల్ 2025

# ఎప్‌సెట్ హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్

- స్కాన్ చేస్తే సెంటర్ రూట్ చెప్పేస్తుంది
- నేడు అగ్రికల్చర్, ఫార్మసీ హాల్ టికెట్ల విడుదల
- 22న అందుబాటులోకి ఇంజినీరింగ్ హాల్ టికెట్లు
- 24లోపే తప్పులను సవరిస్తామన్న జేఎన్టీయూ
- ఈనెల 29 నుంచి మే 4 వరకు పరీక్షలు



హైదరాబాద్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ) : ఎప్‌సెట్ హాల్‌టికెట్లపై క్యూఆర్‌కోడ్‌ను ముద్రించారు. ఇలా క్యూఆర్ కోడ్‌ను ముద్రించడం ఇదే తొలిసారి. పైగా గూగుల్ మ్యాప్‌తో పాటు ఫోన్‌పే, గూగుల్‌పే వంటి యాప్‌లో స్కాన్ చేసినా సెంటర్ లోకేషన్ ఇట్టే చూపిస్తుంది. మీరున్న ప్రాంతం నుంచి సెంటర్ ఎంత దూరమో.. ఆయా సెంటర్లకు ఎన్ని రూట్లున్నాయో.. ట్రాఫిక్ ఎలా ఉందో.. ఎంత సమయం పడుతుందో ఇట్టే చెప్పేస్తుంది. ఇలాంటి విశేషాలతో జేఎన్టీయూ అధికారులు క్యూఆర్ కోడ్‌ను ముద్రించారు. అగ్రికల్చర్, ఫార్మసీ హాల్‌టికెట్లను శనివారం విడుదల చేస్తామని, 22న ఇంజినీరింగ్ విభాగం హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని ఎప్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ డీన్‌కుమార్, కో కన్వీనర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులు పరీక్షకు ఒక రోజు ముందు కాకుండా, హాల్‌టికెట్లను మొదటి రోజే డౌన్‌లోడ్ చేసుకుని వివరాలన్నింటిని సరిచూసుకోవాలని జేఎన్టీయూ అధికారులు సూచించారు. ఏమైనా తప్పులుంటే 24వ తేదీలోపు మాత్రమే సవరించుకోవచ్చని, ఆ తర్వాత ఎలాంటి అవకాశం ఉండబోదని పేర్కొన్నారు. చివరి నిమిషంలో తమ దృష్టికి తీసుకొస్తే సెంటర్లను కేటాయించడం సాధ్యం కాదని తెలిపారు. పరీక్ష రాసే అవకాశం కోల్పోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఒకరికి బదులుగా మరొకరు పరీక్ష రాయడాన్ని నియంత్రించేందుకు బయోమెట్రిక్‌తోపాటు ముఖ ఆధారిత గుర్తింపు హాజరు విధానాన్ని (ఫేషియల్ రికగ్నిషన్) అమలుచేస్తున్నారు. ఈ నెల 29 నుంచి ఎప్‌సెట్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. 29, 30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీకి మూడు సెషన్లు, మే 2, 3,4 తేదీల్లో ఇంజినీరింగ్ విభాగానికి ఆరు సెషన్లల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఫార్మసీకి 112, ఇంజినీరింగ్‌కు 124 సెంటర్లను ఏర్పాటు చేశారు.

### తగ్గిన ఎప్‌సెట్ దరఖాస్తులు

ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఎప్‌సెట్‌కు ఈ సారి దరఖాస్తులు తగ్గాయి. నిరుటితో పోల్చితే 13వేల దరఖాస్తులు తక్కువగా వచ్చాయి. నిరుడు తెలంగాణ నుంచి 2,93,383 మంది ఎప్‌సెట్‌కు దరఖాస్తు చేయగా, ఈ సారి 2,80,343 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఈ సారి మొత్తం 3,05,774 దరఖాస్తులొచ్చాయి. వీటిలో 25,431 దరఖాస్తులు ఏపీ సహా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చాయి. 505 మంది ఆంగ్లో ఇండియన్స్ కూడా దరఖాస్తు చేసుకున్నారు. ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో మొత్తం సీట్లు మనోళ్లకే రిజర్వుచేశారు. ఇతర రాష్ట్రాల విద్యార్థులకు సీట్లు ఇవ్వబోమని ప్రకటించారు. అయినా తెలంగాణలోనే బీటెక్ చదివేందుకు ఇతర రాష్ట్రాల విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. స్థానికేతరులకు కన్వీనర్ కోటా సీట్లు పొందే అవకాశం లేదు. బీటెక్ మేనేజ్‌మెంట్ కోటా సీట్లకోసం జేఈఈతోపాటు ఎప్‌సెట్ ర్యాంకును పరిగణనలోకి తీసుకుంటున్నారు. టాప్ కాలేజీలు హైదరాబాద్‌లోనే ఉండటం, ఐటీ ప్లేస్‌మెంట్స్, మంచి ప్యాకేజీల నేపథ్యంలో ఏపీ సహా ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు తెలంగాణలో చదివేందుకు, ఎప్‌సెట్‌కు దరఖాస్తు చేసుకున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.

## ప్రైవేట్, డీమ్డ్ వర్సిటీలపై సర్కారు అధిపత్యం

- కొత్తగా హైయ్యర్ ఎడ్యుకేషన్ రిఫార్మ్స్ బిల్లు

హైదరాబాద్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ప్రైవేట్, డీమ్డ్ వర్సిటీలను తమ నియంత్రణలోకి తీసుకునేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నది. ఇందుకోసం కొత్తగా హైయ్యర్ ఎడ్యుకేషన్ రిఫార్మ్స్ బిల్లును సిద్ధం చేసింది. ఈ బిల్లు ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నది. దీనిని అసెంబ్లీలో పెట్టి ఆమోదం పొందాల్సి ఉంటుంది. రాష్ట్రంలో 10 ప్రైవేట్, 4 డీమ్డ్ వర్సిటీలున్నాయి. ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌కు ముందే ప్రైవేట్, డీమ్డ్ వర్సిటీల్లో సీట్లు నిండిపోతుండటంతో ప్రభుత్వం అసంతృప్తిగా ఉన్నది. ప్రైవేట్, డీమ్డ్ వర్సిటీల మంజూరుపై ఉన్నత విద్యామండలి, సర్కారు పలుమార్లు యూజీసీకి లేఖలు రాశాయి. తమను సంప్రదించిన తర్వాతే కొత్తగా ప్రైవేట్, డీమ్డ్ వర్సిటీలను మంజూరు చేయాలని యూజీసీకి రాసిన లేఖల్లో పేర్కొన్నాయి. తాజాగా ప్రభుత్వం బిల్లును తీసుకొస్తున్నది.

ఆంధ్రప్రభ శనివారం 19-4-2025



- 29,30 తేదీల్లో అగ్రి, ఫార్మసీ పరీక్షలు
- 22నుంచి ఇంజనీరింగ్ హాల్‌టిక్కెట్లు
- మే 2 నుంచి 4వరకు పరీక్ష

# నేటినుంచి అందుబాటులోకి ఎప్‌సెట్ హాల్‌టిక్కెట్లు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ బ్యూరో:** తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో హైదరాబాద్ జేఎన్టీయూ నిర్వహిస్తున్న ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే తెలంగాణ ఎప్‌సెట్‌కు సంబంధించి కీలక ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించే అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్ష హాల్‌టికెట్లను శనివారం విడుదల చేయనుంది. ఈ పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు తిరిగి మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు నిర్వహిస్తున్నట్టు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య బాలకిష్టా రెడ్డి తెలిపారు. 29, 30 తేదీల్లో మొత్తం నాలుగు సెషన్లలో జరగనున్న ఈ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. మే రెండో తేదీ నుంచి నాలుగో తేదీ వరకు మొత్తం ఆరు సెషన్లలో జరగనున్న ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షకు సంబందించిన హాల్‌టికెట్లను ఏప్రిల్ 22న ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనున్నామని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి పరీక్ష తేదీ వరకు అడ్మిట్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చుని వెల్లడించింది. అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్ష ఈ నెల 29, 30 తేదీల్లో జరుగనుంది. ఏప్రిల్ 29న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 12 గంటలకు వరకు ఇంజినీరింగ్ పరీక్షను మే 2 నుంచి 4 వరకు నిర్వహిస్తారు. రోజూ రెండు సెషన్లలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 12 గంటలకు వరకు నిర్వహిస్తారు. ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షకు 2,19,420 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు 86,101 మంది. రెండు పరీక్షలకు 253 మంది విద్యార్థులు దరఖాస్తు చేసున్నారని తెలిపారు. వీరికోసం రాష్ట్రవ్యాప్తంగా 16 ప్రాంతాల్లో 124 కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. కాగా హైదరాబాద్‌లో నాలుగు జోన్లలో పరీక్ష నిర్వహిస్తుండగా నల్గొండ, కోదాడ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సత్తుపల్లి, కరీంనగర్, మహబూబ్ నగర్, సంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, నర్సంపేట్‌లలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

నమస్తే తెలంగాణ | హైదరాబాద్, ఆదివారం 20 ఏప్రిల్ 2025

# 'ప్రొఫెషనల్' సీట్ల భర్తీలో వర్గీకరణ

- ఈ సారి మూడు మార్పులతో సీట్ల భర్తీ
- అన్ని సీట్ల భర్తీలోనూ ఎస్సీ ఉప కులాల వర్గీకరణ
- దివ్యాంగుల కోటకు కూడా 5% రిజర్వేషన్
- ఇంజినీరింగ్‌లో ఎస్సీ గ్రూప్ - 2కు 7,839 సీట్లు

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ) : ప్రొఫెషనల్ కోర్సుల సీట్ల భర్తీలో ఎస్సీ ఉప కులాల వర్గీకరణ అమలవుతుందా..? లేదా? అన్న సందిగ్ధతకు తెలంగాణ ఉన్నత విద్యామండలి ఎట్టకేలకు తెరదించింది. 2025-26 విద్యాసంవత్సరం నుంచే వర్గీకరణను అమలుచేస్తామని మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తాజాగా ప్రకటించారు. ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ, బీఈడీ, లా వంటి కోర్సుల్లో వర్గీకరణను అనుసరించే సీట్లను భర్తీచేస్తామని తెలిపారు. ఎస్సీ ఉప కులాల వర్గీకరణ జీవో ఇటీవలే విడుదలైంది. ఇప్పటికే ఎప్‌సెట్ సహా అన్ని ప్రవేశ పరీక్షల నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. ప్రవేశ పరీక్షల నోటిఫికేషన్‌లో కూడా వర్గీకరణ అమలుచేస్తామని బాలకిష్టారెడ్డి తెలిపారు. ప్రవేశ పరీక్షల నోటిఫికేషన్ వేరని, అడ్మిషన్స్‌కు మళ్లీ వేరే నోటిఫికేషన్ ఇస్తామని, అప్పుడు ఉప కులాల వర్గీకరణను నోటిఫికేషన్‌లో పొందుపరిచే అవకాశముందని పేర్కొన్నారు. ప్రొఫెషనల్ కోర్సుల సీట్ల భర్తీలో మూడు మార్పులుంటాయి. ఈ మూడు మార్పుల మేరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఉప కులాల వర్గీకరణతో గ్రూప్ -2లోని కులాలకే ఎక్కువ సీట్లు దక్కుతాయి. వీరికి 9శాతం రిజర్వేషన్ ఉండటంతో ఆ మేరకు సీట్లు దక్కుతాయి. ఇంజినీరింగ్‌లో 87వేలకు పైగా కన్వీనర్ కోటా సీట్లున్నాయి. వీటిలో 15శాతం ఎస్సీలతో భర్తీచేస్తున్నారు. వర్గీకరణలో ఎస్సీలను మూడు గ్రూపులుగా విభజించడంతో గ్రూప్-2కు 7,839 సీట్లు దక్కుతాయి. ఫార్మసీలో 963, ఎంబీఏ, ఎంసీఏలో 3,204 సీట్ల చొప్పున గ్రూపు-2కి దక్కుతాయి.

### ఈ సారి మూడు మార్పులివే

- ఇంజినీరింగ్ సహా ప్రొఫెషనల్ కోర్సుల్లో ఈసారి మూడు మార్పులుంటాయి. మొదటిది ఎస్సీ ఉప కులాల వర్గీకరణ. ఈ కోటాలో మూడు గ్రూపులకు సీట్లను కేటాయిస్తారు. మొదటి గ్రూపునకు 1శాతం, రెండో గ్రూపునకు 9, మూడో గ్రూపునకు 5శాతం రిజర్వేషన్ అమలవుతుంది.
- నూతన విద్యాసంవత్సరం నుంచి ఉన్నత విద్యాసంస్థల్లో దివ్యాంగులకు 5శాతం సీట్లు కేటాయిస్తారు. ఐదు క్యాటగిరీలుగా విభజించి ఐదుశాతం రిజర్వేషన్ వర్తింపజేస్తారు. దృష్టిలోపం - ఏ క్యాటగిరీ, వినికిడిలోపం, మూగ - బీ క్యాటగిరీ, అంగవైకల్యం -సీ క్యాటగిరీ, మానసిక వైకల్యం - డీ, ఒకటికి మించి వైకల్యాలుంటే ఈ-క్యాటగిరీ కింద ఒకశాతం సీట్లను కేటాయిస్తారు.
- రాష్ట్ర విభజన చట్టం ప్రకారం పదేండ్లపాటు విద్యాసంస్థల్లో ప్రవేశాల కోటా గడువు ముగిసింది. గతంలో 85శాతం మనకు, 15శాతం ఏపీ కోటా సీట్లుండగా, కొత్త విద్యాసంవత్సరం నుంచి మొత్తం సీట్లను తెలంగాణ వారితోనే భర్తీచేస్తారు. 95శాతం సీట్లను తెలంగాణ వారికి కేటాయించగా, 5శాతం సీట్లను ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి 10 ఏండ్లపాటు నివాసమున్న వారి పిల్లలు, స్థానికులైన వారి భార్యలు, భర్తలకు కేటాయించారు.

### ఎస్సీ గ్రూపులవారీగా కన్వీనర్ కోటా సీట్లు

| కోర్సు | గ్రూప్ -1 | గ్రూప్ -2 | గ్రూప్ -3 | మొత్తం |
|---|---|---|---|---|
| ఇంజినీరింగ్ | 871 | 7,839 | 4,355 | 87,184 |
| ఫార్మసీ | 107 | 963 | 535 | 10.693 |
| ఎంబీఏ, ఎంసీఏ | 356 | 3,204 | 1,780 | 35,589 |

## అగ్రికల్చర్, ఫార్మసీ హాల్‌టికెట్లు విడుదల

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ) : ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. హాల్‌టికెట్లను జేఎన్టీయూ అధికారులు శనివారం వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. విద్యార్థులు https://eapcet.tgche. ac. in వెబ్‌సైట్‌ను సంప్రదించి డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎప్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ డీన్ కుమార్, కో కన్వీనర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. 22న ఇంజినీరింగ్ విభాగం హాల్‌టికెట్లను విడుదల చేస్తారు.

మన తెలంగాణ
ఆదివారం 20, ఏప్రిల్ 2025

# తెలుగు వర్సిటీ పేరు మార్పుతూ గెజిట్

## సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంగా మార్పు

**మనతెలంగాణ/హైదరాబాద్ :** పొట్టి శ్రీరాము లు తెలుగు విశ్వవిద్యాల యాన్ని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంగా మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్పును రాష్ట్ర శాసనసభ, శాసనమండలి ఆమోదించిన విష యం తెలి సిందే. కాగా, తాజాగా పేరును మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడు దల చేసిన నేపథ్యంలో సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంగా పరిగణలోకి వచ్చింది. తెలంగాణ అస్తిత్వ ప్రకటనలో భాగంగా, తెలంగాణ భాషా సాహిత్య సంస్కృతుల పరిరక్షణకు, పరిపోషణకు విశేష కృషి చేసిన సురవరం ప్రతాపరెడ్డి పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి సిఎం రేవంత్‌రెడ్డి పెట్టడం ఎంతో సముచితంగానూ, స్ఫూర్తిదాయకంగాను ఉందని తెలుగు విశ్వవిద్యాలయం బోధన బోధనేతర సిబ్బంది విద్యార్థుల పక్షాన ఉపాధ్య క్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమం తరావు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

వార్త, హైదరాబాద్, సోమవారం 21, ఏప్రిల్ 2025

# విద్యార్థి మొబైల్‌కి ఎప్‌సెట్ ఫలితాలు!

## జెఎన్‌టియు వినూత్న ప్రయోగం

**హైదరాబాద్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం గత ఏడాది వరకు ఎంసెట్‌గా కొనసాగించి.. ఈ ఏడాది నుంచి ఎప్(ఈఏపి) సెట్‌గా మారిన ఎప్ సెట్ ఫలితాల కోసం విద్యార్థులు టెన్షన్ పడాల్సిన పనిలేదు. ఇకపై విద్యార్థుల మొబైల్ నంబర్లకే వారి ఎప్ సెట్ ఫలితాలను పంపించేలా జెఎన్‌టియూ చర్యలు తీసుకుంటోంది. ఇందుకు సంబంధించి ఈ ఏడాది ఎప్‌సెట్-2025 ఫలితాలను విద్యార్థులు దరఖాస్తు సమయంలో సమర్పించిన రిజిస్టర్

>>2

# విద్యార్థి మొబైల్‌కి ఎప్‌సెట్ ఫలితాలు!

>> మొబైల్ నంబర్లకే వారి ఫలితాలను పంపించాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఎప్ సెట్ ఫలితాలను విద్యార్థుల మొబైల్ నంబర్లకు పంపించడానికి సంబంధించి ఎటువంటి టెక్నికల్ సమస్యలు రాకుండా యూనివర్సిటీ దృష్టి పెట్టినట్టు తెలిసింది. ఇప్పటి వరకు ఎంసెట్ రిజల్ట్స్ విద్యార్థులు వారి ఫలితాలను చూసుకోవాలంటే సర్వర్ సమస్యలు వస్తుండేవి.. వెబ్‌సైట్‌లో సమస్యలు ఉండేవి. దీంతో విద్యార్థులు తమ ఫలితాలను చూసుకోవడానికి కొంత టెన్షన్ పడేవారు. తమకు ఎంత ర్యాంక్ వచ్చిందో అనే టెన్షన్‌తో సర్వర్ సెట్ అయ్యే వరకు, వెబ్‌సైట్‌లో తమ నంబర్ కనిపించి ర్యాంక్ తెలిసే వరకు ఆందోళన పడేవారు. ఈ ఏడాది నుంచి విద్యార్థులకు అటువంటి టెన్షన్, ఆందోళన లేకుండా నేరుగా విద్యార్థి మొబైల్ నంబర్‌కే వారి ఫలితాలను పంపించడానికి జెఎన్‌టియూ చర్యలు తీసుకుంటోంది. ఇలా విద్యార్థుల ఫలితాలు వారి రిజిస్టర్ మొబైల్ నంబర్లకు పంపిస్తే.. రిజల్ట్స్ అనౌన్స్ చేసిన కొద్ది సెక్లన్లలో వారికి తమ ఫలితాలు తెలిసిపోతాయి. దీంతో విద్యార్థులు తమ ఫలితాల కోసం ఎక్కడికో నెట్ సెంటర్‌కో లేకపోతే ల్యాప్‌టాప్, కంప్యూటర్లలోనూ చూసుకోవల్సిన అవసరం లేకుండా పోతుంది. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు అయితే వీటి కోసం ప్రత్యేకంగా మండల కేంద్రాలకు, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా.. నేరుగా తమ ఫలితాలను వారి మొబైల్‌లోనే చూసుకునేలా జెన్‌టియూ చర్యలు తీసుకుంటోంది. యూనివర్సిటీ నుండి వచ్చే మెసేజ్‌లో అభ్యర్థులకి సంబంధించిన ర్యాంక్, సబ్జెక్టుల వారీగా మార్కులతోపాటు ఇతర పూర్తి వివరాలు ఉండనున్నాయి. ఎప్‌సెట్-2025కి సంబంధించి ఇప్పటి వరకు 3,05,790 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 2.19 లక్షల మంది ఇంజనీరింగ్‌కి, 86వేలకిపైగా అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

వారిలో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలను ఈ నెల 29, 30తేదిల్లో నిర్వహించనున్నారు. వారి హాల్ టికెట్లను ఇప్పటికే అందుబాటులో పెట్టారు. మే 2 నుంచి 4 వరకు జరిగే ఇంజనీరింగ్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను ఈ నెల 22 నుంచి అందుబాటులోకి తీసుకురానున్నారు. అయితే ఈసారి హాల్ టికెట్లపై అభ్యర్థులు తమ కేంద్రాలను నావిగేట్ చేయడానికి సహాయపడే క్విక్ రెస్పాన్స్(క్యూఆర్) కోడ్ ఉంటుంది. స్మార్ట్‌ఫోన్‌తో కోడ్‌ను స్కాన్ చేస్తే.. గూగుల్ మ్యాప్స్ అప్లికేషన్‌లో ఒక లింక్ ఓపెన్ అవుతుంది.. అది విద్యార్థులు తమ పరీక్షా కేంద్రాలకు వారి రూట్ మ్యాప్‌ను వీక్షించడానికి వీలు కల్పిస్తుంది. ట్రాఫిక్‌ను పరిగణనలోకి తీసుకుని వారు కేంద్రానికి ఎంత దూరం ఉంది.. పరీక్ష కేంద్రానికి చేరుకోవడానికి ఎంత సమయం పడుతుందనేది కూడా నిర్ధారించవచ్చు. ఈ ఏడాది నుంచే హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేయగా.. అదే పద్ధతిలో ఎప్ సెట్ ఫలితాలను సైతం విద్యార్థి మొబైల్‌కే పంపించడానికి జెఎన్‌టియూ చర్యలు తీసుకుంటోంది.

సోమవారం । 21 । ఏప్రిల్ । 2025
హైదరాబాద్ । www.sakshi.com

# డిగ్రీ కాలేజీల ఎదురీత..




## గ్రామీణ ప్రాంతాల్లో మూసివేత దిశగా అడుగులు

**హైదరాబాద్ పరిసరాల్లోనే మనుగడ.. ఏటా సగం కూడా నిండని సీట్లు**

**పేరుకుపోతున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు**

**సిలబస్ మార్పుతో నిర్వహణ కష్టమనే ఆందోళన**

సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్య విషయంలో విద్యార్థుల ఎంపికల్లో మార్పుల కారణంగా రాష్ట్రంలోని ప్రైవేటు డిగ్రీ కాలేజీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. సాధారణ డిగ్రీ చదివేందుకు విద్యార్థులు ఆసక్తి చూపకపోవటంతో చాలా కాలేజీల్లో ఒక్క అడ్మిషన్ కూడా నమోదు కావటంలేదు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని కాలేజీల్లోనే 40 శాతం సీట్లు నిండితే గొప్ప అన్నట్లుగా పరిస్థితి ఉంది. మిగతా జిల్లాల్లో అంతకంటే చాలా తక్కువగా ఉంటున్నాయి. వందకుపైగా కాలేజీల్లో జీరో అడ్మిషన్లు నమోదవుతున్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో యాజమాన్యాలు కాలేజీల మూసివేత దిశగా అడుగులేస్తున్నాయి. అడ్మిషన్లు తగ్గటం ఒక సమస్య అయితే.. రూ.5 వేల కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉండటం కాలేజీలను మరింత కుంగదీస్తోంది. సిబ్బందికి వేతనాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ప్రభుత్వం ఉన్నత విద్యలో సంస్కరణల వైపు అడుగులేయటం గ్రామీణ ప్రాంత డిగ్రీ కాలేజీలను మరింత సంక్షోభంలోకి నెట్టివేస్తోంది.

### అఫిలియేషన్‌కూ వెనకడుగు

రాష్ట్రంలో 1,054 డిగ్రీ కాలేజీలున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో 362 ఉండగా, మిగతా జిల్లాల్లో 692 ఉన్నాయి. గత ఏడాది 150 కాలేజీలు కొన్ని కోర్సుల్లో, సెక్షన్లలో అఫిలియేషన్ తీసుకునేందుకు వెనుకాడాయి. ఈసారి కూడా పరిస్థితి అలాగే ఉందని నిర్వాహకులు అంటున్నారు. అన్ని కాలేజీల్లో కలిపి 4.60 లక్షల డిగ్రీ సీట్లున్నాయి. ఇందులో ఏటా సగటున 2.20 లక్షల సీట్లే భర్తీ అవుతున్నాయి. దోస్త్ పరిధిలోని కాలేజీల్లో 3,85,573 సీట్లు ఉండగా, గతేడాది 2,12,188 సీట్లు భర్తీ అయ్యాయి. ఇంటర్

మిగతా 3వ పేజీలో ▶

# డిగ్రీ కాలేజీల ఎదురీత..

▶ మొదటి పేజీ తరువాయి

ఉత్తీర్ణులంతా డిగ్రీలో చేరినా ఇంకా 70 వేల సీట్లు మిగిలిపోయే పరిస్థితి ఉంది. దీంతో విద్యార్థులను ఆకర్షించటంలో తీవ్ర పోటీ నెలకొంది. ఈ పోటీని గ్రామీణ ప్రాంత కాలేజీలు తట్టుకోలేకపోతున్నాయి. తమ ఇళ్లకు సమీపంలోని కాలేజీల్లోనే చదవాలనుకునే విద్యార్థులు ఆర్ట్స్ గ్రూపులు మాత్రమే తీసుకుంటున్నారు. దీంతో సైన్స్ గ్రూపుల్లో చేరికలు నామమాత్రంగా ఉంటున్నాయి. గత మూడేళ్లలో గ్రామీణ ప్రాంత కాలేజీల్లో చేరికలు 42 శాతం తగ్గిపోయాయి. ముఖ్యంగా సైన్స్ గ్రూపుల్లో ఈ పరిస్థితి ఉంది.

### కొత్త కోర్సులతో చిక్కులు

హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని కాలేజీల్లో కొత్త కోర్సులు ప్రవేశ పెడుతున్నారు. డేటాసైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఏఐఎంఎల్ వంటి కోర్సులు తీసుకొస్తున్నారు. కామర్స్‌లోనూ కంప్యూటర్ కోర్సుల కాంబినేషన్ వస్తోంది. రాజధానికి సమీపంలో ఉండటం వల్ల ఈ కోర్సుల బోధకులు దొరకుతున్నారు. విద్యార్థులు కూడా రాజధానిలో ఉంటే ఇతర కోర్సులు నేర్చుకోవచ్చని, పార్ట్‌టైం ఉద్యోగాలు దొరుకుతాయని ఇటువైపు ఆసక్తి చూపుతున్నారు. గ్రామీణ కాలేజీల్లో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. కంప్యూటర్ కోర్సులకు లెక్చరర్‌ను తీసుకోవాలంటే నెలకు కనీసం రూ.50 వేల వేతనం ఇవ్వాలి. ప్రయోగశాలలు ఏర్పాటు చేయాలి. ఇదంతా చేస్తే ఫీజులు పెంచాలి. ఫీజులు పెంచితే విద్యార్థులు చేరే పరిస్థితి లేదు. ఈ కారణంగా కొత్త కోర్సుల జోలికి వెళ్లడం లేదు. ప్రభుత్వం ఈ ఏడాది నుంచి సిలబస్ మార్చాలని నిర్ణయించింది. 20 శాతం కంప్యూటర్ అనుసంధానిత సిలబస్ తీసుకొస్తున్నారు. ఇవన్నీ గ్రామీణ ప్రాంత కాలేజీల మనుగడకు ప్రమాదంగా మారే పరిస్థితి కన్పిస్తోంది. దీంతో కొన్ని కాలేజీలు మూతబడే ప్రమాదం కనిపిస్తోంది.

ప్రభాత వెలుగు
సోమవారం | హైదరాబాద్
21.04.2025
www.v6velugu.com

# బీటెక్‌లో ఫీజుల బాంబు!

## వచ్చే ఏడాది 20 నుంచి 50 శాతం దాకా పెరిగే చాన్స్

- ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల హియరింగ్ పూర్తి చేసిన టీఏఎఫ్ఆర్సీ
- భారీగా ఫీజులు పెంచాలని బడా కాలేజీల ప్రపోజల్స్
- పెంపునకు హియరింగ్‌లోనే పలు కాలేజీలకు కమిటీ హామీ
- త్వరలో టీఏఎఫ్ఆర్సీ మీటింగ్.. ఆ తర్వాత సర్కార్‌కు ప్రతిపాదనలు
- ఆందోళనలో పేరెంట్స్, స్టూడెంట్లు

**హైదరాబాద్, వెలుగు:** త్వరలోనే ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజుల బాంబు పేలనున్నది. వచ్చే ఏడాది బీటెక్ కోర్సుల్లో ఏకంగా 20 నుంచి 50 శాతం దాకా ఫీజులు పెరిగే అవకాశం ఉన్నది. పలు కాలేజీల్లో ఫీజులు ఏకంగా రూ.2 లక్షలు దాటనున్నట్టు తెలుస్తున్నది. వచ్చే మూడేండ్లకు గాను ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజులు నిర్ణయించేందుకు తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) కసరత్తు చేస్తున్నది. చివరిసారిగా 2022లో ఫీజులను నిర్ణయించగా, ఆ గడువు ఈ విద్యాసంవత్సరంతో ముగియనున్నది. దీంతో వచ్చే విద్యాసంవత్సరం (2025-26) నుంచి కొత్త ఫీజులు అమల్లోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 163 ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల మేనేజ్మెంట్ల హియరింగ్ ప్రక్రియను టీఏఎఫ్ఆర్సీ పూర్తి చేసింది. ఆయా కాలేజీలకు సంబంధించి 2022-23, 2023-24 సంవత్సరాల ఫైనాన్షియల్ ఆడిట్ రిపోర్టులు, అడ్మిషన్ల వివరాలను సేకరించింది. అదే సమయంలో ఎంత మేర ఫీజు పెంచాలని కోరుతున్నారనే ప్రతిపాదనలనూ స్వీకరించింది. అయితే హియరింగ్ టైమ్‌లోనే కొన్ని కాలేజీలకు ఫీజుల పెంపుపై కమిటీ హామీ ఇచ్చినట్టు తెలుస్తున్నది.

మిగతా 2లో



నమస్తే తెలంగాణ

హైదరాబాద్ సోమవారం 21 ఏప్రిల్ 2025



## సెల్‌ఫోన్‌కే ఎప్‌సెట్ ఫలితాలు

### రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు ఫలితాలు పంపించేలా ఏర్పాటు

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): టీజీ ఎప్‌సెట్ ఫలితాలను విద్యార్థులు దరఖాస్తు సమయంలో రిజిస్టర్డ్ చేసుకున్న సెల్‌ఫోన్ నంబర్‌కే పంపించేలా జేఎన్టీయూ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ వంటి కోర్సుల్లో సీట్ల భర్తీకి నిర్వహించే టీజీ ఎప్‌సెట్ పరీక్షలు ఈనెల 29 నుంచి మే నెల 4 వరకు జరగనున్నాయి. ఈసారి 3.05లక్షల మంది విద్యార్థులు ఎప్‌సెట్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షలు ముగిసిన తర్వాత 10రోజుల్లో ఫలితాలు విడుదల చేయాలని అధికారులు భావిస్తున్నారు. కాగా, ఇప్పటి వరకు ఫలితాలను వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నారు. ఈసారి విద్యార్థుల సెల్‌ఫోన్ నంబర్‌కే పంపించాలని నిర్ణయించారు. దీంతో అభ్యర్థులకు వెబ్‌సైట్‌లో వెతకాల్సిన తిప్పలు తప్పుతాయి.




# పరేషాన్‌లో పరిశోధన!

- ప్రైవేటు చేతుల్లోకి పరిశోధన బాధ్యతలు
- ప్రత్యామ్నాయంపై వర్సిటీల అన్వేషణ
- ప్రైవేటు కళాశాలల ప్రొఫెసర్లకు ఎర
- ఐఐటీ, 'సెంట్రల్' ప్రొఫెసర్ల గైడెన్స్
- ఏటా 2 సార్లు పీహెచ్‌డీ నోటిఫికేషన్లు
- కొత్తపంథాకు జేఎన్‌టీయూ శ్రీకారం
- ప్రమాదమని సీనియర్ ప్రొఫెసర్ల హెచ్చరిక

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని యూనివర్సిటీలలో ప్రొఫెసర్ల కొరత పరిశోధన విద్యపై ప్రభావం చూపుతున్నది. తగినంత మంది ప్రొఫెసర్లు లేక పరిశోధనలకు గైడెన్స్ కరువైంది. ఫలితంగా అసలు పరిశోధనలే మూలనపడ్డాయి. ఇప్పుడు ఇదే సాకుతో ఉస్మానియా, జేఎన్‌టీయూ వంటి కొన్ని యూనివర్సిటీలు ప్రైవేటు పరిశోధనలపై మొగ్గు చూపుతున్నాయి. పరిశోధనల కోసం ప్రైవేటు కాలేజీలలో ఐఐటీ, ఎన్‌ఐటీలలో పీహెచ్‌డీలు పూర్తి చేసి, ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న వారితో గైడెన్స్ పొందాలని చూస్తున్నాయి. ఈ మేరకు సర్కారీ వర్సిటీల పరిశోధన బాధ్యతలు ప్రైవేటు కాలేజీ ప్రొఫెసర్ల చేతుల్లో పెట్టబోతున్నారు. ఈ మేరకు ప్రైవేటు అఫిలియేషన్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రొఫెసర్లతో జేఎన్‌టీయూ అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు.

దీంతో భవిష్యత్తులో ప్రమాదం నెలకొనే అవకాశం ఉన్నదని సీనియర్ ప్రొఫెసర్లు హెచ్చరిస్తున్నారు. జేఎన్‌టీయూ సహా కొన్ని వర్సిటీలు తమ విద్యార్థుల పరిశోధన బాధ్యతలను ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల ప్రొఫెసర్ల చేతుల్లో పెట్టాలని భావిస్తున్నాయి. ఇప్పటికే ప్రైవేటు అఫిలియేషన్ కాలేజీలు, ప్రైవేటు వర్సిటీలతో ప్రభుత్వ యూనివర్సిటీలు విలవిల్లాడుతున్నాయి. ఇలాంటి స్థితిలో యూనివర్సిటీల్లో జరగాల్సిన పరిశోధనలు కూడా ప్రైవేటుబాట పడితే ఎలా అన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ విషయంలో జేఎన్‌టీయూ ఒక అడుగు ముందుకేసి కొత్త పంథాను అవలంబిస్తున్నది. ప్రైవేటు అఫిలియేషన్ ఇంజినీరింగ్ కాలేజీల ప్రొఫెసర్లతో సంప్రదింపులకు ఇప్పటికే శ్రీకారం చుట్టింది.

## ప్రైవేటు కాలేజీ ప్రొఫెసర్ల ఎంగేజ్

ప్రొఫెసర్ పోస్టులు ఇప్పట్లో భర్తీకావని భావించిన జేఎన్‌టీయూ.. పరిశోధన విద్యపై ముందుకే సాగాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తున్నది. ఆ వర్సిటీలో పరిశోధన విద్యార్థులకు అనుగుణంగా, గైడెన్స్ ఇచ్చే సీనియర్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు తగ్గిపోయారు. దీని కోసం ప్రైవేటు అఫిలియేషన్ ఇంజినీరింగ్ కాలేజీలపై ఆధారపడుతున్నారు. ఐఐటీ, ఎన్‌ఐటీ, సెంట్రల్ యూనివర్సిటీలలో పీహెచ్‌డీలు పూర్తిచేసి, ప్రస్తుతం ప్రైవేటు అఫిలియేషన్ ఇంజినీరింగ్ కాలేజీలలో ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న వారి సహాయం పొందబోతున్నారు. వారిచ్చే అంగీకారం ప్రకారం జేఎన్‌టీయూలో పీహెచ్‌డీ సీట్లను పెంచుకోవాలని ఆ యూనివర్సిటీ యాజమాన్యం భావించిందని ఆ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఏర్పడే ఖాళీల ఆధారంగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి విడుదలయ్యే పీహెచ్‌డీ నోటిఫికేషన్‌లో కనీసం 150 సీట్లకు తగ్గకుండా నోటిఫికేషన్ విడుదల చేయాలన్న ఆలోచనలో తామున్నామని డాక్టర్ వెంకటేశ్వర్లు వెల్లడించారు.

## 2,060కి పైగా పోస్టులు ఖాళీ

"రాష్ట్రంలో 12 వర్సిటీలలో 2,060కి పైగా ప్రొఫెసర్లతోపాటు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొన్ని వర్సిటీలలో అసలు ప్రొఫెసర్లే లేకపోవడం గమనార్హం. వర్సిటీలలో ప్రొఫెసర్ల కొరత చాలా తీవ్రంగా ఉన్నదని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తెలిపారు. కొన్ని వర్సిటీలు పరిశోధన విద్యార్థుల కోసం ప్రైవేటు కాలేజీల ప్రొఫెసర్లను ఆశ్రయిస్తున్నాయని, సొంత వర్సిటీలలో మానవ వనరులను పెంచుకోవడమే ఉత్తమమని పేర్కొన్నారు. ప్రైవేటు కాలేజీలపై ఆధారపడితే మున్ముందు చెడు ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు.

మన తెలంగాణ
మంగళవారం 22, ఏప్రిల్ 2025

# నేడు ఇఎపిసెట్ ఇంజనీరింగ్ హాల్ టికెట్లు విడుదల

మనతెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టిజి ఇఎపిసెట్ ఇంజనీరింగ్ హాల్ టికెట్లు మంగళవారం విడుదల కానున్నాయి. ఈ మేరకు అధికారులు టిజి ఎప్‌సెట్ వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు అందుబాటులో ఉంచనున్నారు. ఇప్పటికే అగ్రికల్చర్, ఫార్మా హాల్ టికెట్లు విడుదలైన విషయం తెలిసిందే. ఈ నెల 29 నుంచి మే 4 వరకు ఎప్‌సెట్ పరీక్షలు పరీక్షలు జరుగనున్నాయి. ఈ నెల 29, 30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మా ప్రవేశ, మే 2 నుంచి 4 వరకు ఇంజనీరింగ్ పరీక్షలు జరుగనున్నాయి. రోజూ రెండు సెషన్లలో ఈ పరీక్షలు జరుగుతాయి. ఈ సంవత్సరం హాల్ టికెట్లు గూగుల్ మ్యాప్స్‌కి లింక్ చేయబడిన క్యూఆర్ కోడ్ ముద్రించారు. విద్యార్థులు తమ పరీక్షా కేంద్రాలను సులభంగా గుర్తించడానికి, నావిగేట్ చేయడానికి ఇది ఎంతో సహాయపడుతుంది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన తర్వాత పరీక్ష కేంద్రం [illegible]లో ఉందో తెలుసుకోవచ్చు.

నమస్తే తెలంగాణ హైదరాబాద్, మంగళవారం 22 ఏప్రిల్ 2025

# డిగ్రీలో మళ్లీ 'బకెట్' విధానం

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ) : డిగ్రీ కోర్సుల్లో 'బకెట్' విధానాన్ని మళ్లీ పునరుద్ధరించాలని సర్కారు నిర్ణయించింది. ఇటీవలే బకెట్ సిస్టంను రద్దుచేయాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించగా, ఈ ప్రతిపాదనలను సర్కారు తిరస్కరించింది. డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ 'దోస్త్'నోటిఫికేషన్ విడుదలపై విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా సోమవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కళాశాల విద్య కమిషనర్ శ్రీదేవసేన, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్లు ఎస్కే మహమూద్, ఇటికాల పురుషోత్తం, ఆరు వర్సిటీల వీసీలు హాజరయ్యారు. బకెట్ సిస్టం అంశంపై సోమవారం జరిగిన సమావేశంలో చర్చ జరిగింది. అకాడమిక్ మధ్యలో నిర్ణయాలు తీసుకుంటే గందరగోళానికి దారితీస్తుందని అధికారులు హెచ్చరించినట్టు తెలిసింది. లోపాలుంటే సమీక్షించి సరిదిద్దాలి లేదా ఓ కమిటీ వేసి అభిప్రాయాలు తీసుకోవాలే తప్ప ఇలా ఏకపక్షంగా రద్దు నిర్ణయం ప్రకటిస్తే ఎలా..? అంటూ ప్రశ్నించినట్టు తెలిసింది. ఈ విద్యాసంవత్సరంలో బకెట్ విధానాన్ని కొనసాగించాలని ఆదేశాలు ఇచ్చారు. ఎస్సీ ఉప కులాల వర్గీకరణను అమలుచేయాలని, కొన్ని సబ్జెక్టుల పేర్లు మార్చాలని సమావేశంలో ఏకాభిప్రాయానికి వచ్చినట్టు అధికారులు తెలిపారు.

ఆంధ్రప్రభ మంగళవారం 22-4-2025

# ఇక ఎస్ఎంఎస్‌లో ఈఏపీ సెట్ ఫలితాలు

**● ఈ ఏడాది నుంచే అమల్లోకి ● ఆన్‌లైన్ ఫలితాల ప్రకటనలో ఇబ్బందులను గుర్తించిన జేఎన్టీయూ ● విద్యార్థి మొబైల్ ఫోన్లకే ర్యాంకుల వివరాలు**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** టీజీ ఈఏపీ సెట్ ఫలితాల ప్రకటనకు సంబంధించి హైదరాబాద్ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్టీయూ) కీలక ప్రకటన చేసింది. ఈ సంవత్సరం టీజీ ఈఏపీ సెట్ ఫలితాలను అభ్యర్థుల మొబైల్ నంబర్లకు నేరుగా పంపనున్నట్లు ప్రకటించింది. ఇప్పటివరకు, విద్యార్థులు తమ ఫలితాలను విశ్వవిద్యాలయంలోని వెబ్‌సైట్‌లో చూసుకునే వారు. అయితే ఫలితాలను వీక్షించే సమయంలో సర్వర్లు మొరాయిస్తుండటం, సాంకేతిక లోపాలు తలెత్తుండడంతో విద్యార్థులు తీవ్ర మానసిక క్షోభకు, ఇబ్బందులకు గురయ్యేవారు. ఈ ఇబ్బందులను గుర్తించిన జేఎన్టీయూ యూనివర్సిటీ వాటిని అధిగమించేందుకు ఇక నుంచి సంక్షిప్త సమాచారం (ఎస్ఎంఎస్) రూపంలో ఫలితాలను ప్రకటించనున్నట్టు తెలిపింది. ఫలితాల మార్కులను అందుబాటులో ఉంచుతామని, అవసరమైన విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని జేఎన్టీయూ అధికారులు తెలిపారు. వ్యవసాయ, ఫార్మసీ విభాగాల్లో ప్రవేశాలకు సంబంధించిన ప్రవేశ పరీక్ష హాల్‌టిక్కెట్లను విడుదల చేసింది. ఇంజనీరింగ్ విభాగం హాల్‌టిక్కెట్లు మంగళవారం నుంచి అందుబాటులో ఉంటాయని జేఎన్టీయూ అధికారులు సూచించారు.

WEDNESDAY 23 APRIL 2025 | THE HANS INDIA | HYDERABAD

# Be nationally rooted and globally competitive: TGCHE Chairman

## MIT-WPU PUNE STUDENTS INTERACT WITH PROF V BALAISTA REDDY ON TUESDAY

HANS NEWS SERVICE
HYDERABAD



A group of 100 law students from MIT World Peace University (MIT-WPU), Pune interacted with the Telangana Council of Higher Education (TGCHE) Chairman Professor V Balaista Reddy on Tuesday.

The event was also attended by distinguished guests including Umapathi, IPS (Retd), Distinguished Fellow at CHSS; Dr Ramesh K, Founder and Director of CHSS; S Sarangapani, Assistant Commissioner of Police (ACP); along with faculty members Professor Ayush Mishra, Professor Vikas, Professor Anamika, and Professor Vaishnavi from the MIT-WPU School of Law.

During the interaction, the Chairman spoke about the evolving landscape of legal education and the legal profession in the 21st century.

He emphasised that the legal field is rapidly expanding beyond traditional areas, with new opportunities arising in specialised fields such as deep seabed mining, outer space law, and other transnational legal frameworks. These areas are becoming increasingly important due to the shift of industries from the public to the private sector, leading to a heightened demand for legal professionals with global competencies.

Professor Reddy highlighted how globalisation, liberalisation, and privatisation have reshaped the legal profession. As the world becomes more interconnected, legal practitioners in India face competition on a global scale.

This transformation necessitates urgent reforms in legal education to prepare students for contemporary challenges and equip them with the knowledge and skills required to thrive in a dynamic, globalised legal environment.

He pointed out that today's transnational governance structures have significantly altered traditional notions of national and international jurisdiction, providing law students with ample opportunities to explore emerging areas of legal practice. The students actively engaged in the discussion, posing insightful questions about career opportunities in the legal sector, areas of specialisation, and the future trajectory of the profession.

The Chairman encouraged them to pursue continuous learning and adaptability, urging them to become not only competent legal professionals but also contributors to societal progress. The interaction served as a platform for exchanging ideas. He underscored the importance of preparing future lawyers to be nationally rooted and globally competent.

నవతెలంగాణ బుధవారం 23 ఏప్రిల్ 2025

# 'దోస్త్' అడ్మిషన్లకు త్వరలో నోటిఫికేషన్

- పరిస్థితులకు అనుగుణంగా కొత్త కోర్సులు : ఉన్నత విద్యామండలి చైర్మెన్ బాలకిష్టారెడ్డి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థుల కోసం త్వరలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి 'దోస్త్' ద్వారా డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పించనుంది. ఈమేరకు ఉన్నతవిద్యామండలి చైర్మెన్ వి. బాలకిష్టారెడ్డి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీనియర్ ఇంటర్‌లో పాసైన విద్యార్థులను చైర్మెన్ అభినందించారు. అలాగే తెలంగాణలోని ఆయా విశ్వవిద్యాలయాల్లో ఉన్న డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రస్తుత పరిస్థితులు, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా కోర్సులను అందుబాటులోకి తెస్తున్నట్టు చెప్పారు. తాజాగా కృత్రిమ మేధస్సు(ఏఐ), డేటా(పీబీఎల్)తదితర అంశాలను కొత్తగా కోర్సుల రూపంలో విద్యార్థులకు చేరువ చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిలిచేందుకు అవసరమైన మేరకు సిలబస్‌లో మార్పులు, చేర్పులు చేస్తున్నట్టు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రతిభా పాటవాలకు కేంద్రంగా తీర్చిదిద్దడమే ఉన్నత విద్యామండలి లక్ష్యమని అభిప్రాయపడ్డారు. ఈనేపథ్యంలో దోస్త్ నోటిఫికేషన్‌ను త్వరలో విడుదల చేయనున్నట్టు తెలిపారు.

సాక్షి
గురువారం
24-4-2025

# తీర్పునకు లోబడే 'డీమ్డ్' హోదా

- రాష్ట్ర ప్రభుత్వానికి, యూజీసీకి హైకోర్టు స్పష్టీకరణ.. తదుపరి విచారణ జూలై 30కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: ఇకపై ఏ విద్యాసంస్థకు డీమ్డ్ హోదా ఇచ్చినా అది తాము ఇచ్చే తీర్పునకు లోబడే ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రభుత్వం దాఖలు చేసిన మధ్యంతర అప్లికేషన్‌పై విచారణ చేపట్టి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయాన్ని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)కూ, విద్యాసంస్థలకు తెలియ జేయాలని ఆదేశించింది. 2010, 2016, 2019లో యూజీసీ జారీ చేసిన నిబంధనలను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అలాగే, యూజీసీ నిబంధనలపై స్టే ఇవ్వాలంటూ మధ్యంతర అప్లికేషన్ (ఐఏ) దాఖలు చేసింది. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుకా యారా ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది.

**రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోకే విద్య: ఏజీ**

రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఏ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. రాజ్యాంగంలోని ఏడో షెడ్యూల్‌లోని ఎంట్రీ 32, జాబితా 2 ప్రకారం 'విద్య' అనే అంశం రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోకి వస్తుందన్నారు. 'డీమ్డ్' శ్వవిద్యాలయం స్థాపన కోసమని అభ్యంతరకరమైన నిబంధనలను జారీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి ఎటువంటి అధికారం లేదని చెప్పారు. రాష్ట్రం పాత్ర లేకుండా ఇష్టారాజ్యంగా హోదా ఇస్తున్నారన్నారు. చిన్న దుకాణాల్లో నడుస్తున్న కొన్ని కళాశాలలు కూడా డీమ్డ్ ట్యాగ్ కోసం పోటీ పడుతున్నాయని వివరించారు. ఇకపై ఏ సంస్థకూ డీమ్డ్ విశ్వవిద్యాలయం హోదా ఇవ్వకుండా యూజీసీని నిరోధించాలని విజ్ఞప్తి చేశారు. ఏజీ వాదనలను అరోరా ఉన్నత విద్య, పరిశోధన అకాడమీ, చైతన్య, మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్, కేఎల్ విశ్వవిద్యాలయం, సింబయాసిస్ ఇంటర్నేషనల్, విజ్ఞాన్ ఫౌండేషన్ ఫర్ సైన్స్, టెక్నాలజీ అండ్ రిసెర్చ్ సంస్థల న్యాయవాదులు వ్యతిరేకించారు. యూజీసీ నిబంధనలపై స్టే ఇవ్వొద్దని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. యూజీసీ నిబంధనలను నిలిపివేయడానికి నిరాకరించింది. తుది తదుపరి విచారణను జూలై 30కి వాయిదా వేసింది.

# AICTE officials meet TGHE to expand regional innovation ecosystem

**The Ministry of Education, Govt of India, has established an 'Innovation Cell' to foster a culture of innovation in all higher education institutions across the country**

HANS NEWS SERVICE
HYDERABAD



SENIOR officials from the Union Ministry of Education and All India Council for Technical Education on Wednesday met Telangana State Council of Higher Education (TGHE) Chairman Professor V Balakrishna Reddy and discussed creating a regional ecosystem for innovation and incubation in higher education institutions across the State.

Dr Yogesh Brahmankar, Director of Innovation at the Ministry of Education's Innovation Cell, and Dr Bheema L Reddy, Manager of Intellectual Property and Technology Transfer at the AICTE Innovation Center in Hyderabad, met with Professor V Balakista Reddy.

Dr Yogesh sought Professor Reddy's support in registering colleges on their portal for fellowships related to innovation projects. He briefed Professor Reddy about the different fellowships and scholarships available for both faculty and students. The Ministry of Education, Government of India, has established an 'Innovation Cell' to systematically foster a culture of innovation in all higher education institutions (HEIs) across the country. It serves as the world's largest open innovation and incubation platform, aiming to contribute effectively to India's innovation landscape by building a sustainable ecosystem for innovation and entrepreneurship in the education sector.

The AICTE Innovation Center is an initiative by the All India Council for Technical Education (AICTE) that aims to establish and operate centres across India focused on researching and developing projects based on Indian Knowledge Systems (IKS).

It may be mentioned here that the Ministry of Education's Innovation Cell (MIC) and AICTE have been actively promoting a culture of innovation and entrepreneurship within HEIs through various initiatives. The AICTE Innovation Center is a pioneering program designed to encourage innovation, entrepreneurship, and collaboration between industry and academia within the education sector.

This initiative aims to create a supportive ecosystem that fosters creativity, problem-solving, and business creation among students, while also facilitating technology transfer and the commercialisation of cutting-edge technologies.

They informed the TGHE Chairman that the AICTE Innovation Center provides assistance in the areas of: "Start-Up Support (mentoring, linkages, etc.), Funding Opportunities for innovative projects, Investor Linkages, Patenting and Licensing Assistance, Industry Collaboration and Networking, Commercialisation of innovative ideas and technologies.

The discussion regarding collaboration between the AICTE Innovation Center and the Telangana State Council of Higher Education (TGCHE) presents significant potential for promoting innovation, entrepreneurship, and quality education within the state. Some areas of convergence include: Promoting Startups through which joint initiatives can offer mentorship, funding, and networking opportunities for student entrepreneurs. The Industry-Academia Linkages would strengthen industry-academia connections allowing students to gain practical experience and develop industry-relevant skills.

The Intellectual Property Rights (IPR) is meant to raise awareness about IPR and providing training on patenting and technology transfer can help students and faculty protect their innovative ideas and commercialize their research.

ఆంధ్రజ్యోతి | హైదరాబాద్ • గురువారం 24 ఏప్రిల్ 2025

# యూజీసీ మార్గదర్శకాలపై తక్షణమే స్టే ఇవ్వలేం

- మా తుది తీర్పునకు లోబడే డీమ్డ్ యూనివర్సిటీ హోదా
- హోదా ఇచ్చే ముందే కొత్త డీమ్డ్ వర్సిటీలకు యూజీసీ ఈ విషయం చెప్పాలి: హైకోర్టు
- దుకాణాలు, షెడ్లలో కాలేజీలు పెట్టి.. డీమ్డ్ హోదా అడుగుతున్నారు
- కోర్టులో రాష్ట్ర ప్రభుత్వ వాదనలు
- విచారణ జులై 30కి వాయిదా



హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): డీమ్డ్ యూనివర్సిటీలకు సంబంధించి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కొత్త మార్గదర్శకాలపై తక్షణమే స్టే ఇవ్వలేమని హైకోర్టు పేర్కొంది. అయితే ఈ మార్గదర్శకాల మేరకు ఇప్పటికే అనుమతి పొందిన, భవిష్యత్తులో అనుమతి ఇచ్చే కాలేజీలకు.. డీమ్డ్ హోదా అనేది తాము ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటుందని స్పష్టం చేసింది. కొత్తగా డీమ్డ్ యూనివర్సిటీ హోదా ఇచ్చే ముందే ఈ విషయాన్ని ఆయా కాలేజీలకు యూజీసీ స్పష్టంగా చెప్పాలని ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది.

## ఆ నిబంధనలు రాజ్యాంగ వ్యతిరేకమంటూ..

ప్రైవేటు కాలేజీలకు డీమ్డ్ యూనివర్సిటీలుగా అనుమతి ఇచ్చేందుకు ఉద్దేశించిన పలు నిబంధనల్లో యూజీసీ ఏడాదిన్నర క్రితం పలు మార్పులు చేసింది. ఈ మేరకు మార్గదర్శకాలు (ఇనిస్టిట్యూషన్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీస్ రెగ్యులేషన్స్-2013) జారీ చేసింది. అయితే ఇందులోని 2 (15), 6, 7, 8, 29, 30 నిబంధనలు రాజ్యాంగ వ్యతిరేకమని, వాటిని కొట్టివేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 11న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను దెబ్బకొట్టేలా, రాష్ట్ర ప్రభుత్వ పాత్ర లేకుండా చేసేలా నూతన మార్గదర్శకాలు ఉన్నాయని పేర్కొన్నారు. 60 రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ అనుమతి రాకపోతే.. అనుమతి వచ్చినట్లే భావించాలనడం అక్రమమని స్పష్టం చేశారు. రాజ్యాంగం ప్రకారం 'విద్య' అనేది రాష్ట్ర జాబితాలోని అంశమని, ఇలా మార్గదర్శకాలు జారీ చేసే అర్హత యూజీసీకి లేదని పేర్కొన్నారు. చిన్న చిన్న దుకాణాలు, షెడ్లలో కాలేజీలు పెట్టి డీమ్డ్ హోదా కోసం ప్రయత్నిస్తున్నారని కోర్టుకు వివరించారు. ఇప్పటికే డీమ్డ్ హోదా పొందిన ఓ విద్యాసంస్థ న్యాక్ ఉత్తమ ర్యాంకు కోసం మోసానికి పాల్పడటంపై సీబీఐ విచారణ ఎదుర్కొంటోందని గుర్తుచేశారు. అలాంటి డీమ్డ్ యూనివర్సిటీలు భవిష్యత్తులో మూతపడితే విద్యార్థుల భవిష్యత్తుకు ఎవరు జవాబుదారీ అని ప్రశ్నించారు. యూజీసీ మార్గదర్శకాలపై స్టే ఇవ్వాలని కోరారు. ఇక కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ నర్సింహాశర్మ వాదిస్తూ.. యూజీసీ కొత్త మార్గదర్శకాలకు చట్టబద్ధమైన హోదా ఉందని పేర్కొన్నారు. అవి న్యాయ విరుద్ధమని తుది తీర్పు ద్వారా ప్రకటిస్తే తప్ప అమలును అడ్డుకోలేమని వివరించారు. వాదనలు విన్న ధర్మాసనం.. తక్షణమే స్టే ఇవ్వడానికి నిరాకరించింది. తదుపరి విచారణను జూలై 30కి వాయిదా వేసింది.

గురువారం | హైదరాబాద్
24.04.2025
www.v6velugu.com

ప్రభాత
వెలుగు

## డీమ్డ్ వర్సిటీ హోదా

# తుది తీర్పుకు లోబడే ఉంటుంది

- ఈ విషయాన్ని ఉత్తర్వుల్లో పేర్కొనాలి
- యూజీసీకి హైకోర్టు ఆదేశం



**హైదరాబాద్, వెలుగు:** తెలంగాణలోని విద్యా సంస్థలకు యూజీసీ మంజూరు చేసే డీమ్డ్ యూనివర్సిటీ హోదా తుది తీర్పునకు లోబడి ఉంటుందని, ఇకపై డీమ్డ్ వర్సిటీ హోదా కల్పిస్తూ జారీ చేసే ఉత్తర్వుల్లో ఇదే విషయాన్ని స్పష్టం చేయాలని యూజీసీకి బుధవారం హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ముందస్తు ఆమోదం తీసుకోకుండా యూజీసీ ప్రైవేటు విద్యా సంస్థలకు డీమ్డ్ యూనివర్సిటీ హోదా కల్పించడాన్ని సవాల్ చేస్తూ ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ యారా రేణుకతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ.. ప్రైవేటు విద్యా సంస్థలకు డీమ్డ్ వర్సిటీ హోదాను కల్పించే ముందు యూజీసీ రాష్ట్రప్రభుత్వం ఆమోదం తీసుకోవాల్సి ఉందన్నారు. అందులో ఉన్న సౌకర్యాలపై నివేదిక పొందిన తర్వాత ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉండగా, దానికి విరుద్ధంగా యూజీసీ అనుమతులు మంజూరు చేస్తున్నదని తెలిపారు. యూజీసీ నిబంధనలు రాష్ట్ర ప్రభుత్వ పాత్రను పరిమితం చేస్తున్నాయన్నారు. డీమ్డ్ వర్సిటీల వల్ల ఏదైనా జరిగితే విద్యార్థులు, వారి తల్లిదండ్రుల బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే ఉంటుందన్నారు. దీనికితోడు ఆఫ్ క్యాంపస్ పేరుతో పలుప్రాంతాల్లో వీటి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. విశ్వవిద్యాలయాలు రాష్ట్ర ప్రభుత్వ పరిధి లోనివని రాజ్యాంగంలో స్పష్టంగా ఉందన్నారు. కొత్త నిబంధనల ప్రకారం డీమ్డ్ సర్టిఫికెట్‌ను ప్రభుత్వం ధ్రువీకరించాల్సి ఉందని, అయితే.. 60 రోజుల్లో ధ్రువీకరించకపోతే అది ఆమోదం పొందినట్లుగానే భావించాల్సి ఉంటుందని తెలిపారు. మెరుగైన రేటింగ్‌ల కోసం న్యాక్ అధికారులతో కుమ్మక్కై సీబీఐ దర్యాప్తును ఎదుర్కొంటున్న డీమ్డ్ వర్సిటీలున్నాయన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అందువల్ల యూజీసీ నిబంధనల అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. మరోవైపు యూనివర్సిటీల తరఫు సీనియర్ అడ్వకేట్లు వాదనలు వినిపిస్తూ.. నిబంధనల ప్రకారమే యూజీసీ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అందువల్ల ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయరాదని పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. విద్యా సంస్థలకు మంజూరు చేసిన డీమ్డ్ యూనివర్సిటీ హోదా తుది తీర్పునకు లోబడి ఉంటుందని తేల్చి చెప్పింది. ప్రతివాదులైన యూజీసీ, అరోరా, చైతన్య, మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠ్, కేఎల్, సింబయాసిస్, విజ్ఞాన్‌కు నోటీసులు జారీ చేస్తూ జూన్ 30లోగా కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తుది విచారణను జులై 30కి వాయిదా వేసింది.

శుక్రవారం | హైదరాబాద్
25.04.2025
www.v6velugu.com

ప్రభాత
వెలుగు

## టీజీ ఎప్ సెట్‌కు 3.06 లక్షల అప్లికేషన్లు

○ ముగిసిన దరఖాస్తు గడువు

**హైదరాబాద్, వెలుగు:** రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీలో అడ్మిషన్ల కోసం నిర్వహించే టీజీ ఈఏపీసెట్ కు దరఖాస్తు గడువు ముగిసింది. గురువారం నాటికి 3,06,796 దరఖాస్తులు వచ్చాయని ఎప్ సెట్ కన్వీనర్ దీన్ కుమార్, కో కన్వీనర్ విజయ్ కుమార్ రెడ్డి తెలిపారు. దీంట్లో ఇంజినీరింగ్ స్ట్రీమ్ లో 2,20,049 అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్ లో 86,493, రెండింటికీ 254 అప్లికేషన్లు వచ్చాయని చెప్పారు. రూ.5వేల ఫైన్ తోనూ గురువారం తో దరఖాస్తు గడువు ముగిసింది. అయితే, ఉమ్మడి అడ్మిషన్లకు పదేండ్ల కాలం పూర్తికావడంతో, ఈసారి ఏపీ నుంచి ఎక్కువ మంది అప్లై చేసుకోలేదు. దీంతో గతేడాదితో పోలిస్తే స్వల్పంగా అప్లికేషన్లు తగ్గాయి. అయితే, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్ అభ్యర్థులకు ఈ నెల 29,30 తేదీల్లో, మే 2 నుంచి 4 వరకు ఇంజినీరింగ్ స్ట్రీమ్ కు ఎగ్జామ్ నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను ఇప్పటికే వెబ్ సైట్ లో పెట్టారు.

## పీజీఈసెట్‌కు 7,706 అప్లికేషన్లు

**హైదరాబాద్, వెలుగు:** ఎంఈ, ఎంటెక్, ఎంఫార్మసీ తదితర కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పీజీఈసెట్ కు గురువారం నాటికి 7,706 అప్లికేషన్లు వచ్చాయని పీజీఈసెట్ కన్వీనర్ అరుణకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 14 పేపర్లకు ఎగ్జామ్స్ నిర్వహిస్తుండగా, దీంట్లో ఫార్మసీకి అత్యధికంగా 3,179 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ లో 1,984, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ లో 761, సివిల్ ఇంజినీరింగ్ లో 631, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ లో 485, మెకానికల్ ఇంజినీరింగ్ లో 238 దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. రూ.వెయ్యి ఫైన్‌తో శుక్రవారం వరకు, రూ.2,500 ఫైన్ తో ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు.

వార్త, హైదరాబాద్, ఆదివారం 27, ఏప్రిల్ 2025

# టెన్త్, ఇంటర్ ఫెయిలైన వారికి స్కిల్ కోర్సుల్లో శిక్షణ!

## ఎన్ఎస్‌డిసితో ఎంఒయు చేసుకోనున్న ఉన్నత విద్యామండలి

### జిల్లాకొక సెంటర్ ఏర్పాటు.. పైలట్ ప్రాజెక్టుగా నాగర్‌కర్నూల్‌లో ప్రారంభం

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని యువత ప్రపంచంతో పోటీ పడేలా చేయాలని చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తెలంగాణ ఉన్నత విద్యా మండలి ముందుకు తీసుకుపోతోంది. రాష్ట్రంలో టెన్త్, ఇంటర్ ఫెయిలైన వారికి స్కిల్ కోర్సుల్లో శిక్షణ ఇప్పించేలా చర్యలు తీసుకుంటోంది. టెన్త్, ఇంటర్ ఫెయిలైన వారితో పాటు డ్రాపౌట్ అయిన వారికి కూడా స్కిల్ కోర్సుల్లో శిక్షణ ఇప్పించడానికి ఉన్నత విద్యా మండలి ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగా నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్ఎస్‌డిసి)తో అవగాహన ఒప్పందం(ఎంవోయూ) చేసుకోవాలని భావిస్తోంది. ఎన్ఎస్‌డిసితో ఎంవోయూ చేసుకుని యువతకు వివిధ స్కిల్ కోరుసల్లో శిక్షణను ఇప్పించాలని భావిస్తోంది. ఇటువంటి శిక్షణా కేంద్రం ప్రతి జిల్లాలోనూ ఒకటి ఏర్పాటు చేయాలని ఆలోచిస్తోంది. సుమారు 39 స్కిల్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వాలని ఉన్నత విద్యా మండలి భావిస్తోంది. అయితే యువతకు స్కిల్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వడానికి ఎన్ఎస్‌డిసితో ఎంవోయూ చేసుకోవడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమయం కోసం ఉన్నత విద్యా మండలి ఎదురు చూస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించిన నేపథ్యంలో రాష్ట్రంలో ఉన్న యువత అందరికీ అక్కడ శిక్షణ ఇప్పించడం సాధ్యం కాదు కాబట్టి.. ప్రతి జిల్లాలోనూ ఒక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి.. ఆ జిల్లాలో ఉన్న యువత దేని గురించి ఆలోచిస్తుందో సర్వే చేయించి తద్వారా అవే కోర్సుల్లో శిక్షణ ఇప్పించాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. మే నెలలో ముఖ్యమంత్రి సమయం మేరకు ఎన్ఎస్‌డిసితో ఎంవోయూ చేసుకొన్న అనంతరం కేంద్రం నుంచి వచ్చే శిక్షకులతోపాటు రాష్ట్రం లోనూ శిక్షణ ఇచ్చిన వారితో యువతకు స్కిల్ కోర్సుల్లో ట్రెయినింగ్‌ను ఇవ్వాలని భావి స్తున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలోనూ ట్రెయినింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నప్పటికీ.. పైలట్ ప్రాజెక్టుగా మొదటగా నాగర్‌కర్నూల్ జిల్లాలో ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. అందులో వచ్చిన ఫలితాల ఆధారంగా రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లోనూ స్కిల్ కోర్సు శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. రాష్ట్రంలోని యువతకు ఇంజనీరింగ్ కోర్సులు కాకుండా మిగిలిన సుమారు 39 కోర్సుల్లో ట్రెయినింగ్ ఇవ్వడానికి ప్లాన్ చేస్తున్నారు. వాటిలో అగ్రికల్చర్, బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్, డ్రోన్ టెక్నాలజీ తదితర 39 కోర్సుల్లో ట్రెయినింగ్ ఇవ్వాలని భావిస్తున్నారు.

SUNDAY 27 APRIL 2025 | THE HANS INDIA | HYDERABAD

## hmtv Awards presented

# India will be world's largest supplier of skilled manpower: TGCHE chief




TGCHE chairman Prof. V. Balakista Reddy, veteran actor Maganti Murali Mohan and G Rama Reddy CREDAI, National President-elect at the inaguration of the hmtv Technical Education Awards programme in Hyderabad on Saturday

HANS NEWS SERVICE
HYDERABAD

hmtv Telugu news channel, a part of Hyderabad Media House Pvt Limited, on Saturday presented Technical Education Awards-2025 to an overwhelming response.

Noted personalities from the education, technology and entertainment sectors said that technical education has been tremendously transformed in the state, thanks to the relentless pursuits of the promoters, vice-chancellors and principals. Veteran actor and producer Murali Mohan said that the role of education is critical for improving the lives of people. Quality education is in high demand in the competitive world, he said, adding that teachers play a key role in moulding the students and gearing them up for the future.

Continued on Page 4

hmtv Awards photo feature P8

మన తెలంగాణ
ఆదివారం 27, ఏప్రిల్ 2025

# వారంలో దోస్త్ నోటిఫికేషన్

మనతెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో వచ్చే విద్యాసంవత్సరం డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు ఆన్‌లైన్ విధానంలో డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్) ద్వారా చేపట్టాలని నిర్ణయించిన ఉన్నత విద్యామండలి వారంలో నోటిఫికేషన్ విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈనెల 22న ఇంటర్మీడియేట్ ఫలితాలు వెలువడిన డిగ్రీ ప్రవేశాలకు త్వరలోనే నోటిఫికేషన్ వెలువడనున్నది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి షెడ్యూల్‌పై కసరత్తు చేస్తున్నది. దోస్త్‌లో భాగంగా డిగ్రీలో నాలుగు విభాగాల నుంచి మూడు సబ్జెక్టులను ఎంచుకునే బకెట్ విధానం తొలగించాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. గత కొన్నేళ్లుగా ఆన్‌లైన్ విధానంలో దోస్త్ ద్వారా డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు చేపడుతున్నారు. అయితే ఈ విధానంలో ఎన్నో ప్రయోజనాలు ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంత విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆన్‌లైన్ ప్రవేశాలపై అవగాహన లేకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఉన్నత విద్యామండలి దృష్టికి రాగా, లోపాలు సవరించి ఆన్‌లైన్ విధానంలోనే డిగ్రీ ప్రవేశాలు చేపట్టాలని ఉన్నత విద్యామండలి నిర్ణయం తీసుకున్నది. రాష్ట్రంలో 2015 16 విద్యా సంవత్సరం వరకు విద్యార్థులు డిగ్రీ సీట్ల కోసం డిగ్రీ కళాశాలల్లో వేర్వేరుగా దరఖాస్తులు చేసుకునేవారు. ప్రతి కళాశాలకు దరఖాస్తు ఫీజు చెల్లించాల్సి వచ్చేది. సీటు ఎక్కడ వచ్చిందో తెలుసుకునేందుకు ప్రతీ కాలేజీకి వెళ్లాల్సి వచ్చేది. సీటు రాకపోతే మరో కౌన్సెలింగ్ పెట్టే వరకూ అన్ని కాలేజీలూ తిరగాల్సి రావడంతోపాటు విభిన్న కోర్సుల కోసం వివిధ దరఖాస్తులు చేయాల్సి వచ్చేది. ఈ విధానం వల్ల విద్యార్థులు వ్యయ ప్రయాసలకు గురయ్యేవాళ్లు. దీనిపై విస్తృతంగా చర్చించి 2016 17 నుంచి దోస్త్ పేరిట ఆన్‌లైన్ విధానంలో డిగ్రీ ప్రవేశాలు చేపట్టే విధానం అందుబాటులోకి తీసుకువచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 1,055 ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలలను ఒకేచోటకు చేర్చి మెరిట్, రిజర్వేషన్ ద్వారా సీట్లను కేటాయించే విధానాన్ని ప్రవేశపెట్టారు. విద్యార్థులు రూ.200 ఫీజు చెల్లించి రాష్ట్రంలోని అన్ని డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. రాష్ట్రంలో డిగ్రీ తరగతులు జూన్ 16 నుంచి ప్రారంభం కానున్నాయి. డిగ్రీలోని ఆరు సెమిస్టర్ల షెడ్యూళ్లను ఉన్నత విద్యామండలి ఇప్పటికే నిర్ణయించింది. తొలి సెమిస్టర్ తరగతులు జూన్ 16 నుంచి, పరీక్షలు నవంబరు 6 నుంచి మొదలవుతాయి.

నవతెలంగాణ మంగళవారం 29 ఏప్రిల్ 2025

# నేటి నుంచి ఎప్‌సెట్ పరీక్షలు

## రెండ్రోజులు అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్‌కు

## మే 2 నుంచి ఇంజినీరింగ్ స్ట్రీమ్‌కు పరీక్షలు

## 3,06,796 మంది దరఖాస్తులు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టీజీ ఎప్‌సెట్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా టీజీ ఈఏపీసెట్‌కు 3,06,796 దరఖాస్తులు వచ్చాయి. ఇంజినీరింగ్ స్ట్రీమ్‌లో 2,20,049, అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్‌లో 86,493, రెండింటికీ 254 అప్లికేషన్లు వచ్చాయి. ఈ నెల 29, 30వ తేదీల్లో జరిగే అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ ఎగ్జామ్ కోసం 112 సెంటర్లు ఏర్పాటు చేశారు. మే 2 నుంచి 4 వరకు జరిగే ఇంజినీరింగ్ స్ట్రీమ్ కోసం 124 సెంటర్లు ఏర్పాటు చేశారు. ఎప్‌సెట్ ఎగ్జామ్స్ ప్రతి రోజూ 2 సెషన్లలో నిర్వహించనున్నారు. మార్నింగ్ సెషన్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగనున్నాయి. ఆన్‌లైన్‌లో జరిగే ఈ పరీక్షలకు ఎప్‌సెట్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఇప్పటికే దాదాపు అభ్యర్థులంతా వెబ్ సైట్ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు. తొలిసారిగా ఎప్‌సెట్ హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్‌ను ముద్రించారు. దాని ద్వారా ఎగ్జామ్ సెంటర్ రూట్ మ్యాప్ సులభంగా తెలుసుకోవచ్చు.

**అమల్లో నిమిషం నిబంధన**

ఎప్‌సెట్ పరీక్షలకు నిమిషం నిబంధన అమలు చేయనున్నారు. మార్నింగ్ సెషన్ ఎగ్జామ్‌కు ఉదయం 7.30 గంటలకు, మధ్యాహ్నం సెషన్ వారికి 1.30 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. బయోమెట్రిక్ తప్పనిసరి ఉండడంతో అభ్యర్థుల వేలిముద్రలను తీసుకుంటారు. చేతులపై మెహందీ, టాటూ, ఇంక్ మొదలైన డిజైన్లు ఉండకూడదు. ఫొటో ఐడీ, హాల్‌టికెట్, బ్లాక్/బ్లూ బాల్ పాయింట్ పెన్ను తీసుకెళ్లాలి.

మన తెలంగాణ
మంగళవారం 29, ఏప్రిల్ 2025

# నేటి నుంచి ఎప్‌సెట్

- మంగళ, బుధవారాల్లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగానికి పరీక్షలు
- పరీక్షా సమయానికి 90 నిమిషాల ముందు నుంచే పరీక్ష కేంద్రంలోకి అనుమతి
- రోజుకు రెండు సెషన్లలో పరీక్షలు
- నిమిషం నిబంధన అమలు

మనతెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఇఎపిసెట్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మే 4వ వరకు ఈ పరీక్షలు కొనసాగనున్నాయి. మంగళ, బుధవారాలో(మే 29,30) తేదీలలో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగానికి, మే 2 నుంచి 4వ తేదీ వరకు ఇంజనీరింగ్ విభాగానికి పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 వరకు రెండు సెషన్లలో పరీక్షలు దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 16 ప్రాంతాల్లోని 124 కేంద్రాల్లో ఇఎపిసెట్ పరీక్షల కోసం ఏర్పాట్లు చేశారు. అగ్రికల్చర్, ఫార్మా ప్రవేశ పరీక్షకు 86,101 మంది, ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షకు 2,19,420 మంది, రెండింటికీ 253 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఆన్‌లైన్ పరీక్షల నేపథ్యంలో పరీక్షా కేంద్రాలలో విద్యుత్ అంతరాయం లేకుండా తగిన చర్యలు చేపట్టారు.

## అమలులో నిమిషం నిబంధన

రోజుకు రెండు సెషన్ల చొప్పున పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండో సెషన్ ఉంటుంది. పరీక్షా సమయానికి 90 నిమిషాల ముందు అంటే ఉదయం 7.30 గంటల నుంచే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. కనీసం 20 నిమిషాల ముందే కేంద్రానికి చేరుకోవాలని విద్యార్థులకు కన్వీనర్ సూచించారు. విద్యార్థుల వివరాల పరిశీలనకు 20 నిమిషాల సమయం పడుతుందని, కాబట్టి విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు ఉదయం సెషన్‌కు 9 గంటల వరకు రిపోర్టింగ్ చేయాలి. ఆ తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించమని స్పష్టం చేశారు. విద్యార్థులు తమ వెంట ఒక గుర్తింపు కార్డు, ఇటీవల తీసుకున్న ఫొటో తీసుకువెళ్లాలి. కళాశాల ఐడీకార్డు, ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు, ఓటర్‌ఐడీని గుర్తింపు కార్డుగా పరగణిస్తారు.

## వీటికి అనుమతి ఉండదు

ఇఎపిసెట్ పరీక్షా కేంద్రాల్లోకి వాటర్ బాటిళ్లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లకు అనుమతి ఉండదు. పరీక్షా కేంద్రాలలోనే విద్యార్థులు మంచినీళ్లు అందుబాటులో ఉంచుతారు. విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు బ్లూ లేదా బ్లాక్ పాయింట్ పెన్‌తో ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం తీసుకెళ్లాలి. ఇఎపిసెట్ రాసే విద్యార్థులకు బయోమెట్రిక్ తప్పనిసరి. ఈ కారణంగా చేతులకు గోరింటాకు, ఇతర డిజైన్లు వేసుకుంటే ఇబ్బంది కలిగే అవకాశం ఉంటుంది. చేతులు శుభ్రంగా కడుకుంటే బయోమెట్రిక్ హాజరుకు ఇబ్బంది ఉండదు.

## ఈసారి హాల్‌ట టికెట్లపై క్యూఆర్ కోడ్

ఇఎపిసెట్ పరీక్షలకు ఈసారి క్యూఆర్ కోడ్‌తో హాల్ టికెట్లు జారీ చేశారు. హాల్ టికెట్లు గూగుల్ మ్యాప్స్‌కి లింక్ చేయబడిన క్యూఆర్ కోడ్ ముద్రించారు. విద్యార్థులు తమ పరీక్షా కేంద్రాలను సులభంగా గుర్తించడానికి, నావిగేట్ చేయడానికి ఇది ఎంతో సహాయపడుతుంది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన తర్వాత పరీక్ష కేంద్రం ఎంత దూరంలో ఉందో తెలుసుకోవచ్చు.దానికి అనుగుణంగా వి ద్యార్థులు సులువుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవచ్చు.

నవతెలంగాణ మంగళవారం 29 ఏప్రిల్ 2025

# ఉద్యమ కేంద్రాలుగా వర్సిటీలు

- ఉద్యోగ భద్రత రెగ్యులరైజ్‌కు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్స్
- ఉద్యోగ భద్రతతో పాటుగా వెయిటేజీకి పార్ట్ టైమ్ అధ్యాపకులు
- నిరవధిక సమ్మె చేస్తున్న కాంట్రాక్టు, పార్ట్ టైమ్ అధ్యాపకులు
- పీహెచ్డీ అర్హతకు మార్కులు కేటాయించాలని డాక్టరేట్స్..





నవతెలంగాణ-ఓయూ

ఇటీవలే ప్రభుత్వ యూనివర్సిటీల్లో రాష్ట్ర ప్రభుత్వం అసిస్టెంట్ ప్రొఫెసర్స్ నియామకాలు చేసేందుకు జీవో 21 ని విడుదల చేసిన విషయం తెలిసింది. అప్పటి నుంచి యూనివర్సిటీల్లో బోధన చేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్స్, పార్ట్ టైమ్ టీచర్స్ భయం ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వాన్ని ఎంతో వేడుకున్నా ఫలితం దక్కలేదు. ఇక గత్యంతరం లేక సమ్మెకు దిగారు. ఒక్కసారిగా యూనివర్సిటీలు ఉద్యమ కేంద్రాలుగా మారాయి. పలు యూనివర్సిటీల్లో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్స్ అడ్మినిస్ట్రేషన్స్ పదవులకు కూడా రాజీనామాలు చేసి సమ్మెలో భాగస్వామ్యులు అవుతున్నారు. దీంతో పలు యూనివర్సిటీల్లో పరీక్షలు వాయిదా పడ్డట్టు సమాచారం. మరొక వైపు యూనివర్సిటీలు సమ్మె ప్రభావంతో పలు కార్యాకలపాలు నిలిచి పోయాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా వారి విషయంలో ఆచితూచి అడుగులు వేస్తుంది.

**రెగ్యులరైజ్, ఉద్యోగ భద్రతకై కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్స్**

12 వర్సిటీల్లో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్స్ సమ్మె వల్ల పాలన స్తంభించింది. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్స్ గత ఎన్నో ఏండ్లుగా చాలీచాలని వేతనాలతో గుర్తింపు లేని పనితో ఎక్కువ పని తక్కువ వేతనంతో పని చేస్తున్నట్టు కాంట్రాక్ట్ ప్రొఫెసర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారు ప్రధానంగా ఉద్యోగాలు రెగ్యులరైజేషన్ చేయాలని, ఒకవేళ ఏదైనా కొంచెం ఆలస్యం అవుతుంది అనుకున్న సందర్భంలో ఉద్యోగ భద్రతతో కూడిన 'యూజీసీ పే స్కేల్స్' ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. తమకు యూజీసీ నిబంధనల ప్రకారం పూర్తి అర్హత ఉందంట్టు, రెగ్యులర్ చేయడానికి యూజీసీ అడ్డంకులు గాని, న్యాయపరమైనటువంటి అడ్డంకులు గానీ ఏవీ లేవని తెలుపుతున్నారు. యూనివర్సిటీలలో 3 దశాబ్దాల క్రితం మొదలైన కాంట్రాక్టు వ్యవస్థ ఎప్పటికప్పుడు కొత్త ప్రభుత్వాలు వచ్చిన తమ శ్రమ దోచుకుంటూ నేటికీ కొనసాగిస్తూనే ఉన్నారన్నారు. తాము యూనివర్సిటీలలో రెగ్యులర్ రిక్రూట్మెంట్‌కి వ్యతిరేకం కాదని, రెగ్యులర్ రిక్రూట్మెంట్‌ని సంపూర్ణంగా ఆహ్వానిస్తు న్నట్టు పేర్కొన్నారు. కానీ దశాబ్దాలుగా పనిచేస్తున్న తమకి న్యాయం చేసిన తర్వాతనే రిక్రూమెంట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అనేక సార్లు ప్రభుత్వాలు తమకి అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ కొందరు అధికారులు మాత్రం వ్యతిరేకంగా తప్పుడు సమా చారాన్ని ప్రభుత్వానికి అందిస్తున్నారని ఆవేదన అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అలాంటి అసత్య సమాచారాన్ని నమ్మకుండా సరైన సమాచారాన్ని తెప్పించుకొని చర్చలు జరిపి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కొందరూ ప్రభుత్వ అధికారులు, పెద్దలు మాట్లాడుతూ.. విదేశాల నుంచి చాలామంది అధ్యాపకులుగా ఇక్కడ జాయిన్ అవ్వడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పతున్నారు. తెలంగాణలోని ప్రభుత్వ యూనివ ర్సిటీలలో చదువుతు న్నటువంటి విద్యార్థులంతా గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చినవారు. వారి మనస్తత్వం, వారి జ్ఞాన స్థాయిని దృష్టిలో పెట్టుకొని బోధన చేయాలని, విదేశాల నుంచి వచ్చిన వారికి విద్యార్థుల జ్ఞాన స్థాయి కానీ, వారి మనస్తత్వం కానీ తొందరగా అర్థం చేసుకుని అవకాశం లేదని, వారితో మమేకం కాలేరని, వారికి అర్థమయ్యే విధంగా బోధన చేయలేరని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొపెసర్స్ వాపోతున్నారు. సాఫ్‌వేర్, కార్పొరేటర్ రంగంలో గానీ, విద్యారంగంలోగాని అర్హత తోపాటు అనుభవానికి ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. సుమారు మూడు దశాబ్దాల బోధన అనుభవం, పరిపాలన అనుభవం ఉన్నటువంటి ప్రస్తుత అధ్యాపకులకు కాదని కొత్తవారిని నియమించడం వల్ల ప్రభుత్వానికి, విద్యార్థులకు కొత నష్టం జరిగే అవకాశం ఉందని వెల్లడించారు. వారు చేస్తున్న నిరావధిక సమ్మె నేటికి 10వ, రోజుకి చేరుకుంది. ఉన్నత విద్యామండలి ముట్టడించి తరువాత గాంధీభవన్ వద్ద దీక్షకు వెళ్తున్న వేళా పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారిని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఉధృతం అవుతున్న పార్ట్ టైమ్ అధ్యాపకుల సమ్మె..**

రాష్ట్రంలో 9 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న 820 మంది పార్ట్ టైం అధ్యాపకులు అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. వారి డిమాండ్‌ల అమలుకై గత 7 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల్లో నిరవధిక సమ్మె ప్రారంభించారు. వారు తెలంగాణ ఆల్ యూనివర్సిటీ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకుల ఉద్యోగ భద్రత కల్పించాలని, జీవో నెంబర్ 21లో పార్ట్ టైం అధ్యాపకులకు వెయిటేజ్ ఇవ్వాలని, యూనివర్సిటీ రిక్రూట్‌మెంట్‌లో పార్ట్ టైం అధ్యాపకులకు ప్రథమ ప్రాధాన్యతనివ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ప్రధాన డిమాండ్లతో నిరవధిక సమ్మె చేస్తున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని ఇటు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి, ఉన్నత విద్యామండలి, ఆయా యూనివర్సిటీల అధికారుల దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం సమర్పించారు. ఈ ఉద్యమాన్ని ఈ నాయకులు పాల్గొని ఉధృతం చేస్తున్నారు.

## 30 మార్కులు కేటాయించాలని తెలంగాణ డాక్టరేట్స్



తెలంగాణ నిరుద్యోగులకే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ డాక్టరేట్స్ అసోసియేషన్ (టీజీడీఏ) ఆధ్వర్యంలో ఉన్నత విద్యామండలి చైర్మెన్, వైస్ చైర్మెన్‌లకు, ప్రభుత్వ సలహాదారుడు కె.కేశవరావు, ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం, ఓయూ వీసీ, విద్యా కమిషన్ సభ్యులకి వినతిపత్రాన్ని వేరు వేరుగా అందజేశారు. రాష్ట్రంలోని వర్సిటీల్లో చేపట్టబోయే ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి జారీ చేసిన జీవో 21ని సవరించాలని వారు విజ్ఞప్తి చేశారు. యూజీసీ-2018 గైడ్ లైన్స్‌ను అమలు చేయాలని కోరారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకల్లో పీహెచ్డీ అర్హతకి 10 మార్కులు కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పీహెచ్డీ 30 మార్క్స్ కేటాయించలని వారు డిమాండ్ చేస్తున్నారు. జీవో 21 వల్ల తెలంగాణ నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని పలువురికి ధృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 3 వేల ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కేవలం అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి జారీ చేసిన 21 జీవోను సవరించి, ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులను కూడా భర్తీ చేయాలని కోరారు. నియామక ప్రక్రియలో డెమో, ఇంటర్వ్యూలకు అధికంగా 30 మార్కులు కేటాయించడం నియామక అధికారుల వ్యక్తిగత విచక్షణకు ఎక్కువ అవకాశం ఇవ్వడంతో పాటు, పారదర్శకత ఉండదని గుర్తు చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాలకు పెట్టిన అసోసియేట్ ప్రొఫెసర్ నిబంధనలను తొలగించిలని డిమాండ్ చేశారు. పీడీఎఫ్‌కి ఎక్కువ మార్కులు కేటాయించాలని కోరారు. నియామక ప్రక్రియలో ఏబీసీ గ్రూపులను తోలగించి ఒకే గ్రూపుగా పరిగణించాలన్నారు. నెట్ లేదా పీహెచ్డీ వంటి కనీస అర్హతలను తప్పనిసరి చేయకపోవడం యూజీసీ నిబంధనలకు విరుద్ధమన్నారు. యూజీసీ నిబంధనలను విస్మరిస్తే అర్హులైన అభ్యర్థులు ఎంపిక కాకపోవచ్చని, రాష్ట్రంలోని ఉన్నత విద్యా ప్రమాణాలు దిగజారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. డెమో, టీచింగ్ స్కిల్స్‌ని ఇంటర్వ్యూలోనే కలుపాలని కోరారు.

నమస్తే తెలంగాణ హైదరాబాద్ మంగళవారం 29 ఏప్రిల్ 2025

# 'దోస్త్'కు ఏమయ్యింది?

- **ఇంటర్ ఫలితాలు వచ్చి వారం అయినా విడుదల కాని 'దోస్త్' నోటిఫికేషన్**

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : డిగ్రీ ఫస్టియర్‌లో ప్రవేశాలు కల్పించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్) నోటిఫికేషన్ విడుదలపై సందిగ్ధత నెలకొన్నది. ఇంటర్ ఫలితాలు విడుదలై వారం రోజులు(ఈ నెల 22న) గడిచినా ఇంత వరకు దోస్త్ నోటిఫికేషన్ విడుదలకాలేదు. 'దోస్త్' విషయమై తెలంగాణ ఉన్నత విద్యామండలి, కొందరు అధికారుల మధ్య వార్ నడుస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. దీంతో నోటిఫికేషన్ ఆలస్యమవుతున్నట్టు సమాచారం. డిగ్రీ ప్రవేశాలు మరింత ఆలస్యంకానున్నాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# నేటి నుంచి ఎప్‌సెట్ పరీక్షలు

- **ఆఖర్లో వచ్చారో.. ఐదారు నిమిషాలు కోల్పోయినట్టే**
- **వెరిఫికేషన్, బయోమెట్రిక్‌కు సమయం పట్టే అవకాశం**
- **ఈ తంతు పూర్తయితేనే పరీక్షకు అనుమతి**
- **నిమిషం నిబంధన కఠినంగా అమలు**

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఎప్‌సెట్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. మంగళ, బుధవారాల్లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ(ఏపీ) విభాగానికి పరీక్షలు జరగనుండగా, గురువారం విరామం ప్రకటించారు. శుక్ర, శని, ఆదివారాల్లో ఇంజినీరింగ్ విభాగానికి పరీక్షలు జరుగుతాయి. ఉదయం సెషన్‌లో 7:30 గంటలు, మధ్యాహ్నం సెషన్‌లో 1:30 గంటల నుంచే విద్యార్థులను పరీక్షాకేంద్రాల్లోకి అనుమతిస్తారు. నిమిషం ఆలస్యమైనా ఎట్టి పరిస్థితుల్లో పరీక్షకు అనుమతించబోమని ఎప్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ డీన్‌కుమార్, కో కన్వీనర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్‌రెడ్డి స్పష్టంచేశారు. అభ్యర్థులు వీలైనంత మేరకు ఆఖరులో కాకుండా గంట ముందుగా పరీక్షాకేంద్రాలకు చేరుకోవాలి. ఎందుకంటే వెరిఫికేషన్, బయోమెట్రిక్ నమోదుకు కాస్త సమయం పడుతుంది. ఆ తర్వాత కంప్యూటర్ కేటాయింపు, లాగిన్ కావడం, పాస్‌వర్డ్ నొక్కడానికి మరింత సమయం పడుతుంది. ఈ తంతు పూర్తయితేనే విద్యార్థులను పరీక్షకు అనుమతిస్తారు. మొత్తంగా 5 నుంచి 10 నిమిషాలు పట్టొచ్చు. సరిగ్గా పరీక్షా సమయానికే సర్వర్ ఓపెన్ అవుతుంది. అప్పటి నుంచే పరీక్ష ప్రారంభమైనట్టు లెక్క. ఈ నేపథ్యంలో విద్యార్థులు తొందరగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. అగ్రికల్చర్, ఫార్మసీకి 112, ఇంజినీరింగ్‌కు 124 సెంటర్లను ఏర్పాటు చేశారు.

### కరెంట్ కోతల భయం..

ఎప్‌సెట్ పరీక్షకు కరెంట్ కోతల భయం పట్టుకుంది. పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తుండటంతో కరెంట్ సమస్య పట్టిపీడిస్తున్నది. ఎండలు ముదిరిపోవడం, విద్యుత్తు వినియోగం పెరగడంతో ఎక్కడ ఏ సమస్య తలెత్తుతుందో.. ఏ ఉపద్రవం వచ్చిపడుతుందోనన్న టెన్షన్ అధికారులను వణికిస్తున్నది. నిరుడు కరీంనగర్ జిల్లా వాగేశ్వరి కాలేజీ సెంటర్‌లో కరెంట్ సమస్య తలెత్తింది. పరీక్ష మధ్యలో నిలిచిపోయింది. రెండు గంటలు ఆలస్యంగా కరెంట్ పునరుద్ధరించారు. ఈ నేపథ్యంలో ఈ సారి మూడు రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మొదటిది విద్యుత్తు సరఫరా కాగా, రెండోది యూపీఎస్, మూడోది జనరేటర్. యూపీఎస్, జనరేటర్లు ఉన్న వాటిల్లోనే పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షల నేపథ్యంలో విద్యుత్తు కోతల్లేకుండా చూడాలని, అంతరాయం లేని విద్యుత్తు అందించాలని విద్యుత్తు సంస్థల అధికారులకు ఉన్నత విద్యామండలి, జేఎన్టీయూ అధికారులు లేఖలు రాశారు.

ప్రభాత
వెలుగు
మంగళవారం | హైదరాబాద్
29.04.2025
www.v6velugu.com

# దోస్త్ నోటిఫికేషన్ ఎప్పుడు?

- ఇంటర్ ఫలితాలొచ్చి వారమైనా స్పష్టత కరువు

**హైదరాబాద్, వెలుగు:** రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల్లో ఫస్టియర్ అడ్మిషన్ల కోసం నిర్వహించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) నోటిఫికేషన్ విడుదలపై అయోమయం నెలకొంది. ఇంటర్ ఫలితాలు రిలీజై వారం రోజులు కావొస్తున్నా.. ఇప్పటికీ దానిపై స్పష్టత కరువైంది. దీంతో విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది. ఈనెల 22న ఇంటర్ ఫలితాలు రిలీజ్ అయ్యాయి. సెకండియర్ జనరల్ కేటగిరీలో 2.85 లక్షల మంది, ఒకేషనల్ కేటగిరీలో 40,864 మంది, ప్రైవేటు విద్యార్థులు 17,358 మంది పాసయ్యారు. అయితే, పరీక్షల ఫలితాలు విడుదలైన తెల్లారి లేదా, రెండో రోజు డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం దోస్త్ నోటిఫికేషన్ ఇచ్చేవారు. ఈసారి వారం రోజులైనా నోటిఫికేషన్‌పై స్పష్టత రాలేదు. వారం క్రితమే ఈ అంశంపై సమావేశం నిర్వహించినా.. నోటిఫికేషన్ రిలీజ్ చేయలేదు. అయితే, ముందుగా వీసీల సూచనలతో డిగ్రీలో బకెట్ సిస్టమ్ ఎత్తెయ్యాలని హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ అధికారులు భావించారు. కానీ, దాంట్లో విద్యాశాఖ ఉన్నతాధికారి జోక్యం చేసుకొని.. ఎలాంటి మార్పులు చేయొద్దని కౌన్సిల్ అధికారులకు చెప్పకుండా ఏకంగా సీజీజీ వారికి ఆదేశాలిచ్చారు. మరోపక్క కళాశాల విద్యాశాఖ అధికారులు కూడా విద్యాశాఖ శాఖ సెక్రటరీతో జరిగిన మినిట్స్ వస్తే తప్ప.. నోటిఫికేషన్ ఇచ్చేది లేదని చెప్తున్నట్టు తెలిసింది. విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా అధికారులు తమ ఇగోలను పక్కన పెట్టి దోస్త్ నోటిఫికేషన్ జారీచేయాలని విద్యార్థులు, పేరెంట్స్, మేనేజ్మెంట్లు కోరుతున్నారు.



# నిమిషం లేటైనా నో ఎంట్రీ

- నేటి నుంచి టీజీ ఎప్ సెట్

**హైదరాబాద్, వెలుగు:** రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే టీజీ ఎప్ సెట్ ఎగ్జామ్స్ మంగళవారం నుంచి ప్రారంభం అవుతున్నాయి. ఈ పరీక్షలకు నిమిషం నిబంధన అమల్లో ఉంది. నిమిషం లేటైనా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరు. కాగా.. మంగళవారం, బుధవారం అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్ విద్యార్థులకు.. మే 2, 3, 4వ తేదీల్లో ఇంజినీరింగ్ స్ట్రీమ్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. అయితే.. ఈఏపీ సెట్ కు 3,06,796 దరఖాస్తులు రాగా, ఇంజినీరింగ్ స్ట్రీమ్ లో 2,20,049, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్ లో 86,493, రెండింటికీ 254 అప్లికేషన్లు వచ్చాయి. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కోసం 112, ఇంజినీరింగ్ స్ట్రీమ్ కోసం 124 ఆన్ లైన్ పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫస్ట్ సెషన్, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ సెకండ్ సెషన్ లో ఎగ్జామ్స్ జరగనున్నాయి. హాల్ టికెట్లపై ముద్రించిన క్యూఆర్ కోడ్ ఆధారంగా అభ్యర్థులు నిర్ణీత టైమ్‌కు కనీసం గంటన్నర ముందు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఈఏపీసెట్ కో కన్వీనర్ ప్రొఫెసర్ విజయ్ కుమార్ రెడ్డి తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఈనాడు మంగళవారం ఏప్రిల్ 29, 2025

# 'దోస్త్' నోటిఫికేషన్ ఎప్పుడు?

ఈనాడు, హైదరాబాద్: డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ - తెలంగాణ (దోస్త్) ద్వారా డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలపై సందిగ్ధత నెలకొంది. సాధారణంగా ఇంటర్ ఫలితాలు వెలువడిన మరుసటిరోజే దోస్త్ షెడ్యూల్ జారీ చేసేవారు. ఈసారి ఫలితాలు వచ్చి వారం రోజులైనా నోటిఫికేషన్ ఎప్పుడు వెలువడుతుందో ఉన్నత విద్యామండలి అధికారులు కూడా చెప్పలేకపోతున్నారు. ఈసారి రెండు విడతల్లోనే దోస్త్ ద్వారా ప్రవేశాలు నిర్వహించి జూన్ 16 నుంచి తొలి సెమిస్టర్ తరగతులను ప్రారంభించాలనుకున్నారు. అయితే ఇప్పటివరకు నోటిఫికేషన్ వెలువడకపోవడంతో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం తరగతులు మొదలవుతాయా? లేదా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈసారి దోస్త్‌లో బకెట్ విధానాన్ని తొలగించాలని కొద్దిరోజుల క్రితం ఉన్నతవిద్యామండలి కార్యాలయంలో జరిగిన ఉపకులపతుల సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. అయితే ఆ నిర్ణయం తీసుకునే అధికారం ఉన్నత విద్యామండలికి గానీ. . వీసీలకు గానీ లేదని, తమకు సమాచారం లేకుండా.. తమ ఆమోదం లేకుండా ఎలా నిర్ణయం తీసుకుంటారని విద్యాశాఖలోని ఓ అధికారి ప్రశ్నించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే పది రోజుల క్రితం వీసీలతో సమావేశం నిర్వహించి.. ఈసారికి యథాతథంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిసింది. అయితే ఆ సమావేశానికి సంబంధించి తీర్మానాల కాపీ (మినిట్స్) ఇంతవరకు అందలేదు. దాంతో ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ జారీ చేయలేదని తెలుస్తోంది.

సాక్షి
మంగళవారం। 29
। ఏప్రిల్। 2025

# యూజీసీ పే స్కేల్‌ను అమలు చేయండి



ఉన్నత విద్యామండలి అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న అధ్యాపకులు

**ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు కాంట్రాక్ట్ అధ్యాపకుల వినతి**

**ఉస్మానియా యూనివర్సిటీ:** వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులకు యూజీసీ పే స్కేల్‌ను అమలు చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.బాలకిష్టారెడ్డి, కార్యదర్శి ప్రొ.శ్రీరాం వెంకటేష్‌కు అధ్యాపకులు సోమవారం వినతిపత్రం సమర్పించారు. నిరవధిక సమ్మె చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలు ప్రభుత్వానికి కనిపించడం లేదా అంటూ కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధర్మతేజ, పరుశురాం, వేల్పుల కుమార్, ఉపేందర్, విజయేందర్ రెడ్డి, తాళ్లపల్లి వెంకటేశ్వర్లు, వినీత పాండే, కృష్ణవేణి, కవిత, కృష్ణయ్య, తిరుపతి పాల్గొన్నారు.

# నేటి నుంచి ఈఏపీ సెట్

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీఎస్ఈఏపీ సెట్) మంగళవారం నుంచి మొదలవుతుంది. ఈనెల 29, 30వ తేదీల్లో అగ్రికల్చర్ సెట్ జరుగుతుంది. మే 2 నుంచి 4 వరకు ఇంజనీరింగ్ సెట్ జరుగుతుంది. రాష్ట్రవ్యాప్తంగా 3,06,796 మంది ఈఏపీసెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అగ్రి. ఫార్మా విభాగానికి 86,498 మంది, ఇంజనీరింగ్ 2,20,049 మంది దరఖాస్తు చేసుకున్నారు. రెండు సెట్లకు 254 మంది దరఖాస్తు చేశారు. ప్రవేశ పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఈఏపీ సెట్ కో–కన్వీనర్ విజయకుమార్ రెడ్డి తెలిపారు. తొలి రోజు 112 కేంద్రాల్లో జరిగే సెట్‌కు 28,870 మంది హాజరవుతారని తెలిపారు. తొలి రోజు సెట్ పేపర్‌ను ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, జేఎన్టీయూహెచ్ వీసీ టీకే రెడ్డి విడుదల చేస్తారు. జేఎన్టీయూహెచ్‌లో జరిగే ఈ కార్యక్రమానికి మండలి కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ కూడా హాజరవుతారు.

వార్త, హైదరాబాద్, మంగళవారం 29, ఏప్రిల్ 2025

# దోస్త్ నోటిఫికేషన్ మరిచిన ఉన్నత విద్యామండలి

## యేటా ఇంటర్ ఫలితాలు వచ్చిన ఒకటి, రెండు రోజుల్లోనే ఇచ్చేవారు

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్) నోటిఫికేషన్‌ను ఇవ్వడం తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మరచి పోయినట్టుంది. ప్రతి ఏడాది ఇంటర్మీడియట్ వార్షిక ఫలితాలు వెలువడిన ఒకటి, రెండు రోజుల్లోనే దోస్త్ నోటిఫికేషన్‌ను ఉన్నత విద్యా మండలి జారీ చేస్తూ వస్తోంది. గత నాలుగైదేళ్లుగా ఇంటర్ ఫలితాలు వచ్చిన రెండు, మూడు రోజుల్లోనే జారీ చేసేవారు. అయితే ఈ ఏడాది ఇంటర్ పలితాలు ఇచ్చి వారం గడుస్తున్నప్పటికీ ఇప్పటి వరకు దోస్త్ నోటిఫికేషన్‌పై ఉన్నత విద్యా మండలి ఉలుకు లేదు పలుకు లేదు. అయితే మే మొదటి వారంలో దోస్త్ నోటిఫికేషన్‌ను జారీ చేసే యోచనలో ఉన్నత విద్యా మండలి ఉన్నట్టు తెలుస్తోంది. దోస్త్ నోటిఫికేషన్ ఆలస్యం కావడానికి దోస్త్ కన్వీనర్ ఎంపిక ఒక కారణంగా తెలుస్తోంది. తెలంగాణ ఉన్నత విద్యా మండలిలో చైర్మన్‌తోపాటు ఇద్దరు వైస్‌చైర్మన్లు ఉంటారు. వారిలో వైస్‌చైర్మన్-1గా ఉన్నవారు దోస్త్‌కి కన్వీనర్‌గా ఉంటారు. ఉన్నత విద్యా మండలి నిబంధనల్లో ఇదే అంశం చేర్చబడింది. అయితే ఈ సారి దోస్త్ కన్వీనర్‌గా ఇద్దరు వైస్‌ఛైర్మన్లలో ఎవరిని కన్వీనర్‌గా నియమించాలనే అంశంపై తర్జనభర్జన పడుతున్నట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత చైర్మన్‌గా ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డిని, వైస్ ఛైర్మన్-1గా ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తంను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే అప్పటికే వైస్ చైర్మన్-2గా కొనసాగుతున్న ఎస్‌కె మహమూద్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం తొలగించ కుండా కొత్తగా కేవలం ఛైర్మన్, వైస్ ఛైర్మన్-1లను మాత్రమే నియమించింది. గత ఏడాది కూడా ఇటువంటి ఇబ్బందికర పరిస్థితే ఎదురుకావడంతో.. అప్పుడు ఛైర్మన్‌గా ఉన్న ప్రొఫెసర్ లింబాద్రిని దోస్త్ కన్వీనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాల్సి వచ్చింది. ఇప్పుడు కూడా అలాగే ప్రస్తుతం చైర్మన్‌గా ఉన్న ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డిని దోస్త్ కన్వీనర్‌గా కొనసాగించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే మే మొదటి వారంలో దోస్త్ నోటిఫికేషన్‌ను జారీ చేసే యోచనలో ఉన్నట్టు తెలిసింది. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 1054 ప్రైవేటు డిగ్రీ కాలేజీలు.. మరో 139 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. వాటిలో సుమారు 4.26 లక్షల సీట్లు అందుబాటులో ఉన్నాయి. కొన్ని ప్రైవేటు కాలేజీలకు కొత్త కోర్సులకు అనుమతి ఇస్తే మరికొన్ని సీట్లు పెరిగే అవకాశం ఉంటుంది.

ప్రభాత వెలుగు
బుధవారం | హైదరాబాద్
30.04.2025
www.v6velugu.com

# ఎప్సెట్ ఎగ్జామ్స్ షురూ

- ఫార్మసీ అగ్రికల్చర్ స్ట్రీమ్ పరీక్షలకు 53,705 మంది అటెండ్



**హైదరాబాద్, వెలుగు:** రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే టీజీ ఎప్ సెట్ ఎగ్జామ్స్ మంగళవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్ స్టూడెంట్లకు 112 పరీక్షా కేంద్రాల్లో ఎగ్జామ్స్ నిర్వహించారు. రెండు సెషన్లలో కలిపి 57,664 మందికి 53,705 (93.13%) మంది పరీక్షకు అటెండ్ అయ్యారు. మరో 3,959 మంది వివిధ కారణాలతో పరీక్షలకు హాజరు కాలేదు. కాగా, ఎప్ సెట్ పరీక్షలను హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ బాలకిష్టారెడ్డి, జేఎన్టీయూ వీసీ కిషన్ కుమార్ రెడ్డి, వర్సిటీ రెక్టర్, ఎప్ సెట్ కో కన్వీనర్ విజయకుమార్ రెడ్డి, కౌన్సిల్ వైస్ చైర్మన్ శ్రీరామ్ వెంకటేశ్, ఎప్ సెట్ కన్వీనర్ దీన్ కుమార్, వర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు తదితరులు పర్యవేక్షించారు. బుధవారం కూడా అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్ స్టూడెంట్లకు పరీక్షలు జరగనున్నాయి. మే 2 నుంచి 4 వరకు ఇంజినీరింగ్ స్ట్రీమ్ కు పరీక్షలు నిర్వహించనున్నారు. నిర్ణీత టైమ్కు రెండు గంటల ముందు నుంచే స్టూడెంట్లు, పేరెంట్స్ సెంటర్లకు చేరుకున్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద సౌకర్యాలు ఏర్పాటు చేయాలని పేరెంట్స్ కోరుతున్నారు.

బుధవారం । 30 । ఏప్రిల్ । 2025
హైదరాబాద్ । www.sakshi.com

## లా సెట్‌కు మెడిసిన్, ఇంజనీరింగ్

# విద్యార్థులు అర్హులు

### నేటితో ముగియనున్న లాసెట్ గడువు

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): లా సెట్–2025కు మెడిసిన్, ఇంజనీరింగ్ విద్యార్థులతో ఏదేని డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు కూడా అర్హులని టీఎస్ లాసెట్ కన్వీనర్ విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా దరఖాస్తుల స్వీకరణ గడువు బుధవారంతో ముగియనున్నట్లు పేర్కొన్నారు. ఇంత వరకు 46,880 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు లాసెట్ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని సూచించారు.

ఆంధ్రజ్యోతి హైదరాబాద్ • బుధవారం 30 ఏప్రిల్ 2025



సికింద్రాబాద్, ఎల్బీనగర్‌లలో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు



# ఎప్‌సెట్‌కు 92.18 శాతం హాజరు

## నీట్ ప్రిపరేషన్‌తో కొంతమంది దూరం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నగరంలో తొలిరోజు జరిగిన ఎప్‌సెట్‌కు 92.18 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 39,332 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 36,256 మంది హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. 3,076మంది పరీక్షలకు డుమ్మా కొట్టారు. మరో నాలుగు రోజుల్లో జాతీయ స్థాయి నీట్ పరీక్ష ఉండడంతో ఆ ప్రిపరేషన్‌లో ఉన్న వారంతా అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ పరీక్షకు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల నుంచి కూడా ఎక్కువమంది అభ్యర్థులు ఎప్‌సెట్ రాసేందుకు హైదరాబాద్‌లోని పరీక్షాకేంద్రాలను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. అభ్యర్థుల వెంట తల్లిదండ్రులు రావడంతో పరీక్షాకేంద్రాల వద్ద రద్దీ కనిపించింది. ట్రాఫిక్ జామ్‌కారణంగా కొందరు ఆలస్యంగా రావడం, ఆధార్‌కార్డు, హాల్‌టికెట్లు లేని కారణంగా మరికొందరు అభ్యర్థులను దుండిగల్, బాచుపల్లి, మౌలాలి ప్రాంతాల్లోని పరీక్షా కేంద్రాల నిర్వాహకులు లోనికి అనుమతించలేదు.

**ఉదయం ఫిజిక్స్.. మధ్యాహ్నం కెమిస్ట్రీ కఠినం**

ఎప్‌సెట్ తొలిరోజు రెండు సెషన్లలో పరీక్షలు జరగ్గా ఉదయం సెషన్‌లో ఫిజిక్స్ ప్రశ్నలు కఠినంగా వచ్చాయని, మధ్యాహ్నం సెషన్‌లో కెమిస్ట్రీ ప్రశ్నలు అర్థంకాక ఇబ్బందులు పడ్డామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. నెగిటివ్ మార్కులు లేనందున అన్ని ప్రశ్నలకూ జవాబులిచ్చి మమ అనిపించామని కొందరు పేర్కొన్నారు.

ఈనాడు బుధవారం ఏప్రిల్ 30, 2025

# 1న దోస్త్ షెడ్యూల్!

ఈనాడు, హైదరాబాద్: డిగ్రీ ప్రవేశాలకు దోస్త్ నోటిఫికేషన్, షెడ్యూల్‌ను మే 1న విడుదల చేయనున్నారు. ఇంటర్ ఫలితాలు విడుదలై వారం అవుతున్నా దోస్త్ నోటిఫికేషన్ వెలువడకపోవడంపై 'ఈనాడు'లో మంగళవారం దోస్త్ నోటిఫికేషన్ ఎప్పుడు? శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈక్రమంలో సీఎం కార్యాలయ అధికారి మాణిక్యరాజ్, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా తదితరులు విద్యామండలి అధికారులను ఆరా తీసినట్లు సమాచారం. సమస్యను వివరించడంతోపాటు విద్యాశాఖలోని ఓ అధికారి జోక్యం ఎక్కువైందని విద్యామండలి అధికారులు పేర్కొన్నట్లు తెలిసింది. వారి సూచనలతో మే 1న షెడ్యూల్ జారీకి ఏర్పాట్లు చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ హైదరాబాద్ బుధవారం 30 ఏప్రిల్ 2025

# మధ్యస్తంగా ఎప్‌సెట్ ప్రశ్నలు

- పరీక్షలకు నాలుగువేల మంది గైర్హాజరు

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ) : ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఎప్‌సెట్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం విద్యార్థులకు ఉదయం, మధ్యాహ్నం సెషన్‌లో పరీక్షలు నిర్వహించారు. ప్రశ్నలు మధ్యస్తం నుంచి కాస్త కఠినంగా ఉన్నట్టు విద్యార్థులు తెలిపారు. మొదటి సెషన్‌లో ఫిజిక్స్ ప్రశ్నలు కఠినంగా వచ్చాయి. జువాలజీ, కెమిస్ట్రీ ప్రశ్నలు సులభంగా ఇవ్వగా, బోటనీ ప్రశ్నలు మధ్యస్తంగా ఉన్నట్టు విద్యార్థులు తెలిపారు. మధ్యాహ్నం సెషన్‌లోనూ ప్రశ్నలు ఇదే తీరులో ఉన్నట్టు విద్యార్థులు వెల్లడించారు. ఎప్‌సెట్ పరీక్షల తొలి రోజే 3,959 మంది గైర్హాజరయ్యారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి పలు పరీక్షాకేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. ఎప్‌సెట్ పరీక్షకు నిమిషం ఆలస్యంగా వచ్చి ఓ విద్యార్థిని పరీక్షరాసే అవకాశాన్ని కోల్పోయింది. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన స్పందన మధ్యాహ్నం సెషన్‌లో ఎప్‌సెట్ పరీక్ష రాసేందుకు ఘట్‌కేసర్‌లోని శ్రీనిధి కాలేజీకి వచ్చింది. కాలేజీ అడ్రస్ తెలియకపోవడంతో అడుక్కుంటూ వచ్చే సరికి 3:01 నిమిషాలయ్యింది. నిమిషం ఆలస్యంగా రావడంతో అధికారులు పరీక్షకు అనుమతించలేదు.

వార్త, హైదరాబాద్, బుధవారం 30, ఏప్రిల్ 2025

# 'ఎప్‌సెట్'కి 93% విద్యార్థులు హాజరు

ఘ[illegible] [illegible]ర్వహించగా ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ తెలంగాణ [illegible] సెట్-2025 పరీక్షల సరళిని బాలకిష్టారెడ్డి, జేఎన్‌టీయూ వీసీ [illegible] ప్రొఫెసర్ రెడ్డి, రెక్టార్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ రెడ్డి, ఉన్నత [illegible] మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, ఎప్ సెట్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ డీన్ కుమార్ పరిశీలించారు. ఎప్ సెట్‌లో భాగంగా అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం పరీక్షను నేడు(బుధవారం) కూడా నిర్వహించనున్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 112 కేంద్రాలను ఏర్పాటు చేశారు.

పరీక్షలను రెండు సెషన్‌లలో నిర్వహించనున్నారు. నిమిషం ఆలస్యం అయినా పరీక్షా కేంద్రంలోనికి అనుమతించ లేదు. మంగళవారం నుంచి ప్రారంభమైన ఎప్ సెట్ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం సెషన్ 9 గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన పరీక్షలకు 28,834 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో26,741 మంది పరీక్షలకు హాజరయ్యారు.

పరీక్షకు దరఖాస్తు చేసుకున్న వారిలో 92.74 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇక మధ్యాహ్నం సెషన్‌లో 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగిన పరీక్షలకు 28,830 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 26,964 మంది హాజరయ్యారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న వారిలో 93.53 శాతం మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రంలోనికి గంటన్నర ముందు నుంచే అనుమతి ఇచ్చారు. నేడు కూడా అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్ష కొనసాగనుంది. మే 2 నుంచి 4 వరకు ఇంజనీరింగ్ పరీక్ష నిర్వహించనున్నారు. ఎప్‌సెట్‌కి 3,06,796 మంది దరఖాస్తు చేసుకున్నారు. మే 2 నుంచి 4 వరకు జరిగే ఇంజనీరింగ్ పరీక్షలకు 124 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలను రెండు సెషన్‌లలో నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు .. తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈసారి మొదటిసారిగా విద్యార్థులకు జారీ చేసిన హాల్ టికెట్లపై క్విక్ రెస్పాన్స్(క్యూఆర్) కోడ్‌ను ముద్రించారు. క్యూఆర్ కోడ్ మూలంగా విద్యార్థులు తమ పరీక్షా కేంద్రాలను తెలుసుకోవడం సులభతరం అయింది.

మన తెలంగాణ
బుధవారం 30, ఏప్రిల్ 2025

# ఎప్‌సెట్‌కు తొలిరోజు 93.53 శాతం హాజరు



మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో ఇఎపి సెట్ ఆన్‌లైన్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగానికి తొలి రోజు జరిగిన పరీక్షలు సజావుగా జరిగాయి. రెండు సెషన్లలో పరీక్షలు జరుగగా, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 వరకు మరో సెషన్ నిర్వహించారు. మొదటి సెషన్‌కు 28,834 మంది విద్యార్థులకు గానూ 26,741 మంది(92.74 శాతం) హాజరు కాగా, రెండో సెషన్‌కు 28,830 మందికి గానూ 26,964 మంది విద్యార్థులు(93.53 శాతం) హాజరయ్యారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ వి.బాలకిష్టారెడ్డి మంగళవారం పలు పరీక్షా కేంద్రాలను సందర్శించి తనిఖీ చేశారు. ఆయా కేంద్రాలలో వసతులను ఆయన పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఆన్‌లైన్ పరీక్షల నేపథ్యంలో పరీక్షా కేంద్రాలలో విద్యుత్ అంతరాయం లేకుండా తగిన చర్యలు చేపట్టారు.

నవతెలంగాణ బుధవారం 30 ఏప్రిల్ 2025

# ఎప్‌సెట్ పరీక్షలు ప్రారంభం

## మొదటిరోజు ఉదయం 92.74 శాతం, మధ్యాహ్నం 93.53 శాతం హాజరు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ రాతపరీక్షలు ఆన్‌లైన్‌లో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కోకన్వీనర్ విజయ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళవారం అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలను నిర్వహించామని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం మొదటి విడతకు 28,834 మంది దరఖాస్తు చేయగా, 26,741 (92.74 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. 2,093 (7.26 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మధ్యాహ్నం రెండో విడతకు 28,830 మంది దరఖాస్తు చేస్తే 26,964 (93.53 శాతం) మంది అభ్యర్థులు పరీక్ష రాశారని వివరించారు. 1,866 (6.47 శాతం) మంది పరీక్షకు హాజరు కాలేదని తెలిపారు. ఈ పరీక్షలను ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి, ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, జేఎన్టీయూ హైదరాబాద్ వీసీ టి కిషన్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ కె వెంకటేశ్వరరావు పర్యవేక్షించారని వివరించారు. బాలకిష్టారెడ్డి హైదరాబాద్‌లోని పలు పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు.

THE HINDU
Hyderabad
Wednesday, April 30, 2025
HYDERABAD

# Over 90% attendance on Day One of EAPCET

**The Hindu Bureau**
HYDERABAD

The Telangana Engineering, Agriculture and Pharmacy Common Entrance Test (EAPCET) began on Tuesday with 92.74% attendance recorded in the forenoon session and 93.53% attendance recorded in the afternoon session.

A total of 28,834 candidates had registered for the Agriculture and Pharmacy (A&P) stream.



Relatives take shelter under trees as candidates appear for the Telangana EAPCET in Hyderabad on Tuesday. NAGARA GOPAL

**May 2-5 next exam**

The two-day exam will test candidates in the A&P stream. The May 2-5 exam will test candidates in the Engineering stream.

According to Jawaharlal Nehru Technological University (JNTU) Hyderabad, the exam authority on behalf of the Telangana Council of Higher Education (TGCHE), Day One test concluded smoothly. Elaborate arrangements were made in over 100 centres across the State.

**Adilabad zone, with the least allotted candidate count of 100, recorded 100% attendance in the afternoon session on Tuesday**

As per the attendance report, Adilabad zone, with a least allotted candidate count of 100, recorded 100% attendance in the afternoon session on Tuesday. Hyderabad, divided into four zones, had the highest strength of nearly 19,700 candidates.

TGCHE Chairman V. Balakista Reddy, JNTU-Hyderabad Vice-Chancellor Kishen Kumar Reddy, Convenor of EAPCET B. Dean Kumar and five other senior officials, and others were present during the initial configuration drive of the computer-based test on Tuesday.